

అమ్మ
రూ॥ 350/-
పేజీలు: 400

ప్రతులకు:
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ(నాగోల్), హైదరాబాద్-68, ఫోన్: 29884454/53
Email ID: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
అబిడ్స్, బండ్లగూడ, హిమాయత్‌నగర్ (హైదరాబాద్) హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★★


ప్రైవేటు కళాశాల యాజమాన్యాలతో రాష్ట్ర ప్రభుత్వ చర్చలు సఫలమయ్యాయి.రూ.600కోట్ల బకాయిలను విడుదల త్వరితగతిన విడుదల చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం హామీనిచ్చింది. హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి, దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు కళాశాల యాజమాన్యాల ప్రతినిధులతో చర్చలు నిర్వహించారు. గత నాలుగేళ్లుగా ఫీజు రియంబర్స్‌మెంట్ బకాయిలను చెల్లించకపోవడాన్ని నిరసిస్తూ వృత్తి విద్యాకళాశాలల సోమవారం నుంచి బంద్ పాటిస్తున్న విషయం తెలిసిందే.


సంపుటి 08, సంచిక: 286 | మంగళవారం | 16-09-2025 | ఖమ్మం | Published from: Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00




## గ్రామాలలో వీధి దీపాల బాధ్యతలు సర్పంచ్‌లకే

- రాష్ట్రంలో అన్ని ఎల్ఇడి లైట్లు హైదరాబాద్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌తో అనుసంధానం
- కొత్త ఎల్ఇడిల ఏర్పాటు, వాటి నిర్వహణ అధికారం గ్రామ పంచాయతీ పరిధిలోనే
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశం
- మున్సిపల్, పంచాయతీ రాజ్, జిహెచ్ఎంసి అధికారులతో సమీక్ష

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలోని అన్ని గ్రామాల్లో వీధి దీపాల ఏర్పాటు, వాటి నిర్వహణ బాధ్యతలను సర్పంచ్‌లకే అప్పగించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆదేశించారు. రాష్ట్రంలో అన్ని ఎల్ఇడి లైట్లను హైదరాబాద్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌తో అనుసంధానం చేయాలన్నారు. గ్రామాల్లో అవసరమైనన్ని కొత్త ఎల్ఇడి లైట్లను ఏర్పాటు చేయడంతో పాటు వాటిని సమర్థవంతంగా నిర్వహించే నిర్వహణ అధికారం గ్రామ పంచాయతీల పరిధిలోనే ఉండాలని, రాష్ట్రంలోని ఎల్ఇడి వీధి దీపాలపై పక్కాగా పర్యవేక్షించాలని అధికారులను సూచించారు. గ్రామాల్లో ఇప్పటికే అందుబాటులో ఉన్న ఎల్ఇడి లైట్లు వెలుగుతున్నాయా? లేదా?, ఇంకా కొత్తగా ఎన్ని అవసరం అనేది సమగ్రంగా అంచనా వేయాలని, ప్రతి పోల్ సర్వే చేయాలని పంచాయతీ రాజ్ శాఖ అధికారులను సిఎం ఆదేశించారు. హైదరాబాద్‌లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో మున్సిపల్, పంచాయతీ రాజ్, జిహెచ్ఎంసి అధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో సిఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, సిఎంఒ ముఖ్య కార్యదర్శి శేషాద్రి, సిఎంఒ కార్యదర్శి మాణిక్ రాజ్, పంచాయతీ రాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి ఎన్.శ్రీధర్, కోర్ అర్బన్ ఏరియా మున్సిపల్ సెక్రటరీ ఇలంబర్తి, మున్సిపల్ శాఖ కార్యదర్శి శ్రీదేవి, జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి కర్ణన్, పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ శ్రీ జన పాల్గొన్నారు. రాష్ట్రంలోని అన్ని గ్రామాల పరిధిలో 16.16 లక్షల ఎల్ఇడి లైట్లు ఉన్నాయని, వరంగల్, నల్లగొండ, జనగాం, నారాయణపేట జిల్లాల్లో తరువాయి 2లో

## వక్ఫ్ సవరణ చట్టం–2025
# కీలక నిబంధనలు నిలిపివేత




- వక్ఫ్ దాతకు ఐదేళ్ళ అర్హత నిబంధన ఏకపక్షమే
- వక్ఫ్‌బోర్డులలో ముస్లిమేతరులు నలుగురు మించకూడదు
- సిఇఒల నియామకంలో ముస్లింలకు ప్రాధాన్యం ఇవ్వాలి
- సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా సహా పలువురు వేసిన పిటిషన్లపై సుప్రీం ఉత్తర్వులు
- మొత్తం చట్టం అమలు నిలిపివేతకు తిరస్కృతి

**న్యూఢిల్లీ:** మతాలమధ్య ఉద్రిక్తతలు,ఘర్షణలకు దారితీసేవిధంగా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తెచ్చిన వక్ఫ్(సవరణ)చట్టం–2025లో ఉన్న అనేక అభ్యంతరకరమైన నిబంధనలలో కొన్నింటిపై సుప్రీం కోర్టు స్టే మంజూరు చేసింది. ముఖ్యంగా, ఐదేళ్ళుగా ముస్లిం మతాన్ని ఆచరిస్తున్నవారు మాత్రమే వక్ఫ్ ఆస్తులు సృష్టించేందుకు అర్హులని కొత్తగా సవరణచట్టంలో తీసుకువచ్చిన నిబంధనతో పాటు మరికొన్ని కీలక నిబంధనలను అమలు చేయకుండా స్తంభింపజేస్తూ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్, జస్టిస్ అగస్టి న్ జార్జ్ మాసిహ్ ధర్మాసనం ఉత్తర్వు ఇచ్చింది. వక్ఫ్ ఆస్తుల ప్రతిపత్తిని నిర్ధారించడానికి కలెక్టర్లకు ఇచ్చిన అధికారాలను కూడా ధర్మాసనం స్తంభింపజేసింది. మరొక నిబంధన ప్రకారం సంబంధిత వక్ఫ్ ఆస్తి గనుక ప్రభుత్వ ఆస్తి అని నిర్దేశిత అధికారి నిర్ణయిస్తే, ఆ అధికారి రెవెన్యూ రికార్డులలో అందుకు తగినట్లుగా దిద్దుబాటు చర్యలు తీసుకోవాలని, దీనిపై రాష్ట్ర ప్రభుత్వానికి ఒక నివేదికను తక్షణం సమర్పించాలని ఆదేశించింది. లేకపోతే ఇది తదుపరి హైకోర్టు ఉత్తర్వులకు కట్టుబడుతుందని వివరించింది. కేంద్ర వక్ఫ్ బోర్డులో ఉండే మొత్తం 20 మంది సభ్యులలో ముస్లిమేతరులు నలుగురు కంటే ఎక్కువమంది ఉండకూడదని,రాష్ట్రాలలోని వక్ఫ్ బోర్డులలో ఉండే మొత్తం 11 మంది సభ్యులలో ముస్లిమేతరులు ముగ్గురు కంటే ఎటక్కువమంది ఉండకూడదని ఆదేశించింది. కాగా సెక్షన్ 23 నిబంధనపై స్టే ఉత్తర్వు ఇవ్వకుండా, వక్ఫ్‌బోర్డుల చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ల నియామకాలపై తరువాయి 2లో

## సిపిఐ వైఖరి ప్రామాణికమని రుజువైంది

సుప్రీం తీర్పుపై సిపిఐ జాతీయ కార్యదర్శివర్గం హర్షం



**న్యూఢిల్లీ:** వక్ఫ్ శాసనాలపై భారత కమ్యూనిస్టుపార్టీ (సిపిఐ) వైఖరి ప్రామాణికమైనదని సుప్రీంకోర్టు ఉత్తర్వులతో రుజువైందని పార్టీ జాతీయ కార్యదర్శివర్గం ఒక ప్రకటనలో పేర్కొంది. వక్ఫ్ సవరణ చట్టం–2025లో అభ్యంతరకరమైన కొన్ని నిబంధనల అమలును నిలిపివేస్తూ సుప్రీంకోర్టు సోమవారం ఉత్తర్వులు జారీచేయడంపై హర్షం ప్రకటించింది. సిపిఐ ప్రధాన కార్యదర్శి తరువాయి 2లో

## వక్ఫ్‌భూములపై కేంద్రం కుట్రకు ఎదురుదెబ్బ: కాంగ్రెస్



**న్యూఢిల్లీ:** వివాదాస్పద వక్ఫ్ సవరణ చట్టం2025పై సుప్రీం కోర్టు మధ్యంతర ఉత్తర్వులపై ప్రతిపక్షాలు హర్షం వ్యక్తం చేశాయి. వక్ఫ్ భూముల లాక్కోవడానికి చేసిన ప్రయత్నానికి చెక్ పెట్టేలా సుప్రీం ఉత్తర్వులు ఉన్నాయని కాంగ్రెస్ వెల్లడించింది. ఈ చట్టంలో కీలక నిబంధనలపై సుప్రీం పాక్షికంగా స్టే విధించడాన్ని స్వాగతిస్తున్నట్లు వామపక్షాలు పేర్కొన్నాయి. మైనారిటీలతో, భాగస్వామ్య సంఘాలతో సంప్రదింపులు జరపకుండా వక్ఫ్ వవరణ చట్టాన్ని బిజెపి హడావిడిగా తీసుకొచ్చిందని రుజువైందని వ్యాఖ్యానించాయి. సుప్రీం కోర్టు ప్రశ్నలకు, తరువాయి 2లో

## రాజ్యాంగ విలువలకు రక్షణ : డిఎంకె

## తుది తీర్పుపై ఆశలు : ముస్లిం లా బోర్డులు

## మాకు సమస్య లేదు : మునంబం వాసులు

## వైద్యం వికటించి విద్యార్థిని మృతి

- ఆర్ఎంపి వైద్యుడి నిర్వాకంతో ప్రాణాలు విడిచిన బాలిక
- సూర్యాపేట జిల్లా చిలుకూరు మండలం బేతవోలులో ఘటన

ప్రజాపక్షం/ (చిలుకూరు) కోదాడ



ఆరోగ్య పరిస్థితి పూర్తిగా అంచనా వేయకుండా ఓ ఆర్ఎంపి డాక్టర్ ఇంజెక్షన్ చేయడంతో బాలిక మృతి చెందిన సంఘటన సోమవారం కోదాడ నియోజకవర్గంలోని చిలుకూరు మండలం బేతవోలు గ్రామంలో చోటుచేసుకుంది. మృతురాలి తండ్రి, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. మేళ్లచెరువు మండలం రామాపురానికి చెందిన షేక్ సుహానా(14) నడిగూడెం కస్తూర్బా పాఠశాలలో 8వ తరగతి చదువుతోంది. నాలుగు రోజులుగా విపరీతమైన జ్వరంతో బాధ పడుతున్న ఆ బాలిక మూడు రోజుల క్రితం చిలుకూరు మండలం బేతవోలులోని తన అమ్మమ్మ ఇంటికి వచ్చింది. అక్కడ వైద్యం చేయించుకుటున్న ఆమె ఆరోగ్య పరిస్థితిలో మార్పు లేకపోవడంతో సోమవారం మధ్యాహ్నం స్థానిక ఆర్ఎంపి దగ్గరకు తీసుకెళ్లారు. అప్పటికే బాలికకు డెంగీ పాజిటివ్ అని వైద్య పరీక్షల్లో నిర్ధరణ అయింది. దీంతో బాలిక సరైన తరువాయి 12లో

## ఉరుములు, మెరుపులతో భారీ వర్షాలు

- మూడురోజుల పాటు 30–40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు
- హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరిక
- అప్రమత్తంగా ఉండాలని సూచన

ప్రజాపక్షం/హైదరాబాద్



తెలంగాణలో మరో మూడురోజులు భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. తూర్పు తెలంగాణ సమీపంలోని విదర్భ ప్రాంతంలో ఉన్న అల్పపీడనం ఇప్పుడు బలహీనపడి ఉపరితల ఆవర్తనంగా కొనసాగుతోంది. ఇది వాయువ్య దిశగా కదులుతూ, సముద్ర మట్టానికి 3.1 కి.మీ. ఎత్తులో కేంద్రీకృతమై ఉంది. మరోవైపు, ఉత్తర తెలంగాణ నుంచి దక్షిణ మహారాష్ట్ర వరకు ఉన్న ఉపరితల ఆవర్తనం ఈ రోజు బలహీనపడింది. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఈ మూడు రోజులు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురవడంతో పాటు గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురు తరువాయి 12లో

## గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ వ్యాఖ్యలు సరికాదు

- సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ

ప్రజాపక్షం/హైదరాబాద్



తెలంగాణ విముక్తి పోరాటం లో 4 వేల మంది వీర యోధు లు తమ ప్రాణాలను తృణ ప్రాయంగా అర్పిస్తే వారి త్యాగాలను స్మరించాల్సిన తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆర్ఎస్ఎస్ తొత్తుగా మాట్లాడడం సరికాదని సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణను విముక్తి చేసిన ఉద్యమంపై గవర్నర్ అలా మాట్లాడడం ఆర్ఎస్ఎస్ అజెండాను మోయడమే అవుతుందని పేర్కొన్నారు.ఆర్ఎస్ఎస్ ను నిషేధించిన సర్దార్ వల్లభాయ్ పటేల్ పేరుతో రాజకీయం చేయడం సిగ్గు చేటని పేర్కొన్నారు. తెలంగాణ, ఎపి కేరళ, తమిళనాడు సహా తరువాయి 12లో

## ఇసి పద్ధతి చట్టవిరుద్ధమైతే ఎస్ఐఆర్ పూర్తిగా రద్దు

- హెచ్చరించిన సుప్రీంకోర్టు
- అక్టోబరు 7న అన్ని పిటిషన్లపై తుది వాదనలు

**న్యూఢిల్లీ :** బిహార్ ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కసరత్తు సమయంలో భారత ఎన్నికల సంఘం (ఇసిఐ) అనుసరించిన పద్ధతిలో ఏదైనా చట్టవిరుద్ధంగా కనిపిస్తే 'మొత్తం ఎస్ఐఆర్'ను రద్దు చేస్తామని సోమవారం సుప్రీంకోర్టు ఎన్నికల సంఘాన్ని (ఇసి)హెచ్చరించింది. అయితే ఒక రాజ్యాంగబద్ధమైన అధికారం కలిగిగిన సంస్థగా ఎన్నికల సంఘం ఏ దశలోనైనా నిబంధనలను సరిగ్గానే పాటించిందని తాము భావిస్తున్నామని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. న్యాయమూర్తులు జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చి నేతృత్వంలోని ద్విసభ్య ధర్మాసనం బిహార్ ప్రత్యేక సమగ్ర సవరణ చెల్లుబాటుపై తుది వాదనలు వినడానికి అక్టోబరు 7ను ఖరారు చేసింది. 'ఏదైనా ఒక్క ముక్క'లో అభిప్రాయం చెప్పడానికి నిరాకరిస్తూ, బిహార్ ప్రత్యేక సమగ్ర సవరణ విషయంలో మా తీర్పు దేశం అంతటికీ వర్తిస్తుందని ధర్మాసనం తెలిపింది. దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితా సవరణ కోసం ఎన్నికల సంఘం ఒకే తరహా కసరత్తును ఆపలేమని తరువాయి 12లో



## టర్కీ దేశాధ్యక్షుడు రాజీనామా చేయాల్సిందే

### అంకారాలో వేలాదిమంది నిరసన ప్రదర్శన

**అంకారా:** టర్కీలో ప్రతిపక్షాలను అణచివేసేందుకు ప్రభుత్వం చేస్తున్న కుట్రలకు వ్యతిరేకంగా ఆ దేశ రాజధాని అంకారాలో వేలాదిమంది ప్రజలు నిరసన ప్రదర్శన జరిపారు. ప్రధాన ప్రతిపక్షం రిపబ్లికన్ పీపుల్స్ పార్టీ (సిహెచ్‌పి) నాయకుడు ఓజుర్గ్ ఓజుల్‌ను కేసుల్లో ఇరికించేందుకు ప్రభుత్వమే కుట్ర చేసిందని దేశాధ్యక్షుడు రెసెప్ తయ్యిప్ ఎర్డొగాన్ తన పదవికి రాజీనామా చేయాలని ప్రదర్శకులు నినాదాలు చేశారు. అంకారాలోని టాండోగాన్ స్క్వేర్ వద్ద 50,000 మందికిపైగా ప్రజలు గుమిగూడి సభ నిర్వహించారు. రెండు దశాబ్దాలకుపైగా అధికారంలో కొనసాగుతున్న ఎర్డొగాన్ దేశ సైన్యం, న్యాయస్థానం, కేంద్ర బ్యాంకు,మీడియా సహా ఇతర ప్రభుత్వ వ్యవస్థలన్నింటినీ తన గుప్పెట్లో పెట్టుకుని తరువాయి 12లో

## మావోయిస్టు సీనియర్ కమాండర్ సహదేవ్ ఎన్‌కౌంటర్

- మరో ఇద్దరు నక్సల్స్ మృతి
- సహదేవ్ తలపై రూ. కోటి రివార్డు



**రాంచి:** మావోయిస్టులకు మరో భారీ ఎదుదెబ్బ తగిలింది. ఆ సంస్థకు చెందిన ముగ్గురు మావోయిస్టులను జార్ఖండ్ రాష్ట్ర హజారీబాగ్ జిల్లాలో భద్రతా దళాలు ఎన్‌కౌంటర్ చేశాయి. వీరిలో సీనియర్ క మాండర్ సహదేవ్ సోరెన్ కూడా ఉన్నారు. 209 బెటాలియన్ కో బ్రా దళాలు గోర్హర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పంతిత్రి అడవుల్లో జా యింట్ ఆపరేషన్ చేపట్టగా ఈ ఘటన చోటుచేసుకొంది. సహదేవ్ సోరెన్‌ను మావోయిస్టు కేంద్రకమిటీ సభ్యుడిగా భావిస్తున్నారు. ఆ యనపై రూ.1 కోటి రివార్డు ఉంది. ఇక మరో మావోయిస్టు రఘునాథ్ హేమంబరం స్పెషల్ ఏరియా కమిటీ సభ్యుడు. ఆయనపై రూ.25లక్షల బహుమతి ఉంది. ఇక జోనల్ కమిటీ సభ్యుడు విర్సెన్ గంజూ కూడా వీరిలో ఉన్నాడు. ఆయనపై ప్రభుత్వం రూ.10లక్షల బహుమతిని ప్రకటించింది. ఈ ఎన్‌కౌంటర్ స్థలిలో తాము మూడు ఎకె 47 రైఫిళ్లను తరువాయి 2లో

## విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలొద్దు

- బోధన రుసుం బకాయిలు, స్కాలర్‌షిప్‌లను తక్షణమే విడుదల చేయాలి
- కాలేజీల బంద్‌ను నివారించాలని డిమాండ్ చేస్తూ ఎఐఎస్ఎఫ్ నిరసన ప్రదర్శన

ప్రజాపక్షం/హైదరాబాద్

విద్యార్థుల బోధన రుసుంతో పాటు స్కాలర్‌షిప్‌లను తక్షణమే విడుదల చేసి వారి భవిష్యత్తును కాపాడాలని ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కసిరెడ్డి మణికంఠ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యార్థుల పెండింగ్ ఫీజులు, స్కాలర్‌షిప్‌లను విడుదల తరువాయి 2లో




కమ్యూనిస్టు పార్టీ పోరాటాలు, త్యాగాలతోనే హైదరాబాదు సంస్థానం భారతదేశంలో విలీనం **03**

**సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి**

## కేంద్రమంత్రి బండిపై కెటిఆర్ పరువునష్టం దావా

ప్రజాపక్షం/హైదరాబాద్



కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ పైన బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు హైదరాబాద్‌లోని సిటీ సివిల్ కోర్టులో పరువునష్టం దావా దాఖలు చేశారు. బండి సంజయ్‌తో పాటు కొన్ని మీడియా సంస్థలు, సోషల్ మీడియా ప్లాట్‌ఫాములపైన కూడా దావాను దాఖలు చేశారు. బండి సంజయ్ వ్యాఖ్యలు తన వ్యక్తిత్వాన్ని దెబ్బతీసేందుకు ఉద్దేశించినవని 2025 ఆగస్టు 11న లీగల్ నోటీసు పంపినప్పటికీ, బండి సంజయ్ బేషరతుగా క్షమాపణ చెప్పడానికి నిరాకరించారని, అందుకే న్యాయస్థానాన్ని ఆశ్రయించక తప్పలేదని కెటిఆర్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బండి సంజయ్ కేవలం తరువాయి 2లో




చలో చండీఘడ్

భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ)

25వ కాంగ్రెస్

21–25 సెప్టెంబర్, 2025

చండీఘడ్ (పంజాబ్)

16వ కాంగ్రెస్ - న్యూఢిల్లీ, 1995 – 6వ పేజీలో



# ప్రపంచం
WORLD NEWS

## ఇజ్రాయెల్ దాడులు శాంతికి విఘాతం
### దోహాలో అరబ్ దేశాల సదస్సు తీర్మానం

**దోహా:** ఇజ్రాయెల్ దాడులవైఖరి మధ్యప్రాచ్యంలో శాంతి–సహజీవనాలకు (పీస్ అండ్ కో–ఎగ్జిస్టెన్స్)పెద్ద విఘాతంగా మారిందని దోహాలో సోమవారం జరిగిన అరబ్–ఇస్లామిక్ దేశాల సదస్సు తీర్మానించింది. ఇజ్రాయెల్‌ను అదుపు చేయాల్సిన అవసరం ఉందని ప్రపంచదేశాలకు సదస్సు విజ్ఞప్తి చేసింది. అదేసమయంలో గాజాలో యుద్ధ విరమణకు హమాస్‌తో శాంతి చర్చల మధ్యవర్తిత్వం నుండి వైదొలగేది లేదని కూడా ఖతార్ ఒక స్పష్టత ఇచ్చింది. ఐతే దాడుల వైఖరిపై తీర్మానాన్ని ఇజ్రాయెల్ తీవ్రంగా వ్యతిరేకించింది. కానీ ఈ సదస్సులో ఆచరణాత్మకమైన చర్యలు తీసుకునేందుకు తీర్మానం చేశారా? అనే విషయం పూర్తిగా స్పష్టం కాలేదు. ఈ సదస్సుకు ముందుగా ఆదివారంనాడు అరబ్ దేశాల విదేశీమంత్రుల సదస్సు కూడా జరిగింది.

ఖతార్ ప్రధానమంత్రి అల్ తహనీ గడచిన మంగళవారం దోహాలో దాడులు జరిగినప్పటినుండీ ఇజ్రాయెల్‌పై తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. ఐక్యరాజ్యసమితి సహా ప్రపంచదేశాల మద్దతును ఆయన కూడగడుతున్నారు.

## వారం రోజుల్లో సిరియా ఎన్నికలు

### శాశ్వత రాజ్యాంగ రూపకల్పన

**డమాస్కస్:** పశ్చిమ ఆసియా దేశం సిరియా పార్లమెంటుకు ఈనెల మూడోవారంలోపు పరోక్ష ఎన్నికలు జరుగుతాయి. అంతర్జాతీయ సంస్థలు ఈ ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షిస్తాయి. సిరియా దేశ భవిష్యత్తును మలుపు తిప్పే అత్యంత కీలకమైన ఎన్నికలు ఇవే. సిరియాలో ప్రజాస్వామ్య ప్రక్రియ సానుకూలంగా ముందుకు సాగుతుందా? లేక ఏవైనా ఆకస్మిక అంతర్గత మార్పులు సంభవిస్తాయా? అని సందేహాస్పదంగా గమనిస్తున్న ప్రపంచం ఎదుట తన విశ్వాసాన్ని నిలబెట్టుకునే కీలక ఎన్నికలివే. ఈ ఎన్నికలు పూర్తిగా పరోక్ష పద్ధతిలో జరుగుతాయి. ప్రస్తుతం దేశంలో ప్రత్యక్షంగా ప్రజలు పాలకులను ఎన్నుకునే పరిస్థితులు ఏర్పడలేదు. లక్షలాదిమంది ప్రజలు ఇంకా తమ తమ ప్రాంతాలకు తిరిగి రాలే దు.

కొత్తగా ఎన్నికయ్యే పాలక మండలి సిరియాదేశానికి ఒక కొత్త, శాశ్వత రాజ్యాంగాన్ని రూపకల్పన చేసే బాధ్యతలు చేపట్టాల్సి ఉంటుంది. సిరియా ప్రజాస్వామ్య భవితకు ఇదే కీలకాంశం. ఆర్థిక సంస్కరణలను అమలుచేసి, ప్రభుత్వ వ్యవస్థలను పూర్తిస్థాయిలో పునరుద్ధరించి జనరంజకంగా తీర్చిదిద్దే బాధ్యతలు కూడా ఈ పాలకమండలి భుజస్కంధాలపైనే ఉన్నాయి. సిరియా పార్లమెంటు 'పీపుల్స్ కౌన్సిల్'లో మొత్తం 210 స్థానాలు ఉన్నాయి. ఈ స్థానాలకు ప్రజలు ప్రత్యక్షంగా సార్వత్రిక ఎన్నికల ద్వారా ప్రతినిధులను ఎన్నుకోవడానికి బదులుగా మూడు వంతులమంది సభ్యులను దేశాధ్యక్షుడు అహ్మద్ అల్–షారా ఎంపిక చేస్తారు.



మిగిలినవారిని ఆయా రాష్ట్రాలలో ఎలక్టోరల్ కాలేజీల ప్రాతిపదికపై ఎంపిక చేసి పంపుతారు. సుప్రీం ఎలక్షన్ కమిషన్ నియమించే సబ్ కమిటీల ద్వారా వివిధ రాష్ట్రాలలో జనాభా ప్రాతిపదికపై ఈ సభ్యుల ఎన్నిక జరుగుతుంది.

సుప్రీం ఎలక్షన్ కమిటీ అధిపతి మహ్మద్ అల్ తహా చెప్పిన ప్రకారం, అలెప్పో రాష్ట్రానికి 32 స్థానాలు లభించాయి. డమాస్కస్‌కు 10 స్థానాలు, పరిసర శివారు ప్రాంతాలకు 22 స్థానాలు లభించాయి. హసకా, డైర్ ఎజ్ జోర్ ప్రాంతాలకు పదేసి స్థానాలు వంతున లభించాయి. లతకియాకు 7 స్థానాలు, దారా,రక్కా ప్రాంతాలకు ఆరేసి స్థానాలు లభించాయి. టార్టస్‌కు ఐదు స్థానాలు, సువేదా, క్యునైత్రా ప్రాంతాలకు మూడేసి స్థానాలు లభించాయి. ఐతే సువేదా,హసకా,రక్కా ప్రాంతాలలో ఇంకా ఎన్నికల ప్రతినిధులను ఎన్నుకునేందుకు తగిన వాతావరణం ఏర్పడలేదని ఆగస్టు 23వ తేదీన ప్రభుత్వం ప్రకటించింది. ఈ మూడు ప్రాంతాలలోని తెగలమధ్యా ఎడతెగని హింస చెలరేగింది. సువేదా రాష్ట్రంలో డ్రూజ్ మైనారిటీ తెగల ఆధిపత్యం ఉండగా, హసకా, రక్కా ప్రాంతాలలో కుర్దిష్ తెగల ఆధిపత్యం ఉంది. వీరిమధ్యే ప్రధాన పోరాటం జరిగింది. సిరియాలో 2011 మార్చినెలలో ప్రారంభమైన అంతర్యుద్ధం 2024 డిసెంబరులో బషర్ అల్ అస్సాద్ ప్రభుత్వం కుప్పకూలిపోయిన తర్వాత ముగిసింది. అల్‌షారా పాలనలో అమెరికా, ఇతర దేశాల మద్దతుతో ప్రజాస్వామ్య పునరుద్ధరణ చర్యలు ప్రారంభమయ్యాయి. ఈ ఏడాది జనవరి 29వ తేదీన రాజధాని డమాస్కస్‌లోని అధ్యక్ష భవనంలో సిరియా విప్లవ విజయోత్సవ సదస్సు జరిగింది.

## నేపాల్‌లో ముగ్గురితో తొలిదశ మంత్రివర్గం

### అవినీతి నిర్మూలిస్తామని ప్రధాని కర్కి ప్రతిజ్ఞ



**ఖాట్మండు:** నేపాల్ తాత్కాలిక ప్రధానమంత్రి సుశీల కర్కి తొలిదశలో ముగ్గురు మంత్రులతో పొదుపుగా చిన్న మంత్రివర్గం ఏర్పాటు చేశారు. అదేవిధంగా సీనియర్ మహిళా న్యాయవాది సవితా భండారీ బారల్ దేశ అడ్వకేట్ జనరల్‌గా నియమించారు. ఒక మహిళ ఈ పదవి చేపట్టడం ఇదే మొదటిసారి. దేశాధ్యక్ష కార్యాలయం శీతల్ నివాస్ వద్ద ప్రదర్శకులు సృష్టించిన విధ్వంసకర శిథిలాల సమీపంలోనే వీరు ప్రమాణస్వీకారం చేశారు. తాత్కాలిక మంత్రివర్గాన్ని 15 మందికే పరిమితం చేస్తానని ప్రధానమంత్రి సుశీల కర్కి ముందుగానే ప్రకటించారు. అందువల్ల తదుపరి కూడా మరోసారి మంత్రివర్గ విస్తరణ జరుగుతుంది. దేశాధ్యక్షుడు రామచంద్ర పౌడెల్ ముగ్గురు కొత్తవారితో మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేయించారు. తమకు ప్రత్యేకంగా నిర్దేశించిన మంత్రిత్వశాఖలే కాకుండా ఒక్కొక్కరూ అదనంగా మరో మూడు మంత్రిత్వశాఖల బాధ్యతలు కూడా నిర్వహిస్తారు. దేశంలో అవినీతి నిర్మూలిస్తామని, సకాలం లో పార్లమెంటు ఎన్నికల ప్రక్రియ పూర్తిచేస్తామని సుశీల కర్కి ప్రతిజ్ఞ చేశారు. ఆర్థికమంత్రిత్వశాఖ లో మూడుదశాబ్దాలుగా పనిచేస్తూ అపార అనుభవం గడించిన ఆ శాఖ కార్యదర్శి రామ్‌షోర్ ఖానల్ ఆర్థికమంత్రిగా ప్రమాణస్వీకారం చేశారు. హోంశాఖామంత్రిగా ఓం ప్రకాశ్ ఆర్యల్, జలవనరులు, నీటిపారుదల, ఇంధన శాఖామంత్రిగా కుల్మన్ ఘీషింగ్ ప్రమాణస్వీకారం చేశారు. భౌతికపరమైన మౌలికవనరులు, పట్టణ అభివృద్ధి, రవాణాశాఖలను కూడా కుల్మన్ ఘీషింగ్ నిర్వహిస్తారు. చట్టం,న్యాయశాఖ,పార్లమెంటరీ వ్యవహారాల బాధ్యతలను కూడా మంత్రి ఆర్యల్ నిర్వహిస్తారు. ఇక మిగిలిన అన్ని మంత్రిత్వశాఖలను ప్రధానమంత్రి సుశీల కర్కి నిర్వహిస్తారు.



ఈ తాత్కాలిక మంత్రివర్గంలో ఖానల్‌కు ఆర్థికశాఖలో అపార అనుభవం ఉంది. గతంలో ఆయన కె.పి.శర్మ ఓలి ప్రభుత్వంలో ఆర్థిక సంస్కరణలపై 447 పేజీలతో కూడిన సిఫార్సుల కమిషన్ నివేదికను రూపొందించిన రికార్డు ఆయనకు ఉంది. ఇక ఘీషింగ్ కూడా ఓలి ప్రభుత్వంలో విద్యుత్‌సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ హోదాలో దేశంలో కరెంటు కోతలు అరికట్టి ప్రజాదరణ పొందిన చరిత్ర ఉంది. ఇక ఓంప్రకాశ్ ఆర్యల్ ఇటీవల జనరేషన్ జెడ్ ఉద్యమంలో కీలకపాత్ర వహించిన ప్రముఖ న్యాయవాది. ప్రదర్శకుల తరపున దేశాధ్యక్షుడితో చర్చల్లో పాల్గొన్ని ముఖ్యభూమిక నిర్వహించారు. అందుకు తగ్గట్టుగా ఆయనకు చట్టం,న్యాయం,పార్లమెంటరీ వ్యవహారాల బాధ్యతలు అప్పగించారు. నేపాల్ ఉపాధ్యక్షుడు రామ్ సహాయ్ ప్రసాద్ యాదవ్, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ప్రకాశ్ మాన్‌సింగ్ రౌత్, నేషనల్ అసెంబ్లీ ఛైర్మన్ నారాయణప్రసాద్ దహల్, మాజీ ప్రధానమంత్రి బాబురామ్ భట్టారాయ్, ఇతర సీనియర్ అధికారులు ఈ ప్రమాణ స్వీకారోత్సవంలో పాల్గొన్నారు. దేశంలో అవినీతి పేట్రేగిందని, ధనవంతుల కుటుంబాలు, రాజకీయ నేతలు అవినీతి సొమ్ము తో విలాసాలు చేస్తున్నాయని విమర్శిస్తూ ఈనెల 8,9 తేదీల్లో జరిగిన జనరేషన్ జెడ్ చేపట్టిన హింసాత్మక ఉద్యమం యావత్ ప్రపంచం దృష్టిని ఆకర్షించింది. ఈ ఉద్యమంలో 71 మంది మరణించారు. మరో 1300 మంది గాయపడ్డారు. ప్రధానమంత్రి ఓలి ప్రభుత్వం రాజీనామా చేయగా, పార్లమెంటును దేశాధ్యక్షుడు రద్దుచేశారు. ఉద్యమం సందర్భంగా దాదాపు 15,000 మంది ఖైదీలు వివిధ జైళ్ళనుండి పారిపోయారు. వీరిలో చివరకు 3,723మందిని పట్టుకుని తిరిగి జైళ్ళలో బంధించగా ఇంకా ఇప్పటికీ మరో 10,320 మంది పరారీలో ఉన్నారు. ఉద్యమకారులతో దేశాధ్యక్షుడి చర్చల అనంతరం ఈనెల 12వ తేదీన సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి సుశీల కర్కి తాత్కాలిక ప్రధానమంత్రిగా బాధ్యతలు తీసుకున్నారు.

## ప్రామాణికమని రుజువైంది
(మొదటి పేజీ తరువాయి)

డి.రాజా ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. ముస్లింలతోపాటు సంబంధిత వర్గాలతో వక్ఫ్ చట్టంలో సవరణల గురించి పూర్తిస్థాయిలో సరైన చర్చలు, సంప్రదింపులు జరపకుండా పార్లమెంటు ఉభయసభలు ఈ ఏడాది ఏప్రిల్‌లో కేంద్ర ప్రభుత్వం చట్టాన్ని ఆమోదించడాన్ని సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో డి.రాజా ద్వారా సిపిఐ కూడా ఒక పిటిషన్ దాఖలు చేసింది. బిజెపి చాలా ఆదరాబాదరాగా ఈ చట్టాన్ని తీసుకువచ్చిందన్న పార్టీ ఉద్దేశాన్ని సర్వోన్నత న్యాయస్థానం నిర్ణయం ప్రామాణీకరించిందని ప్రకటనలో డి.రాజా పేర్కొన్నారు. ఈ ఆదరాబాదరా చట్టంలో బిజెపి మైనార్టీలపట్ల వివక్ష ప్రదర్శించే స్పష్టమైన నిబంధనలను చేర్చిందని ఆయన విమర్శించారు. ముస్లిం మైనారిటీలను దేశంలో ఒక భూతంగా చూపించేందుకు బిజెపి చేస్తున్న ప్రయత్నాలలో ఒక భాగంగానే ఈ సవరణ చట్టం తీసుకువచ్చిందని విమర్శించారు. ఐతే సుప్రీంకోర్టు ఈ చట్టాన్ని అమలు చేయకుండా పూర్తిగా రద్దుచేయలేదని, ఈ చట్టంలో ఇంకా అన్యాయపూరితమైన నిబంధనలు ఎన్నో ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఐతే ప్రాథమిక ఆధారాలు లభించిన ఏకపక్ష నిబంధనలను మాత్రమే న్యాయస్థానం స్తంభింపజేసిందని పేర్కొన్నారు. అదేవిధంగా ఈ చట్టంలో ఇంకా అభ్యంతరకరంగా ఉన్న అనేక నిబంధనలన్నింటినీ పూర్తిగా న్యాయస్థానం కొట్టివేస్తుందని ఆయన అంచనావేశారు. సుప్రీంకోర్టు లేవనెత్తిన ప్రశ్నలకు కేంద్ర ప్రభుత్వం సమాధానాలు చెప్పేవరకూ ఈ నిబంధనలను తిరిగి అమలుచేసే అవకాశం లేదని పేర్కొన్నారు. మతపరమైన ధర్మాదాయ వ్యవస్థల పాలనా నిర్వహణకు సంబంధించిన చట్టాలను అర్థవంతమైన సంప్రదింపుల అనంతరం ఎలాంటి రహస్యాలకు తావులేకుండా, బాహాటపద్ధతులలో రూపొందించాల్సిన అవసరం ఉందని ఉద్ఘాటించారు. ఈ విధమైన పాలనా నిబంధనలు దేశంలో మతాలమధ్య ఉద్రిక్తతలకు దారితీయకూడదని, లౌకిక ప్రజాస్వామ్య, బహుళత్వ దేశంలో మైనార్టీల మతపరమైన హక్కులను సంరక్షించాల్సిన బాధ్యత ఉందని డి.రాజా ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

**మైనారిటీల మతహక్కులకు పూర్తి రక్షణ ఇవ్వాలి : సందోష్ కుమార్**

దేశంలో మైనారిటీల మతపరమైన హక్కులకు తప్పనిసరిగా పూర్తి రక్షణ ఇవ్వాలని రాజ్యసభలో సిపిఐ పక్ష నాయకుడు పి.సందోష్ కుమార్ కోరారు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై సిపిఐ పార్లమెంటరీపార్టీ కార్యాలయం సోమవారం విడుదల చేసిన ప్రకటనలో న్యాయస్థానం తీర్పును స్వాగతించారు. పార్లమెంటు లోపలా, వెలుపలా కూడా భారత కమ్యూనిస్టుపార్టీ ఈ వక్ఫ్ శాసనాలను తీవ్రంగా ప్రతిఘటించి నిరసనలు తెలియజేసిందని, ప్రజాభిప్రాయాన్ని కూడగట్టిందని గుర్తుచేశారు. కేంద్ర ప్రభుత్వం చట్టంగా తెచ్చిన వక్ఫ్ సవరణ నిబంధనలు ఏకపక్షంగా, వివక్ష చూపించేవిధంగా ఉన్నాయని, ఈ విధమైన నిబంధనలు మైనారిటీల మతమైన హక్కులను బాహాటంగా కుదించే ప్రయత్నమేనని విమర్శించారు. ఐతే న్యాయస్థానం యావత్ చట్టాన్ని అమలు చేయకుండా అడ్డుకోలేదనీ, కొన్ని నిబందనలను మాత్రమే అడ్డుకుందని, ఇంకా అన్యాయమైన నిబంధనలు ఎన్నో ఈ చట్టంలో ఉన్నాయన్నారు. మైనారిటీల హక్కులను హరించడంకోసమే కేంద్రం ఇలాంటి కుట్రలకు పాల్పడుతోందని విమర్శించారు.

**హర్షం ప్రకటించిన సిపిఐ(ఎం)**

వక్ఫ సవరణచట్టం–2025 పై సుప్రీంకోర్టు ఇచ్చిన ఉత్తర్వులపట్ల సిపిఐ(ఎం) హర్షం ప్రకటించింది. పార్టీ ప్రధాన కార్యదర్శి ఎం.బేబీ ఎక్స్ వేదికగా ఒక పోస్టింగ్ పెడుతూ,కేంద్రం తెచ్చిన ఈ సవరణలు దేశవ్యాప్తంగా పెద్ద తీవ్ర నిరసనలకు దారితీశాయని గుర్తుచేశారు. ఐదేళ్ళపాటు ముస్లిం మతాన్ని ఆచరించిన వారు మాత్రమే వక్ఫ్ ఆస్తులను సృష్టించేందుకు అర్హులన్న నిబంధనపై సుప్రీంకోర్టు ప్రధానంగా స్టే ఉత్తర్వు జారీ చేసింది.

## పరువునష్టం దావా
(మొదటి పేజీ తరువాయి)

రాజకీయ కక్షతో 'విపరీతమైన నిందారోపణలతో నీచమైన దుష్ప్రచారానికి' పాల్పడ్డారని ఆ దావాలో పేర్కొన్నారు. తప్పుడు,నిరాధారమైన ఆరోపణలను ప్రచురించినందుకు, ప్రసారం చేసినందుకు గాను దావా వేశారు. ఈ కేసులో బండి సంజయ్ పైన రూ 10 కోట్ల పరువు నష్టానికి కేసు వేశారు. తన పరువు నష్టం కలిగించే సమాచారాన్ని తొలగించాలని, బేషరతుగా బహిరంగ క్షమాపణ చెప్పాలని కెటిఆర్ డిమాండ్ చేశారు. 2025 ఆగస్టు 8న బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలలో తెలంగాణ ఎస్ఐబి (స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్) దుర్వినియోగం, ఫోన్ ట్యాపింగ్, ఆర్థిక అవకతవకలకు తనను ముడిపెట్టారని వివరించారు. ఈ వ్యాఖ్యలను కొన్ని మీడియా సంస్థలు, ఎక్స్ (ట్విట్టర్), యూట్యూబ్, గూగుల్, మెటా (ఫేస్‌బుక్/ఇన్‌స్టాగ్రామ్) వంటి సోషల్ మీడియా సంస్థలలో విస్తృతంగా ప్రసారమయ్యాయని కెటిఆర్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. అధికారంలో ఉన్న కేంద్ర మంత్రి ఇటువంటి బాధ్యతారహితమైన, పరువు నష్టం కలిగించే వ్యాఖ్యలు చేయడంతో ప్రజా ప్రతినిధుల విశ్వసనీయత, గౌరవానికి తీవ్రమైన పరిణామాలు ఉంటాయన్నారు. బండి సంజయ్ బేషరతుగా, బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఆన్‌లైన్ ప్లాట్‌ఫాములు, మీడియా పోర్టల్ల నుండి పరువు నష్టం కలిగించే కథనాలు, వీడియోలు, పోస్టులను తక్షణమే తొలగించాలని కెటిఆర్ కోరారు. భవిష్యత్తులో పరువు నష్టం కలిగించే కంటెంట్‌ను ప్రచురించకుండా లేదా ప్రసారం చేయకుండా నిరోధించే ఉత్తర్వులు ఇవ్వాలని కెటిఆర్ న్యాయస్థానాన్ని కోరారు.

## కుట్రకు ఎదురుదెబ్బ: కాంగ్రెస్
(మొదటి పేజీ తరువాయి)

అభ్యంతరాలకు ప్రభుత్వం, పార్లమెంటు నుంచి స్పష్టతను కోరాయి. రాజ్యాంగ విలువను కాపాడే విధంగా న్యాయం, సమానత్వం, సోదరభావానికి ఊతమిచ్చేలా సుప్రీం కోర్టు ఉత్తర్వులు ఉన్నట్లు కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ పేర్కొన్నారు. వక్ఫ సవరణ చట్టంలోని కీలక నిబంధనలను నిలిపివేయడాన్ని కాంగ్రెస్ స్వాగతిస్తుందన్నారు. చట్టంలో అంతర్లీనంగా ఉన్న 'దుర్మార్గపు ఉద్దేశాలు' రద్దు లో తాజా తీర్పుతో పురోగతి వచ్చినట్లు వెల్లడించారు. ఐదేళ్ల పాటు ఇస్లాం ఆచరించిన వారు మాత్రమే తమ ఆస్తిని వక్ఫ్ చేయగలరన్న నిబంధనపై సుప్రీం కోర్టు స్టే విధించింది. కాగా తమకు అనకూలంగా తీర్పు వెలువడిందని, పార్లమెంటు నిర్ణయాన్ని సుప్రీంకోర్టు సమర్థించిందని కేంద్రమంత్రి కిరెన్ రిజిజు తెలిపారు. ప్రజాస్వామ్యం గెలిచిందని అన్నారు. పార్లమెంటు చేసిన చట్టాన్ని ఎలా తిరస్కరిస్తామని ప్రశ్నించారు. 'వక్ఫ చట్టం పూర్తి పాఠం సుప్రీంకోర్టుకు తెలుసు. సుప్రీం కోర్టు నిర్ణయం ప్రజాస్వామ్యానికి శుభ సూచికమని నమ్ముతున్నా. ఎందుకంటే పార్లమెంటు ఏదైన చట్టం చేస్తే దానిని తిరస్కరించే అవకాశం ఉండదు. సుప్రీం కోర్టు తాజా తీర్పులో అదే పేర్కొంది. ఈ తీర్పు సంతృప్తినిచ్చింది. సర్వోన్నత న్యాయస్థానం ఏదైన నిర్ణ యం తీసుకుంటే దాని ప్రభావం ఉంటుంది... పార్లమెం టు నిర్ణయాన్ని కోర్టు సమర్థించినట్టే' అని రిజిజు వెల్లడించారు.

**బీజేపీ మత విభజన యత్నాలకు చెక్: కాంగ్రెస్**

మైనారిటీల హక్కుల పరిరక్షణకు హామీనిచ్చేలా సుప్రీం కోర్టు మధ్యంతర ఉత్తర్వులు వెలువడ్డాయని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖడ్గే అన్నారు. 'మత ఘర్షణలను రెచ్చగొట్టడానికి, పాత సమస్యలను మళ్లీ తెచ్చేలా రూపొందిన 'విభజన' చట్టం కోసం బీజేపీ యత్నించింది. ఎన్నికల్లో ప్రయోజనం కోసం సమాజాన్ని విభజించాలనుకుంటోంది. భయం/ప్రయోజనంతో పని లేకుండా రాజ్యాంగం హామీనిచ్చే విధంగా ప్రతి పౌరుని హక్కుల పరిరక్షణకు కాంగ్రెస్ కట్టుబడి ఉంది. బీజేపీ మాత్రం స్వప్రయోజనాల కోసం కుయుక్తులు ప్రదర్శిస్తూ, సమాజాన్ని విభజించాలని చూస్తోంది' అని ఖడ్గే వ్యాఖ్యానించారు. ఈ కేసులో గణనీయమైన విజయం సాధించినట్లు జైరాం రమేశ్ వెల్లడించారు. సుప్రీం కోర్టు కీలక నిబంధనలను నిలిపివేసిందని, కలెక్టర్ల అధికారాలు పరిమితం చేసిందని, వక్ఫ్ ఆస్తులు కబ్జాకు గురికాకుండా చూసిందన్నారు. ఐదేళ్లుగా ముస్లిం గా ఉన్నానంటూ రుజువులు చూపే నిబంధనను నిలిపివేస్తూ, తగిన విధంగా నియమాలు రూపొందించాలని ఆదేశించడాన్ని స్వాగతిస్తున్నామని జైరాం రమేశ్ పేర్కొన్నారు. న్యాయం, సమానత్వం, సౌభ్రాతృత్వ విలువల కోసం తీర్పును స్వాగతిస్తున్నట్లు వెల్లడించారు.

**రాజ్యాంగ విలువలకు రక్షణ: డీఎంకే**

రాజ్యాంగ విలువల రక్షణకు హామీనిచ్చేలా సుప్రీం కోర్టు ఉత్తర్వులు ఉన్నాయని డీఎంకే అధ్యక్షుడు ఎంకే స్టాలిన్ తెలిపారు. 'బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టినప్పటి నుంచి ఇందులోని సవరణలను డీఎంకే వ్యతిరేకిస్తోంది. చట్టంగా మారినప్పుడు దానిపై సుప్రీంకెళ్లింది. ప్రభుత్వ అధికాలను దుర్వినియోగించేలా తీసుకుకొచ్చిన బిల్లును చట్టం చేయగా, దీనిని ఉపసంహరించుకునేలా కేంద్రాన్ని కోరుతూ తమిళనాడు అసెంబ్లీ తీర్మానం చేసింది. సుప్రీంకోర్టు తాజా ఉత్తర్వులు ముస్లింల మతపరమైన హక్కుల పరిరక్షణకు, రాజ్యాంగ విలువల రక్షణకు హామీనిస్తుంది' అని పేర్కొన్నారు. ఆర్జేడీ నాయకుడు తేజస్వీ యాదవ్ స్పందిస్తూ 'వక్ఫ్ సవరణ చట్టాన్ని సవాల్ చేస్తూ పిటిషన్ వేసిన పార్టీల్లో ఆర్జేడీ ఒకటి. ఈ వ్యవహారంలో న్యాయస్థానం ఏ నిర్ణయం తీసుకున్నా స్వాగతిస్తాం' అని అన్నారు.

**తుది తీర్పుపై ఆశలు: ముస్లిం లా బోర్డులు**

వక్ఫ్ సవరణ చట్టాన్ని పూర్తిగా రద్దు చేస్తే హర్షించేవాళ్లమని, తాజా ఉత్తర్వులు కొంతమేరకు ఉపశమనం కల్పించాయని ఆలిండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు (ఏఐఎంపీఎల్‌బీ), ఆలిండియా షియా పర్సనల్ లా బోర్డు (ఏఐఎస్‌పీఎల్‌బీ) పేర్కొన్నాయి. బోర్డులో ముస్లింయేతరులకు స్థానం కల్పించడం ఇబ్బంది పెట్టే అంశమన్నారు. మత స్వేచ్ఛకు రాజ్యాంగం హామీనిస్తోందని గుర్తుచేశారు. ఇస్లాంలో వక్ఫ్ అంతర్గత భాగమని నొక్కిచెప్పారు. ఇతర మత సంస్థల్లో ఆయా మతస్థులే ఉన్నప్పుడు వక్ఫ్‌కు మినహాయింపు ఎందుకని ప్రశ్నించారు. సుప్రీం కోర్టు దీనిపై స్టే విధించలేదని, ఇది పెద్ద సమస్యగా ఉందని, తుది తీర్పుపైనే ఆశలు పెట్టుకున్నామని ముస్లిం లా బోర్డులు పేర్కొన్నాయి. న్యాయంపై నమ్మకాన్ని తాజా ఉత్తర్వులు ఇచ్చినట్లు జమాత్ ఉలేమా ఏ హింద్ అధ్యక్షుడు మౌలానా అర్షద్ మదనీ అన్నారు.

**మాకు సమస్య లేదు: మునంబం వాసులు**

తాజా ఉత్తర్వులతో తమకు ఎలాంటి సమస్య లేదని, ఫరూక్ కాలేజి నుంచి తాము కొనుగోలు చేసిన భూమికి ఢోకా లేదని కేరళకు చెందిన మునంబం భూ సంరక్షణ సమితి వెల్లడించింది. చట్టంలోని సెక్షన్ 2(ఎ)పై స్టే విధించలేదు కాబట్టి... మా సమస్యలను పరిష్కరించే దిశగా ప్రభుత్వం ముందుకెళ్లవచ్చని సమితి సభ్యుడు జోసెఫ్ బెన్నీ తెలిపారు. తమ సమస్యల సత్వర పరిష్కారానికిగాను పోరాటాన్ని మరింత ఉధృతం చేయాలని సమితి నిర్ణయించినట్లు వెల్లడించారు.

## కోల్ ఇండియా రిటైర్డ్ సిబ్బందికి రూ.10వేల పెన్షన్ ఇవ్వాలి



**ప్రజాపక్షం/ఖైరతాబాద్ :** ఉద్యోగ విరమణ పొందిన కోల్ ఇండియా కార్మిక, ఉద్యోగ, సిబ్బందికి కనీస పెన్షన్ రూ.10వేలు చెల్లించడంతోపాటు, డిఎ పెంపును వర్తింపజేయాలని కోల్ ఇండియా రిటైర్డ్ ఎంప్లాయీస్ ఫోరం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కల్వల లక్ష్మణ్, ఎ.మహేశ్వర్, సత్యజిత్ పొద్దర్ కేంద్రప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం హైదరాబాద్ బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో వారు మీడియాతో మాట్లాడారు. 2003 సంవత్సరానికి ముందు రిటైర్డ్ అయిన కోల్ ఇండియా సిబ్బందికి పెన్షన్ నెలకు రూ.350 నుంచి రూ.1000 మాత్రమే చెల్లిస్తున్నారని తెలిపారు. నిత్యావసరాల ధరలు పెరిగినందున ఈ పెన్షన్ ఏమాత్రం సరిపోవడం లేదని, ఆర్థికంగా ఇబ్బందులెదుర్కొంటున్నామన్నారు. కావున, కేంద్ర బొగ్గుగనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి తమ డిమాండ్‌ను పరిశీలించి, న్యాయం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

## బాధ్యతలు సర్పంచ్‌లకే
(మొదటి పేజీ తరువాయి)

ఎల్ఇడి లైట్ల కాంట్రా క్టు ఏజెన్సీ అధ్వర్యంలో ఉందని అధికారులు సిఎం రేవంత్ రెడ్డికి వివరించారు. అన్ని గ్రామా ల్లో సర్పంచులకే వీటిని అప్పగిస్తే, లైట్ల నిర్వహ ణ, విద్యుత్ దుర్వినియోగం కాకుండా అడ్డుకట్ట పడుతుందనే అభిప్రాయాలు వ్యక్తమయ్యా యి. జిహెచ్ఎంసి పరిధిలో ఉన్న 5.50 లక్షల ఎల్ఇడి లైట్లు ఉన్నాయని, అవుటర్ రింగ్ రోడ్డు లోపల ఉన్న కోర్ అర్బన్ సిటీని కూడా కలిపితే మొత్తం 7.50 లక్షల లైట్లు అవసరమవుతాయ ని మున్సిపల్ శాఖ అధికారులు సిఎంకు నివేదించారు. గతంలో ఉన్న ఏజెన్సీ కాంట్రాక్టు ముగియటంతో ఇప్పుడు చాలాచోట్ల లైట్లు వెలగటం లేదని, నిర్వహణ కూడా సరిగా జరగలేదని అధికారులు నివేదించారు. రాత్రి పూట ఎల్ఇడి లైట్లు పని చేయటంతో పాటు పగటి పూట దుర్వినియోగం కాకుండా పర్యవేక్షించాలని, అన్ని గ్రామాల ఎల్ఇడి డ్యాష్ బోర్డు మండల స్థాయిలో ఎంపిడిఓ పర్య వేక్షణలో ఉండాలని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. జిల్లాలో అడిషనల్ కలెక్టర్‌కు ఈ బాధ్యతలు అప్పగించాలన్నారు.

**ఏడేళ్లపాటు నిర్వహణ బాధ్యతలు ఉండేలా టెండర్ నిబంధనలు**

కోర్ అర్బన్ సిటీ పరిధిలో జిహెచ్ఎంసితో పాటు కొత్తగా ఏర్పడిన కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, గ్రామాలన్నింటిని పరిగణనలోకి తీసుకొని ఎల్ఇడి లైట్ల అవసరాన్ని అంచనా వేయాలని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. కొత్తగా ఎల్ఇడి లైట్ల ఏర్పాటు, నిర్వహణకు టెండర్లు ఆహ్వానించాలన్నారు. ఎల్ఇడిడీ లైట్ల తయారీలో పేరొందిన కంపెనీలను ఆహ్వానించాలని, ఏడేళ్ల పాటు నిర్వహణ బాధ్యతలు కంపెనీలకు అప్పగించాలని, నిర్వహణ పక్కగా ఉండేందుకు వీలుగా టెండర్ నిబంధనలను రూపొందించుకోవాలని సూచించారు. ఎల్ఇడి లైట్లతో పాటు కంట్రోల్ బాక్స్ ల ఏర్పాటు, నిరంతరం అవి పనిచేస్తున్నాయా? లేదా? ఏయే ప్రాంతాల్లో ఇబ్బందులు ఉన్నాయో? తెలుసుకునేందుకు ప్రత్యేకంగా వ్యవస్థ ఉండాలన్నారు. హైదరాబాద్ ఐఐటి లాంటి సంస్థలతో థర్డ్ పార్టీ ఆడిట్ చేయించాలని సూచించారు. ప్రస్తుతం

**'సోలార్ పవర్' సాధ్యాసాధ్యాలను పరిశీలించండి**

జిహెచ్ఎంసి పరిధిలో వీధి దీపాలకు ప్రతి నెలా రూ.8 కోట్ల కరెంటు బిల్లు చెల్లించాల్సి వస్తుందని, విద్యుత్‌ను ఆదా చేసేందుకు సోలార్ పవర్ వినియోగించే అంశాన్ని, అందుకు అవసరమైన సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. కోర్ అర్బన్ సిటీ ఏరియాతో పాటు అవుటర్ అవతల ఉన్న మున్సిపాలిటీల్లోనూ ఎల్ఇడి లైట్ల ఏర్పాటుకు వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన మున్సిపాలిటీలతో పాటు కొన్ని మున్సిపాలిటీల్లో కొత్త గ్రామాల విలీనం, గ్రామాల మార్పులు చేర్పులు జరిగాయన్నారు. వాటన్నింటిని పరిగణనలోకి తీసుకొని ఎల్ఇడి లైట్ల అంచనా వేయాలని సూచించారు. కోర్ అర్బన్ సిటీతో పాటు మున్సిపాలిటీల్లో ఎల్ఇడి లైట్లకు కూడా టెండర్లు ఆహ్వానించాలని సిఎం ఆదేశించారు.

## నిలిపివేత
(మొదటి పేజీ తరువాయి)

వీలైనంత వరకూ ముస్లింమతస్థులనే నియమించేందుకు ప్రాధాన్యత ఇవ్వాలని ఉన్నతాధికారులకు ఆదేశించింది. ''శాసనంపై అంచనాలు ఎల్లప్పుడూ రాజ్యాంగబద్ధంగానే ఉంటాయి, కానీ, అరుదైన సందర్భాలలో మాత్రమే ఈ విషయం తేల్చడానికి న్యాయస్థానం జోక్యం ఉంటుంది'' అని ధర్మాసనం వ్యాఖ్యానించింది.

వివాదాస్పద సవరణ చట్టాన్ని సవాలు చేస్తూ దాఖలైన 100కు పైగా పిటిషన్లపై సోమవారం విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు 128 పేజీలతో ఒక ఉత్తర్వు జారీ చేసింది. ఐతే బిజెపి తన సిద్ధాంతాలకు అనుగుణంగా సవరణల ద్వారా చట్టంలో చొప్పించిన, మైనారిటీ హక్కులు హరించే అనేక వివాదాస్పద నిబంధనలు మరికొన్ని ఉన్నప్పటికీ ధర్మాసనం వాటి జోలికి వెళ్ళలేదు. ఈ కొత్తచట్టంలోని ప్రతి నిబంధననూ ధర్మాసనం పరిశీలించి పరిగణనలోకి తీసుకుందని, వీటిల్లో కొన్ని నిబంధనలు తప్ప మొత్తం వక్ఫ్ (సవరణ)చట్టం– 2025 ను పూర్తిగా అమలు చేయకుండా నిలిపివేయడానికి ఎలాంటి ప్రాథమిక ఆధారాలు కనిపించలేదని, అందువల్ల పిటిషనర్ల విజ్ఞప్తిని తిరస్కరిస్తున్నామని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్ చెప్పారు. పిటిషనర్ల ప్రయోజనాలు కాపాడేందుకు, ఈ చట్టానికి అనుకూల ప్రతికూలవాదుల మధ్య సమతుల్యం పాటించేదుకు ఈ స్టే ఉత్తర్వు ఇస్తున్నట్లు చెప్పారు. చట్టంలో కొన్ని నిబంధనలకు రక్షణ అవసరమని అన్నారు. ఈ ఉత్తర్వులు ప్రాథమికమైనవీ, తాత్కాలికమైనవేననీ, తుది విచారణలో వాదనలు పూర్తయ్యేవరకూ అటు ప్రభుత్వం తరపు న్యాయవాదులనుగానీ, ఇటు సవరణ చట్టాన్ని వ్యతిరేకిస్తున్న పిటిషనర్లను గానీ తమ తమ పూర్తి వాదనలు ధర్మాసనానికి తెలియజేయకుండా ఈ స్టే ఉత్తర్వులు అడ్డుకోబోవని ఆయన చెప్పారు.

కొత్త సవరణ చట్టంలోని సెక్షన్ 3 ఆర్ ప్రకారం వక్ఫ్ ఆస్తులను సృష్టించడానికి, ముస్లిం పేదలకు దాతృత్వంకోసం తన ఆస్తులను అంకితం ఇవ్వడానికి సంబంధిత వ్యక్తి గడచిన ఐదేళ్ళుగా ముస్లిం మతాన్ని ఆచరిస్తున్నాడా? లేదా? అనే విషయంపై నిర్ధారణ చేయడానికి రాష్ట్రాలలో ప్రభుత్వాలు పరిశీలించి తగినవిధంగా నిబంధనలు రూపొందించేంతవరకూ ఈ స్టే ఉత్తర్వులు అమలులో ఉంటాయని కూడా ఉత్తర్వులలో ధర్మాసనం స్పష్టం చేసింది. ఎలాంటి నిబంధనలు రూపొందించకుండా, ఎలాంటి యంత్రాంగం లేకుండా దాతలకు ఐదేళ్ళ నిబంధనను అమలు చేయడం ఏకపక్షంగా అధికారాలను ఉపయోగించడమే అవుతుందని కూడా విమర్శించింది. వక్ఫ్ ఆస్తుల ప్రతిపత్తిని నిర్దేశించడానికి ప్రభుత్వ అధికారులకు ఇచ్చిన అధికారాలకు సంబంధించి ఈ చట్టంలో సెక్షన్ 3 సి అతిముఖ్యమైనది. దీనిపైనే ఎక్కువ అభ్యంతరాలు వచ్చాయి. పార్లమెంటు ఉభయసభలూ ఈ ఏడాది ఏప్రిల్ 3,4 తేదీలలో వక్ఫ్ (సవరణ)బిల్లును ఆమోదించాయి. తర్వాత ఐదో తేదీన రాష్ట్రపతి ద్రౌపదీముర్ము బిల్లుపై సంతకం చేశారు. అదేనెల 8వ తేదీ నుండీ ఈ సవరణలు చట్టరూపం ధరించి అమలులోకి వచ్చాయి. ఈ చట్టం ప్రకారం వక్ఫ్ అనేది ముస్లిం మతస్థులు ఆ మతంలో ఉండే పేదల జీవన స్థితిగతులను మెరుగుపరిచేందుకు భూములు, ఆస్తులు, భవంతులు దానం చేసి వాటిని వక్ఫ్ ఆస్తులుగా ప్రకటిస్తారు. వీటిని వారి ప్రయోజనాలకోసం ఉపయోగించాలి. 1923లో ముస్లింల వక్ఫ్ చట్టం చేసినప్పటినుండీ చరిత్రను న్యాయస్థానం ఈ సందర్భంగా ప్రస్తావించింది.

## విద్యార్థుల భవిష్యత్‌తో ఆటలొద్దు
(మొదటి పేజీ తరువాయి)

చేసి కళాశాలల బంద్‌ను నివారించాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఎఐఎస్ఎఫ్ హైదరాబాద్ సమితి అధ్వర్యంలో హిమాయత్‌నగర్ జంక్షన్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కసిరెడ్డి మణికంఠరెడ్డి మాట్లాడుతూ ఫీజుల కోసం కళాశాలల యజమాన్యాలు బంద్‌కు పిలుపునివ్వడమంటే పేద విద్యార్థులను చదువులకు దూరం చేయడమేనని, దీనిని నివారించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే అన్నారు. అందాల పోటీలకు నిధులు ఇచ్చిన ప్రభుత్వం విద్యార్థుల చదువులకు ఇవ్వకపోవడం శోచనీయమని ఆయన పేర్కొన్నారు. విద్యార్థులకు ఓట్లు లేకపోయినా విద్యార్థుల తల్లిదండ్రులకు ఓట్లు ఉన్నాయనే విషయాన్ని సిఎం రేవంత్ రెడ్డి గుర్తుపెట్టుకొని వెంటనే ఫీజు బకాయిలు విడుదల చేయాలని లేని పక్షంలో రాష్ట్రంలో ముఖ్యమంత్రిని, మంత్రులను తిరగనివ్వబోమని విద్యార్థులతో ఎక్కడికక్కడ అడ్డుకుంటామని కసిరెడ్డి మణికంఠ రెడ్డి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి గ్యార నరేష్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు చైతన్య యాదవ్, సామిడి వంశీవర్ధన్ రెడ్డి, నాయకులు అరుణ్, ఉదయ్, అనిల్, హరీష్, వెంకటేష్, రూప్ సాయి,ప్రకాష్,శివ, విరాజ్,అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## సహదేవ్ ఎన్‌కౌంటర్
(మొదటి పేజీ తరువాయి)

స్వాధీనం చేసుకొన్నట్లు వెల్లడించారు. భద్రతా దళాలు ఆ ప్రదేశంలో కూంబింగ్ కొనసాగిస్తున్నాయి. జులైలో ఓ కోబ్రా జవాన్ హత్యలో సహదేవ్ పేరు వచ్చింది. నాడు బొకారో పోలీసులు చేపట్టిన సెర్చి ఆపరేషన్ సందర్భంగా తగిలిన తూటా గాయానికి అతడు మరణించాడు. తాజాగా ఈ ముగ్గురు నక్సల్స్ నేతలు ఏదో పెద్ద ఆపరేషన్‌కు ప్లాన్ చేస్తున్నట్లు ఎస్‌పి హర్వీందర్ సింగ్ వెల్లడించారు. ఈనెల 7వ తేదీన జరిగిన ఓ ఆపరేషన్‌లో మావోయిస్టుల సీనియర్ నాయకుడు అమిత్ హన్స్&డా మరణించాడు. జోనల్ కమాండర్ అయిన అతడిపై రూ.10 లక్షల రివార్డు ఉంది. మొత్తం 95 కేసుల్లో అతడు నిందితుడు. వీటిల్లో చాలామంది పోలీసులు, పౌరుల హత్యలు ఉన్నాయి. మరోవైపు ఛత్తీస్‌గఢ్‌లో కొన్ని రోజుల క్రితం జరిగిన ఎన్‌కౌంటర్‌లో అగ్రనేతలు మోడెం బాలకృష్ణ, అల్వాల్ చంద్రహాస్ సహా 10 మంది మృతి చెందిన విషయం తెలిసిందే.




# జనరల్
STATE & REGIONAL NEWS

## యూరియాను శాస్త్రీయంగా అందించాలి

### ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాల్‌రాజ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కేంద్ర ప్రభుత్వం తక్షణమే రాష్ట్రాలకు సరిపోను యూరియాను శాస్త్రీయంగా అందజేయాలని ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్‌రాజ్ డిమాండ్ చేశారు. యూరియాను సరఫరా చేయాల్సిన బాధ్యత కేంద్రానిది కాగా, బాధ్యతారాహిత్యంగా వ్యవహరించడం సరైంది కాదన్నారు. యూరియా కొరత వల్ల రైతులు వారి కుటుంబ సభ్యులు రాత్రి పగలు తేడాలేకుండా బస్తా యూరియా కోసం పడిగాపులు కాయాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. కేంద్ర ప్రభుత్వ రైతు వ్యతిరేఖ నల్ల చట్టాలను తెచ్చి, దేశ రైతులు సంవత్సరనర కాలం పాటు దేశ రాజధానిలో నిరసన ధర్నాలు చేస్తూ వందలాది రైతులు చనిపోయినా, వర్షానికి, ఎండకు, చలికి లెక్కచేయకుండ ఆందోళన చేసినా కేంద్ర ప్రభుత్వంకు కనువిప్పు కలుగకపోవటం విచారకరమని బాల్ రాజ్ పేర్కొన్నారు. ఇప్పటికైనా వ్యవసాయశాఖ అధికారులు వెంటనే రైతులకు ఇబ్బందులు రాకుండ ముందస్తుగానే కావాల్సిన ఎరువులను, విత్తనాలను, వారి భూమి విస్తీర్ణం బట్టి ఇవ్వాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## కమ్యూనిస్టు పార్టీ పోరాటాలు, త్యాగాలతోనే

# హైదరాబాదు సంస్థానం భారతదేశంలో విలీనం

### సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి

### చిగురుమామిడి మండలంలో సిపిఐ భారీ బైక్ ర్యాలీ, అమరులకు నివాళి




**ప్రజాపక్షం/కరీంనగర్‌సిటీ :** కమ్యూనిస్టు పార్టీ నేతల ప్రాణ త్యాగాల మూలంగా, తెలంగణ రైతాంగ సాయుధ పోరాటంలో అసువులు బాసిన అమరవీరుల సాక్షిగా హైదరాబాదు సంస్థానం భారతదేశంలో విలీనం అయ్యిందని, సాయుధ పోరాటం గురించి మాట్లాడే నైతిక హక్కు బిజెపికి లేది సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి స్పష్టం చేశారు. సెప్టెంబర్ 11 నుంచి 17 వరకు రాష్ట్రవ్యాప్తంగా సిపిఐ ఆద్వర్యంలో నిర్వహిస్తున్న తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలలో భాగంగా సిపిఐ చిగురుమామిడి మండల సమితి ఆద్వర్యంలో సోమవారం భారీ బైక్ ర్యాలీ ఇందుర్తి, ఒగులాపూర్, గాగిరెడ్డిపల్లి, చిగురుమామిడి, రేకొండ, బొమ్మనపల్లి గ్రామాల్లో జరిగింది. అమరులైన వారి స్మారక స్థూపాల వద్ద చాడ వెంకటరెడ్డి, సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్‌తో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ జెండాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ వెట్టిచాకిరీ విముక్తి కోసం బానిసత్వానికి వ్యతిరేకంగా, ఆకలి మంటలు, ఆర్తనాదాలు, అణచివేతలకు వ్యతిరేకంగా, భూమికోసం, భుక్తి కోసం దాస్య శృంఖలాల విముక్తి కోసం పుట్టిందే తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటమని పేర్కొన్నారు. లక్షలాది మంది సాయుధ పోరాటానికి ముందుకు వచ్చారని, అనేక గ్రామాల్లో ప్రజలను చైతన్య పరుస్తూ ఎన్నో సంఘాలు నిర్మించి నిజాం రజాకార్ పోలీసులకు వ్యతిరేకంగా కమ్యూనిస్టులు వీరోచిత పోరాటాలు చేశారన్నారు. ఇందుర్తి ప్రాంతంలో దొంగ అప్పు పత్రాలు సృష్టించి ప్రజలు ఇబ్బందులకు గురిచేస్తున్న గంగారెడ్డి దొరకు వ్యతిరేకంగా ముస్కురాజిరెడ్డి గునుకుల జనార్దన్‌రెడ్డి, కూన ముత్తయ్యలాంటి అనేకమంది వ్యతిరేకంగా పోరాటాలు నిర్వహించి అప్పు పత్రాలను తగలబెట్టిన చరిత్ర ఉందన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం ఉధృతంగా సాగుతున్న తరుణంలో కరీంనగర్ జిల్లా కమ్యూనిస్టు పార్టీ నేతలు కీలకంగా వ్యవహరించారని, ఉమ్మడి జిల్లా అగ్రనేత బద్దం ఎల్లారెడ్డితో పాటు అనభేరి ప్రభాకర్‌రావు, సింగిరెడ్డి భూపతిరెడ్డి లాంటి ఎంతో మంది గొప్ప నేతు సాయుధ పోరాటంలో కీలక భూమిక పోషించారన్నారు. అమరవీరుల ఆశయాలను, లక్ష్యాలను ముందుకు తీసుకెళ్లేందుకు సిపిఐ శ్రేణులు కంకణ బద్దులు కావాలన్నారు. కమ్యూనిస్టు పార్టీకి కంచుకోట ఉన్న చిగురుమామిడి మండలంలో రానున్న రోజుల్లో స్థానిక ఎన్నికల్లో ఎర్రజెండా ఎగరవేయడం కోసం అందరూ పనిచేయాలని, అమరులు చూపిన బాటలో నడుస్తూ జిల్లాలో కమ్యూనిస్టు పార్టీని బలోపేతం కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు అందె స్వామి, మండల కార్యదర్శి నాగెల్లి లక్ష్మారెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు బోయిని అశోక్, గూడెం లక్ష్మి, బత్తుల బాబు, జిల్లా కౌన్సిల్ సభ్యులు చాడ శ్రీధర్ రెడ్డి, అందె చిన్న స్వామి, కాంతాల శ్రీనివాస్ రెడ్డి, మావురపు రాజు, తేరాల సత్యనారాయణ, లంకదాసరి కల్యాణ్, బి.యుగేందర్, మండల కార్యదర్శి, సహాయ కార్యదర్శులు బూడిద సదాశివ, పైడపల్లతి వెంకటేష్, సింగిల్ విండో డైరెక్టర్ ముద్రకోల రాజయ్య, మాజీ మండల కార్యదర్శి ఎనగందుల రాజయ్య, మాజీ సర్పంచులు గోలి బాపురెడ్డి, కోమటిరెడ్డి జపాపాల్ రెడ్డి, సీనియర్ నాయకులు కూన లెనిన్, వివిధ గ్రామాల శాఖ కార్యదర్శులు మహమ్మద్ ఉస్మాన్ పాషా, ఇల్లందుల రాజయ్య, మంద ఎల్లయ్య, ఎలగందుల రాజు, అల్లెపు జంపయ్య, కయ్యం తిరుపతి, కాత మల్లయ్య,నీల వెంకన్న,రామస్వామి పాల్గొన్నారు.

## దేశ రాజకీయ గమనాన్ని మార్చిన చరిత్ర

# తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానిది

### సిపిఐ తెలంగాణ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈటి నరసింహ




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** దేశ రాజకీయ గమనాన్ని మార్చిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్రను బిజెపి వక్రీకరిస్తే చరిత్ర క్షమించదని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈటి నరసింహ అన్నారు. కమ్యూనిస్టుల పోరాట ఫలితంగానే నిజాం లొంగిపోయారు తప్ప అప్పటి హోంమంత్రి సర్దార్ పటేల్ చీకటి ఒప్పందంతో కాదన్నారు. తెలంగాణ సాయుధ పోరాటం వారోత్సవాల్లో భాగంగా సిపిఐ జిల్లా కార్యాలయం సంగారెడ్డిలో జిల్లా కార్యవర్గ సభ్యులు ఎండి మహబూబ్ ఖాన్ అధ్యక్షతన సభ నిర్వహించారు. ఈ సభకు ముఖ్యఅతిథిగా హాజరైన ఈటీ నరసింహ మాట్లాడుతూ నిజాం నిరంకుశ పాలనకు తోడు గ్రామాలలో దొరలు , దేశ్‌ముఖ్‌లు, పటేల్, పట్వారిల ఆదిపత్యానికి చరమగీతం పాడేందుకు ఆంధ్ర మహాసభ, కమ్యూనిస్టుల నాయకత్వంలో కాల్మొక్కుతా నీ బాంచన్ అన్న ప్రజలే బందూక్‌లు చేత బట్టి దొర గడీలను బద్దలుకొడుతూ, రజాకార్ల సైన్యాన్ని భూస్వాముల గుండాలను తరిమి తరిమి కొట్టిన మహత్తర పోరాటమని ఆయన పేర్కొన్నారు. 3వేల గ్రామాలు విముక్తి చేయడంతో పాటు 10 లక్షల ఎకరాల భూములను పేద ప్రజలకు పంచిన ఘన చరిత్ర సాయుధ పోరాటానిది అన్నారు.

దీంతో కమ్యూనిస్టు పార్టీకి అధికారం దక్కుతదని భావించినా నిజాం గత్యంతరం లేక భూస్వామ్య వర్గాల ప్రతినిధులుగా ఉన్న సర్దార్ పటేల్ హోంమంత్రి నాయకత్వంలో చీకటి ఒప్పందం కుదుర్చుకున్నారన్నారు. ఫలితంగా నిజాంకు గవర్నర్ పదవితో పాటు కోట్లాది రూపాయల రాజభరణాలు చెల్లించడమే కాకుండా ప్రజలను హింసించి అరాచకాలు సృష్టించిన రజాకార్ల సైన్య అధ్యక్షుడు ఖాసిం రజ్వికి సరైన అనే శిక్ష విధించకుండా పాకిస్తాన్ పంపిన చరిత్ర ఆనాటి పాలకులదని పేర్కొన్నారు. రజాకార్ సైన్యానికి ఉపాధ్యక్షుడుగా ఉన్న విస్నూరు రామచంద్రారెడ్డి దొర గురించి గాని జామీందార్లు, జాగీర్‌దార్లు, భూస్వాముల గురించి గాని బిజెపి మాట్లాడకుండా ముస్లింపై హిందువులు సాధించిన విజయంగా చెప్పుకుంటూ తెలంగాణ రైతాంగ సాయుధ మహోత్తర పోరాట చరిత్రను వక్రీకరిస్తోందన్నారు. దేశ స్వాతంత్ర పోరాటంలో గాని తెలంగాణ సాయుధ పోరాటంతో ఏ సంబంధం లేని ఆర్ఎస్ఎస్, బిజెపి ఒకరి చరిత్రను వక్రీకరించడమే లేకపోతే ఉద్యమంలో పాల్గొన్న నాయకులను తమ వారనే ప్రచారం చేసుకోవడం వారికి వెన్నతో పెట్టిన విద్య ఎద్దెవా చేశారు. యువత బిజెపి తప్పుడు ప్రచారాలను తిప్పికొడుతూ వాస్తవ చరిత్రను ప్రజలకు వివరిస్తూ పాలకవర్గాల అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై రాజీలేని పోరాటాలకు బాటలు వేయాలని ఈటి నరసింహ పిలుపునిచ్చారు. జిల్లా కార్యదర్శి సయ్యద్ జలాలుద్దీన్ మాట్లాడుతూ సెప్టెంబర్ 17న తెలంగాణ విమోచనం దినోత్సవం పేరుతో బిజెపి సంబరాలు నిర్వహించడం హాస్యాస్పదమన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి బిజెపి మతం రుద్దుతూ కమ్యూనిస్టుల చరిత్రను చెరిపేయడానికి చూస్తే ప్రజల్లో చరిత్ర చెరిగిపోదు అన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం దినోత్సవం పేరుతో సెప్టెంబర్ 17న ప్రభుత్వం అధికారికంగా ఉత్సవాలను నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎంఎ రెహమాన్, నాయకులు ఆనంద్, బాల్ రెడ్డి, ఆర్.లక్ష్మి , రూబీనా బేగం, రత్నాకర్ రెడ్డి, శంకర్, పద్మ తదితరులు పాల్గొన్నారు.

## అక్రిడిటేషన్ విధివిధానాలు రూపొందించాలి

### అధికారులకు మంత్రి పొంగులేటి ఆదేశం



**ప్రజాపక్షం/హైదరాబాద్:** అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్ కార్డులు అందేలా విధివిధానాలను రూపొందించాలని అధికారులను సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశించారు. జర్నలిస్టుల హెల్త్ పాలసీపై సమగ్రంగా చర్చించామని, ఇన్సూరెన్స్ పాలసీలో ఏది జర్నలిస్టులకు ప్రయోజనకరంగా ఉంటుందనే అంశంపై ఆరోగ్యశ్రీ విభాగంతో కలిసి లోతైన అధ్యయనం చేయాలని అధికారులకు సూచించారు. హైదరాబాద్‌లోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సచివాలయంలో తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ ఛైర్మన్ కె.శ్రీనివాస రెడ్డి, హోంశాఖ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ రవి గుప్తా, సమాచార, పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ సిహెచ్. ప్రియాంక, ముఖ్యమంత్రి సిపిఆర్‌ఓ జి.మల్సూర్‌తో కలిసి మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి సోమవారం సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రధానంగా అక్రిడిటేషన్ పాలసీ, జర్నలిస్టు హెల్త్ పాలసీ, జర్నలిస్టుల అవార్డులు, జర్నలిస్టులపై దాడులకు సంబంధించి హైపవర్ కమిటీ తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ ముఖ్యమంత్రి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం జర్నలిస్టుల సంక్షేమానికి కట్టుబడి ఉందన్నారు. జర్నలిస్టులపై దాడులు జరగకుండా ప్రభుత్వం అన్ని చర్యలూ తీసుకుంటుందని, ఇందుకు హైపవర్ కమిటీని కూడా పునరుద్దరించాలని నిర్ణయించినట్లు ఆయన వెల్లడించారు. దీనికి సంబంధించి ఉమ్మడి ఎపి రాష్ట్రంలో 2008లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం జిఒ జారీ చేసిందని, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత ఆ ఊసే ఎత్తలేదని విమర్శించారు. జర్నలిస్టుల జీత భత్యాలకు సంబంధించి త్రైపాక్షిక కమిటీని కూడా పునరుద్దరిస్తున్నామన్నారు. జర్నలిస్టుల నుంచి దరఖాస్తులను స్వీకరించేందుకు ప్రత్యేక వెబ్‌సైట్‌ను తక్షణమే రూపొందించాలని అధికారులకు సూచించారు. జర్నలిస్టులకు అవార్డులను పునరుద్దరించాలని మీడియా అకాడమీ ఛైర్మన్ కె.శ్రీనివాస రెడ్డి చేసిన విజ్ఞప్తి పట్ల మంత్రి సానుకూలంగా స్పందించారు. ఈ సమావేశంలో ఆరోగ్యశ్రీ సిఇ.ఓ ఉదయ్ కుమార్, కార్మిక శాఖ అదనపు కమిషనర్ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

## దార్శనికత విలువలు, శ్రేష్ఠత కోసం రూపొందించిన

# జీవన వ్యవస్థలే విద్యాసంస్థలు

### అద్భుతమైన పురోగతి సాధిస్తున్న ఎంజియూ

### మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయ నాలుగవ స్నాతకోత్సవంలో పాల్గొన్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ




**ప్రజాపక్షం/నల్లగొండ :** విద్యాసంస్థలంటే కేవలం ఇటుకలు, నిర్మాణాలు కాదని, దార్శనికత, విలువలు శ్రేష్ఠత కోసం నిరంతర ప్రయత్నాల ద్వారా రూపొందించబడిన జీవన వ్యవస్థలని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. సోమవారం ఆయన నల్లగొండ జిల్లా, నార్కెట్‌పల్లి మండలంలో ఉన్న మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయ నాలుగవ స్నాతకోత్సవానికి అధ్యక్షత వహించారు. ముందుగా ఆర్ట్స్ కాలేజ్ వద్ద రాష్ట్ర గవర్నర్ పోలీస్ గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర గవర్నర్‌కు జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్, నల్లగొండ పార్లమెంటు సభ్యులు కుందూరు రఘువీర్ రెడ్డి, ఎంఎల్‌సిలు శంకర్ నాయక్, అద్దంకి దయాకర్, అదనపు కలెక్టర్లు జె.శ్రీనివాస్, నారాయణ అమిత్ తదితరులు పుష్పగుచ్ఛాలు అందజేసి ఘన స్వాగతం పలికారు. అనంతరం రాష్ట్ర గవర్నర్ యూనివర్సిటీ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన నాలుగవ స్నాతకోత్సవానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఇండోర్ స్టేడియం వద్ద మొక్కలు నాటారు. అనంతరం 22 మందికి పీహెచ్‌డి అవార్డులను, 57 మందికి గోల్డ్ మెడల్స్‌ను ప్రధానం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర గవర్నర్ మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం ఛాన్సలర్ జిష్ణుదేవ్‌వర్మ మాట్లాడుతూ విద్యారంగం, పరిశోధన, ఆవిష్కరణలు సేవా కార్యకలాపాలలో అద్భుతమైన పురోగతి సాధిస్తున్న మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయం గ్రామీణ వాతావరణంలో ఉంటూ తెలంగాణ అంతటా గ్రామాల నుండి ఎక్కువ మంది విద్యార్థులను ఆకర్షిస్తున్నదని అన్నారు. చాలా మంది మొదటితరం అభ్యాసకులు, వారు సహజమైన ప్రతిబంధకాలతో ఇక్కడికి వచ్చి అనేక సవాళ్లను ఎదుర్కొంటున్నారని అయినప్పటికీ, మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయం వారికి ఎదగడానికి ఒక పోషణ వేదికను నిరంతరం అందిస్తున్నదన్నారు. అడ్డంకులను అధిగమించి, బాధ్యతాయుతమైన, ఉత్పాదక విజయవంతమైన పౌరులుగా తమను తాము మార్చుకుంటున్నారని తెలిపారు. ఒక దశాబ్దానికి పైగా, మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయం జాతి నిర్మాణానికి గణనీయంగా దోహదపడిన గ్రాడ్యుయేట్లను తయా రుచేస్తున్నదని, విశ్వవిద్యాలయాన్ని జాతీయ స్థాయి విద్యాసంస్థగా తీర్చిదిద్దడంలో బలమైన పూర్వ విద్యార్థుల నెట్‌వర్క్‌లను పెంపొందించడం కొనసాగించాలని వారి మద్దతును ఉపయోగించుకోవాలని అన్నారు. హైదరాబాద్ ఐఐటీ డైరెక్టర్ బిఎస్ మూర్తి, మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఖాజా అల్తాఫ్ హుస్సేన్, రిజిస్ట్రార్ అల్వాల రవి మాట్లాడారు. కాన్వకేషన్‌లో ఉన్నత విద్యా శాఖ కమిషనర్ దేవసేన, యూనివర్సిటీ తొలి వీసి ప్రొఫసర్ గంగాధర్, పూర్వ రిజిస్ట్రర్లు ప్రొఫసర్ నరేందర్ రెడ్డి, ప్రొఫసర్ ఉమేష్ కుమార్, ఎంజియు రిజిస్ట్రర్ ప్రొఫసర్ అల్వాల రవి,పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ జి.ఉపేందర్ రెడ్డి, లక్ష్మీప్రభ సంధ్యారాణి, ప్రవళిక, ఆకుల రవి, బిఆర్ఏఓయూ యూనివర్సిటీ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ బి ధర్మానాయక్, కొప్పుల అంజిరెడ్డి ప్రొఫసర్ రేఖ, యూనివర్సిటీ వివిధ విభాగాల అధికారులు యూనివర్సిటీ కళాశాల ప్రిన్సిపల్, యూనివర్సిటీ అనుబంధ కళాశాలల కరస్పాండెంట్లు, ప్రిన్సిపల్, కాన్వకేషన్ బంగారు పతకాల దాతలు తదితరులు పాల్గొన్నారు.

## వ్యక్తిగత ప్రయోజనాల కోసం పార్టీ మారారు




### మాజీ మంత్రి జి.జగదీష్ రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** పది మంది ఎంఎఎలు గడ్డిపోచను పట్టుకుని, వరద నుంచి బయటపడాలని చూస్తున్నారని బిఆర్ఎస్ మాజీ మంత్రి జి.జగదీష్ రెడ్డి ఎద్దేవా చేశారు. పది మంది ఎంఎఎలపైన త్వరగా చర్యలను తీసుకోవాలని శాసన సభ స్పీకర్‌ను కోరారు. ఎంఎల్‌ఎలు పోచారం శ్రీనివాస రెడ్డి, కృష్ణ మోహన్ రెడ్డి, యాదయ్య, తెల్లం వెంకట్రావ్, గూడెం మహిపాల్ రెడ్డి, డాక్టర్ సంజయ్ పార్టీ ఫిరాయింపులపైన ఇటీవల స్పీకర్‌కు ఇచ్చిన సమాధానాలపైన శాసనసభ సంయుక్త కార్యదర్శి ఉపేందర్ రెడ్డికి బిఆర్ఎస్ తరపున బిఆర్ఎస్ విప్ కె.పి.వివేకానంద, ఎంఎల్‌ఎ చింతా ప్రభాకర్‌తో కలిసి జగదీష్‌రెడ్డి సోమవారం రీ జాయిండర్లను సమర్పించారు. అనంతరం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద జగదీష్ రెడ్డి మాట్లాడుతూ వ్యక్తిగత ప్రయోజనాల కోసం పది మంది ఎంఎల్‌ఎలు పార్టీ మారారని, వారు పార్టీ మారి తప్పు చేశామని నియోజకవర్గ ప్రజల ముందు తమ తప్పును ఒప్పుకోవాలని జగదీష్ రెడ్డి డిమాండ్ చేశారు.


# మీడియా అకాడమీకి షోయబుల్లాఖాన్ పేరు

### సిపిఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి స్టాలిన్ డిమాండ్




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ మీడియా అకాడమీకి షోయబుల్లాఖాన్ పేరు పెట్టాలని సిపిఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి స్టాలిన్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. తెలంగాణ సాయుధ పోరాట వార్షికోత్సవాల సందర్భంగా కాచిగూడలో సిపిఐ హైదరాబాద్ జిల్లా కౌన్సిల్ ఆధ్వర్యంలో పలువురు సిపిఐ నాయకులు షోయబుల్లాఖాన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా సహాయ కార్యదర్శి కమతం యాదగిరి అధ్యక్షతన జరిగిన సభను ఉద్దేశించిజిల్లా కార్యదర్శి స్టాలిన్ మాట్లాడుతూ నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా దొరలు పటేల్, పట్వారిలు భూస్వామ్యాన్ని కూకటివేళ్ళతో పెకిలించాలని జరుగుతున్న పోరాటాన్ని ప్రతిబింబిస్తూ షోయబుల్లాఖాన్ తాజ్వీ పత్రిక, ఆ తర్వాత రయ్యత్ పత్రికలో వ్యాసాలు ప్రచురించచడంతో వీటిపై నిజాం సర్కార్ కత్తిగట్టి నిషేధం విధించారన్నారు. ఆ తర్వాత ఇమ్రోజ్ పత్రికకు ఎడిటర్‌గా షోయబుల్లాఖాన్ నిజాం సర్కార్ అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై పౌర ప్రజాస్వామిక హక్కులు లేకుండా పత్వాలు జారీ చేస్తున్న పాలనపై తన రచనల ద్వారా కలానికి పదును పెట్టి ప్రజలను చైతన్య పర్చారన్నారు. ఇది నచ్చని నిజాం సర్కార్ షోయబుల్లాఖాన్‌ను బెదిరింపులకు గురి చేసిన అదరలే బెదరలేదని తెలిపారు. ఇదే క్రమంలో పత్రిక పనులు ముగించుకుని ఇంటికి వస్తున్న షోయబుల్లాఖాన్‌ను రజాకార్లు అత్యంత దారుణంగా కాచిగూడలో తన రెండు చేతులను నరికి దారుణంగా హత్య చేశారన్నారు. ఇలాంటి త్యాగాల చరిత్ర కలిగిన షోయబుల్లాఖాన్ పేరును తెలంగాణకి మీడియా అకాడమీకి పెట్టి సముచితంగా గౌరవించుకోవాలని ప్రభుత్వాన్ని స్టాలిన్ డిమాండ్ చేశారు. చరిత్రలో సువర్ణ అక్షరాలతో లిఖించదగ్గిన మహత్తర తెలంగాణ సాయుధ పోరాటాన్ని వక్రీకరిస్తూ బిజెపి దీనికి మతంరంగును జోడించి తప్పుడు చరిత్రను ప్రజల్లోకి తీసుకుపోయే ప్రతి ప్రయత్నాన్ని కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలుగా ఎదిరించి వాస్తవ చరిత్రను ప్రజలకు వివరించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ హైదరాబాద్ జిల్లా కార్యవర్గ సభ్యులు కాంపల్లి శ్రీనివాస్, మహమ్మద్ సలీం, కౌన్సిల్ సభ్యులు ఆరుట్ల రాజ్‌కుమార్, సి.హెచ్.జంగయ్య, కళ్యాణ్, అనిల్, ధరంపురి, గణేష్, ఐలయ్య, ఫహీం, సుశాంత్, అరుణ్, భాను, అరవింద్, చింటూ పాల్గొన్నారు.

## పోలీసు హౌసింగ్ కార్పొరేషన్‌లో ఘనంగా మోక్షగుండం జయంతి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** జాతీయ ఇంజనీర్ల దినోత్సవం సందర్భంగా భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి ఉత్సవాలను లక్డికాపూల్‌లోని తెలంగాణ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ (టిజిపిహెచ్‌సి)లో ఘనంగా నిర్వహించారు. టిజిపిహెచ్‌సి మేనేజింగ్ డైరెక్టర్ ఎం.రమేష్‌తో పాటు సిబ్బంది విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ.. దార్శనిక సివిల్ ఇంజనీర్, రాజనీతిజ్ఞుడు మరియు జాతి నిర్మాత ఎం.విశ్వేశ్వరయ్య యొక్క అమూల్యమైన కృషిని స్మరించుకునేందుకు ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 15న ఇంజనీర్స్ డే జరుపుకుంటున్నామన్నారు. నీటిపారుదల, వరద నియంత్రణ, మౌలిక సదుపాయాల అభివృద్ధిలో ఆయన చేసిన మార్గదర్శక కృషి ఆధునిక భారతదేశానికి పునాది వేసిందన్నారు. భవిష్యత్తులో విభిన్న రంగాలలో కార్పొరేషన్ వృద్ధిని నిలబెట్టడానికి మరియు బలోపేతం చేయడానికి అధిక పనితీరు కోసం కృషి చేయాలని ఉద్యోగులను కోరుతూ, సాంకేతిక నైపుణ్యం, సమగ్రత మరియు ఆవిష్కరణల అవసరాన్ని ఆయన తెలియజేశారు.

# సంస్కరణలు పోలీసు ప్రతిష్ఠకు కీలకం



### డిజిపి డాక్టర్ జితేందర్

### పోలీసు సంస్కరణల ప్రాజెక్ట్‌పై ఐపిఎఫ్‌తో ఒప్పందం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** పోలీసు శాఖలో సంస్కరణలు అమలు చేయడం ద్వారా సమాజంలో పోలీసు ప్రతిష్ట పెరుగుతుందని రాష్ట్ర డిజిపి డాక్టర్ జితేందర్ అన్నారు. తెలంగాణ పోలీసు శాఖలో సంస్కరణల ప్రాజెక్ట్ కోసం ఇండియన్ పోలీసు ఫౌండేషన్ (ఐపిఎఫ్)తో తెలంగాణ పోలీసులు సోమవారం ఒప్పందం చేసుకున్నారు. ఈ సందర్భంగా డిజిపి జితేందర్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో పోలీసు వ్యవస్థను బలోపేతం చేసేందుకు పోలీసు శాఖలో కొత్త కొత్త సంస్కరణలు తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. ఇప్పటికే తెలంగాణ పోలీసులు చేపట్టిన 'మీ సేవ' పోలీస్ స్టేషన్లలో క్యూఆర్ కోడ్ వ్యవస్థ, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్, మహిళల కోసం 'టిసేఫ్' యాప్' వంటి కార్యక్రమాలకు ఈ సంస్కరణల ప్రాజెక్ట్ మరింత విలువ చేకూరుస్తుందని చెప్పారు. ఇండియన్ పోలీస్ ఫౌండేషన్ (ఐపిఎఫ్) అనేది 2014లో న్యూ ఢిల్లీలో మేఘాలయ మాజీ డిజిపి ఎన్. రామచంద్రన్ స్థాపించిన సంస్థ. దేశంలో మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా పోలీసు వ్యవస్థలో కావాల్సిన సంస్కరణలు, అభివృద్ధికి ఈ సంస్థ పరిశోధనలతో కృషి చేస్తుంది. తెలంగాణ పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాషా బిస్త్ మాట్లాడుతూ.. ఈ ప్రాజెక్ట్ ద్వారా ప్రజా కేంద్రిత, ఆధునిక పోలీసింగ్ బలోపేతం అవుతంపదన్నారు. ఈ సందర్భంగా ఐపిఎఫ్ అధ్యక్షుడు, సిఇఓం ప్రకాశ్‌సింగ్ మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా పరిశోధన, సమాజాభివృద్ధి, విధాన రూపకల్పన ద్వారా పోలీసింగ్‌లో మెరుగుదలే తమ లక్ష్యమని తెలిపారు. ఇప్పటికే హిమాచల్ ప్రదేశ్, పంజాబ్, కేరళ, ఉత్తరప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాలలో ఐపిఎఫ్ రాష్ట్ర విభాగాలు ఏర్పాటయ్యాయని, త్వరలో తెలంగాణలోనూ విస్తరించనున్నట్లు చెప్పారు. ఐపిఎఫ్ ఉపాధ్యక్షుడు ఇష్ కుమార్ మాట్లాడుతూ.. ఈ ప్రాజెక్ట్ ద్వారా పౌరుల ఫిర్యాదు పరిష్కార వ్యవస్థ, మహిళల భద్రత, స్పందనాత్మక పోలీసింగ్, పోలీస్ సిబ్బంది కోసం సహాయక వాతావరణం వంటి అంశాలు మెరుగుపడతాయని వివరించారు. ప్రారంభ దశలో ఈ ప్రాజెక్ట్ సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో 15 పోలీస్ స్టేషన్లు, సంగారెడ్డి జిల్లా పరిధిలో 15 పోలీస్ స్టేషన్లలో అమలు అవుతుంది. అనంతరం ఎంపికైన 30 పోలీస్ స్టేషన్లలో సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇస్తారు. ఈ ప్రాజెక్ట్ ఒక సంవత్సరం పాటు కొనసాగి, స్వతంత్ర సంస్థ ద్వారా మూల్యాంకనం జరుగుతుంది. విజయవంతమైన సిఫార్సులు రాష్ట్రంలోని అన్ని పోలీస్ స్టేషన్లలో అమలు చేస్తారు. ప్రస్తుతం ఈ ప్రాజెక్ట్ పంజాబ్, తమిళనాడులోనూ కొనసాగుతోంది. ఈ కార్యక్రమంలో సీనియర్ ఐపిఎస్ అధికారులు దుర్గాప్రసాద్, శరత్‌కుమార్, మహేష్ భగవత్ , అనిల్ కుమార్, అవినాష్ మోహంతి, సి.చంద్రశేఖర్ రెడ్డి, ఎం.రమేశ్, తఫ్సీర్ ఇక్బాల్, పరితోష్ పంకజ్, సురేష్ కుమార్, కోటిరెడ్డి, కవిత, మల్లారెడ్డి, సతీష్, రమణ కుమార్ పాల్గొన్నారు.

**కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం**
ఇ-మెయిల్: knrcmnr@rediffmail.com
No. E1/DB/MCK/8201/232/MCK/2025-26 'ఇ' ప్రొక్యూర్‌మెంట్ టెండర్ నోటీస్ తేది: 12.09.2025
మున్సిపల్ జనరల్ ఫండ్స్ కింద బతుకమ్మ పండుగ 2025 సందర్భంగా 35 పనులకు నిర్వహణ పనులు. **అంచనా విలువ:** రూ. 150.85 లక్షలు. **బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడింగ్ ప్రారంభ తేది:** 15.09.2025న సా.04.00గం.ల నుండి, **బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడింగ్ ఆఖరి తేది:** 23.09.2025న సా.04.00గం.ల వరకు, మరిన్ని వివరాలకు www.tender.telangana.gov.in వెబ్‌సైట్‌లో చూడవచ్చు.
సం/- కమిషనర్, మున్సిపల్ కార్పొరేషన్, కరీంనగర్.
DIPR R.O. No. : 8042-PP/CL/ADVT/1/2025-26, Date: 15-09-2025

**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**
EE-Div16/EE/Divn.16//(SBZ)/GHMC
NIT No. 26/Cir-16/Engg-Div-16/SBZ/GHMC/2025-26 తేది: 15.09.2025
**పని పేరు:** జిహెచ్‌ఎంసి, సికింద్రాబాద్ జోన్, అంబర్‌పేట్ సర్కిల్-16లో సివిల్ పనులు. **మొత్తం టెండర్ విలువ:** రూ.21.15 లక్షలు, **క్ర.సం.1 నుండి 6 వరకు ప్రారంభ తేది:** 16.09.2025న మ.3:00గం.ల నుండి, **బిడ్ స్వీకరణకు ఆఖరి తేది & సమయం:** 19.09.2025న మ.3:15గం.ల వరకు. శ్రీమతి డి.అశలత, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్-16, సర్కిల్-16 అంబర్‌పేట్, సికింద్రాబాద్ జోన్, జిహెచ్‌ఎంసి. సెల్: 9963550657 / 6309919062. **సంప్రదించవలసిన చిరునామా:** ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్-16, ఎస్‌బిజెడ్, జిహెచ్‌ఎంసి అబిడ్స్, గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ అనగా www.tender.telangana.gov.inలో చూడవచ్చు.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్-16, ఎస్‌బిజెడ్, జిహెచ్‌ఎంసి
DIPR R.O. No. : 8062-PP/CL/ADVT/1/2025-26, Date: 15-09-2025

## 17న తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం

ప్రజా పక్షం/నల్లగొండ టౌన్: ఈ నెల 17 నిర్వహించనున్న తెలంగాణ ప్రజాపాలన దినోత్సవానికి అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠీ జిల్లా అధికారులను ఆదేశించారు. ప్రజాపాలన దినోత్సవ వేడుకల ఏర్పాట్లపై సోమవారం సాయంత్రం ఆమె జిల్లా అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు.తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా ఈ నెల 17న ఉదయం 10 గంటలకు రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ మైదానంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారని, అనంతరం మంత్రి జిల్లా ప్రజలను ఉద్దేశించి సందేశం ఇస్తారని తెలిపారు. ఆయా శాఖల అధికారులు వారి శాఖల ప్రగతికి సంబంధించిన వివరాలను తక్షణమే సిపిఒకు పంపించాలని చెప్పారు. వేడుకలు నిర్వహించే పరేడ్ గ్రౌండ్లో డయాస్, తాగునీరు, టెంట్లు, పబ్లిక్ అడ్రస్ సిస్టం, లైటింగ్, విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు, సీటింగ్, వేడుకలకు ప్రముఖులను ఆహ్వానించడం, ఇన్విటేషన్ కార్డ్స్, తదితర అన్ని పనులను సంబంధిత శాఖల అధికారులు తక్షణమే ప్రారంభించాలన్నారు. సమయం తక్కువగా ఉన్నందున మంగళవారం నాటికి అన్ని పనులు పూర్తి చేయాలని ఆమె ఆదేశించారు.

## ఫిర్యాదులపై చట్టపరంగా చర్యలు

### జిల్లా ఎస్‌పి నరసింహ

ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్:ప్రజాసమస్యలుపరిష్కరిస్తూబాధితులకు అండగా ఉంటూ ఫిర్యాదులపై చట్టపరంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా ఎస్‌పి కె నరసింహ అన్నారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజావాణి అర్జీలను పరిశీలించారు. ఎస్‌పి మాట్లాడుతూ ఫిర్యాదుదారులకుభరోసా కల్పించాలన్నారు.కుటుంబతగాదాలు, భూ తగాదాలు



ఉంటే సామరస్యంగా పరిష్కరించుకోవాలని సూచించారు.

## పోక్సో కేసులో నేరస్థుడికి 21 ఏళ్ళ జైలు

### 8 ఏళ్ళ చిన్నారిపై లైంగిక దాడి
### ఏడున్నర ఏళ్ల తర్వాత తీర్పు
### బాధితురాలికి రూ. 10 లక్షల పరిహారం



ప్రజాపక్షం/చిట్యాల: నల్లగొండ జిల్లా చిట్యాల మండలం వనిపాకల గ్రామంలో ఏడున్నరేండ్ల క్రింద 8 సంవత్సరాల మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడిన కేసులో నేరస్థుడికి నల్లగొండ జిల్లా పోక్సో కోర్టు కఠిన శిక్షను ఖరారు చేసింది. ఈ కేసుకు సంభందించిన తీర్పును సోమవారం కోర్టు వెలువరించింది. వివరాలకు వెళితే... వనిపాకల గ్రామానికి చెం దిన దోమల రాములు 2018 సంవత్సరం ఫిబ్రవరి 1వ తేదీన గ్రామానికి చెందిన ఎనిమిదేళ్ళ బాలిక ఇంట్లోకి ప్రవేశించి లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ సంఘటనపై బాధితురాలి తండ్రి చిట్యాల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు అయ్యింది. పోక్సో చట్టం, 2012 ప్రకారం చార్జీషీట్ దాఖలు చేస్తూ కోర్టులో ప్రవేశ పెట్టారు. సుధీర్ఘ విచారణ అనంతరం కోర్టు న్యాయమూర్తి రోజారమణి నేడు తుది తీర్పు వెల్లడించారు. ఈ కేసులో నిందితుడికి 21 సంవత్సరాల కారాగార శిక్షతో పాటు, రూ. 30 వేల జరిమానా విధించారు. అంతేకాకుండా బాధితురాలికి రూ. 10 లక్షల నష్ట పరిహారం చెల్లించాలని ఆమె తీర్పునిచ్చింది.

## శాఖల సమన్వయంతోనే కార్యక్రమాలు విజయవంతం

### సూర్యాపేట కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్



ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ : శాఖల సమన్వయంతో స్వస్త్ నారి, సశక్త్ పరివార్ అభియాన్ (ఆరోగ్య మహిళ, శక్తివంతమైన కుటుంబం) కార్యక్రమాలను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి టాస్క్‌ఫోర్స్ సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ఈ నెల 17 నుండి అక్టోబర్ 2వ తేదీ వరకు ఈ కార్యక్రమం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో అన్ని ఆరోగ్య కేంద్రాల యందు ప్రత్యేక మహిళా ఆరోగ్య వైద్య శిభిరాలను, ప్రత్యేక వైద్య నిపుణులచే ఆరోగ్య పరీక్షలు నిర్వహించబడుతాయన్నారు. జిల్లా అధికారులందరు తమ శాఖ ద్వారా భాగస్వామ్యమై సహాయ సహకారాలు అందించాలని సూచించారు. కార్యక్రమాలు క్షేత్రస్థాయిలో లైన్ డిపార్టుమెంట్ వారి సమన్వయంతో కుటుంబ సంక్షేమ కార్యక్రమాలను, ప్రత్యేక వైద్య నిపుణులచే అన్ని ఆరోగ్య కేంద్రాలలో మహిళా ఆరోగ్య వైద్య శిభిరాలు ఏర్పాటు చేయబడుతాయన్నారు.అధిక రక్తపోటు, మధుమేహం, నోటి క్యాన్సర్, బ్రెస్ట్ క్యాన్సర్, సర్వైకిల్ క్యాన్సర్, క్షయ, రక్తహీనత, గర్భిణీ స్త్రీలకు, పిల్లలకు కంటి, చెవి, ముక్కు, గొంతు, దంతాలు, చర్మ సంబంధిత, మానసిక సంబంధ మైనగర్భిణీ పరీక్షలు, రక్తహీనత పరీక్షలు, ఎంసిపి కార్ట్, వ్యాధి నిరోధక టీకాలు, నిక్షయ మిత్ర, టిబి పేషంట్ సపోర్ట్, ఆభా కార్డ్ నమోదు, కిశోర బాలికలు, యువతులకు రుతుస్రావ సంబంధ పరీక్షలు, పోషణ, ఆహార పదార్థాలలో 10శాతం వంట నూనెలు, చక్కెర తగ్గించటం, రక్తదాన శిభిరాలు నిర్వహించడం జరుగుతుందని వివరించారు.కార్యక్రమాన్ని స్త్రీ, శిశు సంక్షేమ శాఖ, విద్యాశాఖ, యువజన, పంచాయితీరాజ్ సంస్థలు, గ్రామీణాభివృద్ధి, గిరిజనాభివృద్ధి, సామాజిక సంస్థల భాగస్వామ్యంతో మన జిల్లాలో అమలు పరిచి విజయవంతం చేస్తామని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి చంద్రశేఖర్ తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ సీతారామారావు, డిఆర్‌డిఏ పిడి అప్పారావు, అన్ని శాఖల జిల్లా అధికారులు, వైద్య ఆరోగ్య శాఖ ప్రోగ్రాం అధికారులు పాల్గొన్నారు.

### స్వచ్ఛత హి సేవ కార్యక్రమాన్ని జిల్లాలో విజయవంతం చేయాలి

స్వచ్ఛతా హి సేవ 2025 కార్యక్రమాన్ని జిల్లాలో విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరం నందు స్వచ్ఛతా హి సేవ 2025 పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. స్వచ్ఛతతో పల్లెలు మెరువాలని పకడ్బందిగా ఈ కార్యక్రమం జరగాలని, స్వచ్ఛోత్సవ్ థీమ్‌తో ఈ కార్యక్రమాలు సెప్టెంబర్ 17 నుండి అక్టోబర్ 2 వరకు జిల్లాలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో జరుపాలని తెలిపారు.ప్రజలను భాగస్వాములను చేయడం అత్యంత ముఖ్యమని స్పష్టం చేశారు. ఈ 15 రోజులు గ్రామాలు, మున్సిపాలిటిలో నిర్వహించాల్సి ఉంటుందని, అందులో ముఖ్యంగా చెత్త పేరుకుపోయిన ప్రదేశాలను గుర్తించి శుభ్రపరచడం, అన్ని ప్రభుత్వ, ప్రయివేటు కార్యాలయాలు, విద్యాసంస్థలు ఇతర ప్రాంతాలను శుభ్రపరచడం, క్లీన్ అండ్ గ్రీన్, సఫాయి మిత్ర సురక్షా శిభిర్, శ్రమదాన కార్యక్రమాలు, వేస్ట్ నుండి ఆర్ట్ క్రియేట్ చేయడం, ఫుడ్ స్ట్రీట్, ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్‌మెంట్ కార్యక్రమాలు అన్ని శాఖలు భాగస్వామ్యంతో చేపట్టాలని ఆదేశించారు.గ్రామ పంచాయితీలలో యువత, ఎస్‌హెచ్‌జిలు, గ్రామ పెద్దలు, ఎన్‌జిఓల భాగస్వామ్యంతో చేపట్టి పంచాయితీ కార్యదర్శులచే కార్యక్రమం ప్రారంభానికి ముందు, ఆ తరువాత ఫోటోలను తీయాలన్నారు. స్వచ్ఛత హి సేవ 2025 పోర్టల్ నందు నమోదు చేయాలన్నారు. అదనపు కలెక్టర్ కె సీతారామారావు, డిఆర్‌డిఏ పిడి అప్పారావు, డిపిఒ యాదగిరి, డిఎంహెచ్‌ఓ చంద్రశేఖర్, సంక్షేమ అధికారులు దయానంద రాణి, శంకర్ నాయక్ పాల్గొన్నారు.



## విద్యార్థులు క్రీడల్లో రాణించాలి



ప్రజాపక్షం/సూర్యాపేట రూరల్ : విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో కూడా రాణించాలని సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ కొప్పుల వేణారెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని యండ్లపల్లిలో దండి అంతయ్య జ్ఞాపకార్థం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సూర్యాపేట నియోజక వర్గ స్థాయి,వాలీబాల్ క్రీడోత్సవాల టోర్నమెంట్, సెలక్షన్స్ కార్యక్రమానికి ఆయన జ్యోతిప్రజ్వలన చేసి మాట్లాడారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కోతి గోపాల్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దండి రమేష్, మండల ఎంఇఒ శేషగాని శ్రీనివాస్ గౌడ్, దండు మైసమ్మ దేవస్థానం చైర్మన్ తంగెళ్ళ కరుణాకర్‌రెడ్డి, డిసిసిఉపాధ్యక్షుడు కుంట్ల వెంకట నాగిరెడ్డి, మార్కెట్ డైరెక్టర్ దాసరి తిరుమల్‌రావు, పట్టణ కాంగ్రెస్‌అధ్యక్షులు యండి అంజద్‌అలీ పాల్గొన్నారు.


## ట్రిపుల్ ఆర్ అలైన్మెంట్ మార్చాలి



ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం : త్రిబుల్ ఆర్ అలైన్మెంట్ భూ నిర్వాసితులు మార్చాలంటూ సంస్థాన్ నారాయణపురం మండలం దేవి రెడ్డి బంగ్లా వద్ద రహదారిపై ధర్నా నిర్వహించారు. భూములు కోల్పోతున్న రైతులు మాట్లాడుతూ వ్యవసాయ మీద ఆధారపడి జీవనం గడుపుతున్న తమను ప్రభుత్వం అన్యాయంగా భూములు రోడ్డు కోసం తీసుకున్నట్లయితే నిరాశ్రయులు గా జీవనం పరిస్థితులు కోల్పోయి రోడ్డున పడే పరిస్థితులు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ధర్నా జరుగుతున్న విషయం తెలుసుకున్న ఎస్ఐ జగన్ సంఘటన స్థలానికి చేరుకొని భూ నిర్వాసితులను అదుపులోకి తీసుకొని రైతులతో మాట్లాడి శాంతింప చేశారు.


## పేదల కోసం పోరాటాలు

### సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంకటేష్




ప్రజాపక్షం/ఆలేరు:పేద ప్రజల అభ్యున్నతి కోసం అలుపెరగని పోరాటాలు నిర్వహించిన మహోన్నతమైన దంపతులు కట్కూరి సుశీల దేవి రామచంద్ర రెడ్డి అని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చెక్క వెంకటేష్ కొనియాడారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వారోత్సవాల్లో భాగంగా సోమవారం కొల్లూరు మంతపురి, బహదూర్ పేట, తదితర గ్రామాల్లో కట్కూరి సుశీల దేవి రామ చంద్ర రెడ్డి, గోరంతల రామచంద్ర రెడ్డి, ఆకారం యాగిరెడ్డి స్థూపాలకునివాళులర్పించారు. చెక్క వెంకటేష్ మాట్లాడుతూ అమరవీరుల ఆశయాలతో ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు. సిపిఐ నాయకులు తెడ్డు ఆంజనేయులు, పేరపు ఐలయ్య, దానయ్య, మైసయ్య, దారా ఉదయ, చంద్రయ్య నర్సయ్యలు పాల్గొన్నారు.


## యూరియా ఏదయ్యా?



ప్రజాపక్షం/హాలియా: యూరియా కొరత కారణంగా రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సోమవారం కొత్తపల్లి సహకార సంఘం భవనం ఎదుట రైతులు ధర్నాకు దిగారు. హాలియా,నాగార్జునసాగర్ ప్రధాన రహదారిపై సుమారు గంటసేపు రహదారిపై రాకపోకలు నిలిచిపోయాయి. యూరియా కోసం ప్రతి రోజు ఎదురుచూడాల్సి వస్తుందని రైతులు వాపోతున్నారు. పంటలు దెబ్బతింటాయన్నారు.. భారీ నష్టం వస్తుందన్నారు. రిటైల్ దుకాణదారులకు యూరియా కేటాయించినప్పటికీ వ్యాపారులు యూరియాను బ్లాక్‌లో రూ.350 నుండి రూ.400 వరకు విక్రయిస్తున్నారని ఆరోపిస్తున్నారు. పోలీసులు రైతులకు నచ్చ చెప్పి ధర్నాలు విరమింపచేశారు.

## హన్యానాయక్‌కు 'గ్లోబల్‌ఎక్స్‌లెన్స్' అవార్డు





ప్రజాపక్షం/మిర్యాలగూడ: అనాధ పిల్లలు, వృద్ధులు, వికలాంగులు,వితంతువులు, యాచకులుతోపాటు విద్యా, వైద్య రంగాలకు విశిష్ట సేవలతోపాటు రక్తదానం, అన్నదానం వంటి అనే సేవలు అందిస్తున్నందుకుగాను సంఘ సంస్కర్తగా పేరు ప్రఖ్యాతలు పొందిన మిర్యాలగూడకు చెందిన ఫెయిత్ బంజారా ఆశ్రమ నిర్వాహకుడు, సామాజిక వేత్త ధీరావత్ హన్యానాయక్ ఈనెల 13న థాయ్ లాండ్‌లోని సిలోంలో హాలిడే ఇన్ హోటల్‌లో అంతర్జాతీయ అవార్డుల ప్రధానోత్సవంలో ఆయన గ్లోబల్ ఎక్స్‌లెన్స్ అవార్డును అందుకున్నారు. ఆయన మాట్లాడుతూ తాను చేస్తున్న సేవలను గుర్తించి గ్లోబల్ ఎక్స్‌లెన్స్ సంస్థ తనకు అవార్డును, సర్టిఫికెట్‌ను అందించడం సంతోషంగా ఉందన్నారు. తన జీవితాన్ని సమాజ సేవకే అంకితం చేస్తానన్నారు. హన్యానాయక్‌కు విద్యావేత్తలు, రాజకీయ ప్రముఖులు అభినందనలు తెలిపారు.

## ధైర్యం, నిబద్ధత, త్యాగనిరతి స్ఫూర్తిదాయకం

### సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గన్నా చంద్ర శేఖర్



ప్రజాపక్షం/హుజూర్‌నగర్: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధులు చూపించిన ధైర్యం,నిబద్ధత,త్యాగనిరతి ప్రజలందరికీ ఎప్పటికీ స్ఫూర్తినిస్తుందని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గన్నా చంద్ర శేఖర్ అన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల్లో భాగంగా సోమవారం హుజూర్‌నగర్‌లోని అమరవీరుల స్థూపం వద్ద నివాళులు అర్పించారు. వారు మాట్లాడుతూ నైజాం నవాబుల నిరంకుశ పాలన,భూస్వాముల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా దేశ చరిత్రలోనే గొప్ప పోరాటం తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటమన్నారు. సిపిఐ హుజూర్‌నగర్ పట్టణ కార్యదర్శి గుండు వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు యల్లావుల రాములు,జిల్లా కార్యవర్గ సభ్యులు కంబాల శ్రీనివాస్,దేవరం మల్లీశ్వరీ,కొప్పోజు సూర్యనారాయణ, కందుల వెంకటేశ్వర్లు, సోమగాని కృష్ణ, దొంతగాని సత్యనారాయణ,యల్లావుల రమేష్, ఇందిరాల వెంకటేశ్వర్లు, జడ వెంకన్న, చెన్నగాని సైదులు, యల్లావుల ఉమ జక్కుల రమణ పాల్గొన్నారు.

## నేటి విద్యార్థులకు డిజిటల్ విద్య అవసరం

### కోదాడ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి, జిల్లా కలెక్టర్ తేజస్‌నంద్‌లాల్ పవార్

ప్రజాపక్షం/కోదాడ: నేటి విద్యార్థులకు డిజిటల్ ఎడ్యుకేషన్ అవసరమని, ఏఐ అనుసంధానంతో నైపుణ్యమైన విద్యను అందించాలని కోదాడ ఎమ్మె ల్యే పద్మావతిరెడ్డి, జిల్లా కలెక్టర్ తేజస్‌నంద్‌లాల్ పవార్ లు అన్నారు. సోమవారం కోదాడ పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో కంప్యూటర్‌ల్యాబ్ ప్రారంభించారు. వారు మాట్లాడుతూ వి ద్యార్థులకు నైపుణ్యమైన విద్యను అందించడానికి తెలంగాణప్రభుత్వంకృషిచేస్తుందన్నారు. ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి, జిల్లా కలెక్టర్ తేజస్‌నంద్‌లాల్ పవార్ చేస్తున్న కృషికి కోదాడ మండల విద్యాధికారి సలీంషరిఫ్ కృతజ్ఞతాభివందనాలు తెలిపారు. కోదాడ ఆర్డీవో సూర్యనారాయణ, తహసిల్దార్ వాజీద్‌అలీ, కోదాడ మున్సిపల్ కమిషనర్ రమాదేవి, జిల్లా గ్రంధాలయ చైర్మన్ వంగవీటి రామారావు, పిసిసి డెలిగెట్ చింతకుంట్ల లక్ష్మి నారాయణరెడ్డి, పాఠశాల ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు డి.మార్కేండేయ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## నిస్వార్థ కమ్యూనిస్టు నాయకుడు ఎల్లంకి శ్రీనివాస్

### మాజీ ఎమ్మెల్యే ఉజ్జిని యాదగిరిరావు
### సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బచ్చనగోని గాలయ్య



ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం : మండ లం అల్లందేవి చెరువు గ్రామంలో సీపీఐ మండల నాయకుడు మాజీ ఎంపీపీ ఎల్లంకి శ్రీనివాస్ 10వవర్ధంతిని ఆయన స్థూపం వద్ద జోహార్లు అర్పిం చారు. మునుగోడు మాజీ ఎమ్మెల్యే ఉజ్జిని యాదగిరిరావు మాట్లాడుతూ శ్రీనివాస్ నిస్వార్ధ గల కమ్యూనిస్టు నాయకుడు అన్నారు.సాధారణ కుటుంబంలో పుట్టి, ప్రజల సమస్య ల పరిష్కారం కోసం ఈ ప్రాంత అభివృద్ధికి ఎంతో కృషి చేశారని గుర్తు చేశారు. పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని గుండు కిష్టయ్య, కురుమిద్ద లింగయ్యలతో కలిసి భూ పోరాటాలు నిర్వహించి అప్పటి ఎమ్మెల్యే ఉజ్జిని నారాయణరావు చొరవతో అల్లందేవి చెరువు గ్రామంలో ఇంటి నిర్మాణాలు చేయించారని గుర్తు చేశారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బచ్చనగోని గాలయ్య, ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షుడు కే.శ్రీనివాస్, సిపిఐ మండల కార్యదర్శి దుబ్బాక భాస్కర్, సిపిఐ జిల్లా సమితి సభ్యుడు కలకొండ సంజీవ, సీపీఐ సీనియర్ నాయకులు మాజీ సర్పంచ్ దేశిడి నరేందర్ రెడ్డి, సురవి నరసింహ, గుండు నరసింహ, పొట్ట శంకరయ్య, పల్లె మల్లారెడ్డి, ముత్యాల అంజయ్య, ఎర్రోళ్ల లింగస్వామి, బద్దుల పెంటయ్య, ఈద మల్లయ్య, గడ్డం యాదగిరి,శ్రీనివాస్‌సతీమణిజంగమ్మ ఉన్నారు.

## వాహనం ఢీ.. మహిళ మృతి

ప్రజాపక్షం/ఉండవెల్లి: 44వ జాతీయ రహదారి మీదుగా ఉండవెల్లి స్టేజి సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని మహిళ మృతి చెందిన సంఘటన పై సోమవారం స్థానికులు తెలిపిన అనంతరం ఎస్ఐ శేఖర్ పోలీసు సిబ్బంది, సంఘటన స్థలానికి చేరుకున్నారు. పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. అర్ధరాత్రి వేళ గుర్తు తెలియని వాహనం ఢీకొని మహిళ అక్కడక్కడ మృతి చెందినట్లు ఎస్సై శేఖర్ తెలిపారు. అర్ధరాత్రి వేళలో ఈ సంఘటన చోటు చేసుకున్నట్లు వారు పేర్కొన్నారు. మృతురాలు వయస్సుః45 సంవత్సరాలు. పసుపు రంగు చీర ధరించినట్లు తెలిపారు.

## రజాకార్లను తరిమికొట్టిన చరిత్ర కమ్యూనిస్టులదే : పల్లె శేఖర్‌రెడ్డి



ప్రజాపక్షం/చౌటుప్పల్ :తెలంగాణ సాయుధ పోరాటంలో నిజాం నవాబును రజాకార్లను తరిమికొట్టిన చరిత్ర కమ్యూనిస్టులదే అని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పల్లె శేఖర్ రెడ్డి అన్నారు. తెలంగాణ సాయుధ పోరాట వార్షికోత్సవాలు పురస్కరించుకుని సోమవారం చౌటుప్పల్ పట్టణంలోని తెలంగాణ సాయుధ పోరాట యోధుడు బొమ్మగాని ధర్మభిక్షం విగ్రహానికి సిపిఐ నాయకుల ఆధ్వర్యంలో పూలమాల వేసి నివాళులర్పించారు. పల్లె శేఖర్ రెడ్డి మాట్లాడుతూ పోరాట యోధుల వల్లే దున్నే వాడికి భూమి దక్కడంతో పాటు వెట్టిచాకిరి విముక్తి కలిగిందని, వేలాది గ్రామాలు నిజాం కబంధహస్తాల నుండి విముక్తి చెందాయని, సాయుధ పోరాటంలో 4500 కమ్యూనిస్టులు అమరులయ్యారన్నారు. వారి చరిత్రను భా వితరాలకు తెలియజేసేందుకు కమ్యూనిస్టులంతా కృషి చేయాలన్నారు. రాచరికనికి వ్యతిరేకంగా సాగిన పోరాటాన్ని నేడు మతపరమైన పోరాటంగా చిత్రీకరించేందుకు కుట్రలు జరుగుతున్నాయని,మేధావులంతా తిప్పికొట్టాలని కోరారు.సిపిఐ మున్సిపల్ కార్యదర్శి పగిళ్ల మోహన్ రెడ్డి, ఏఐటిసి జిల్లా ఉపాధ్యక్షుడు పిల్లి శంకర్, ఉడుత రామలింగం, ఏఐవైఎఫ్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కొండూరు వెంకటేష్, టంగుటూరు రాములు, బద్దుల సుధాకర్,దాసరిఅంజయ్య,నీళ్లబిక్షపతి,కుంటిపాపయ్య, సింగపంగ బుచ్చయ్య, పాపగల శంకరయ్య, బెదరకోట యాదయ్య, కేతరాజు శేఖర్ ఉన్నారు.

## టిబి, మాదకద్రవ్య రహిత 'నల్లగొండ'గా తీర్చిదిద్దాలి

### రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

ప్రజాపక్షం/నల్లగొండ: నల్లగొండ జిల్లాను టీబి రహిత, మాదకద్రవ్య రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పిలుపునిచ్చారు.ఒకరోజు నల్లగొండ జిల్లా పర్యటనలో భాగంగా సోమవారం అయన మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయం నాల్గవ స్నాతకోత్సవంలో పాల్గొన్న అనంతరం జిల్లా కలెక్టర్ కార్యాలయ ఆవరణలోని ఉదయాదిత్య భవన్‌లో జిల్లా అధికారులు, ప్రముఖ వ్యక్తులతోలతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వ పథకాల అమలుపై జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ముందుగా రాష్ట్ర గవర్నర్ కు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.అనంతరం రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ మాట్లాడుతూ క్షయ వ్యాధిని జిల్లాలో సమూలంగా నిర్మూలించేందుకు ఉన్న అడ్డంకులను అడిగి తెలుసుకున్నారు. ప్రజల్లో టీబీ పట్ల అవగాహన కల్పించాలని, క్షయ వ్యాధి నివారణకు సొసైటీలో అందరినీ భాగస్వామ్యం చేయాలని అన్నారు. ముఖ్యంగా నల్గొండ జిల్లాలో కవులు, కళాకారులు, రచయితలు వివిధ రంగాలలోని ప్రముఖులను టీబి ముక్త్ భారత్ లో భాగస్వాములను చేసి వారితో ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేసి టీబిని పూర్తిగా నిర్మూలించేందుకు చర్యలు చేపట్టాలని నల్గొండ పార్లమెంటు సభ్యులు కుందూరు రఘువీర్ రెడ్డికి సూచించారు. జిల్లాలో గంజా ఎక్కువ మొత్తంలో ఉందని తెలుసుకొని గంజా నిర్మూలనలో సైతం ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, ఈ రెండు అంశాలపై తో పాటు, మహిళా సాధికారతకు కృషి చేయాలని, ఈ కార్యక్రమాలలో ప్రతి ఒక్కరిని భాగస్వామ్యం చేయాలని చెప్పారు.నల్లగొండ పార్లమెంట్ సభ్యులు కుందూరు రఘువీర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర గవర్నర్ సూచనల మేరకు నల్గొండ జిల్లాలో టీబి నివారణకు ముఖ్యుల సలహాలు తీసుకోవడమే కాకుండా, జిల్లా యంత్రాంగంతో కలిసి పని చేస్తామని అన్నారు. మిర్యాలగూడ ప్రాంతంలో ఆసియాలోనే అతి పెద్ద రైస్ మిల్లు ఇండస్ట్రీ ఉందని, దీనివల్ల వాతావరణ కాలుష్యం ,టీబి వంటి వ్యాధులు సోకడానికి ఆస్కారం ఉందని ,ఆ ప్రాంతంపై ఎక్కువ దృష్టి కేంద్రీకరించి టీబి నివారణకు కృషి చేస్తామన్నారు. అలాగే పట్టణాలలో గంజా వాడకం ఎక్కువగా ఉందని, దీనిని నివారించడానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్, ఎమ్మెల్సీ శంకర్ నాయక్, మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి , మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, దేవరకొండ ఏసీపీ మౌనిక, డిఎఫ్ఓ రాజశేఖర్ ,రాష్ట్ర గవర్నర్ జాయింట్ సెక్రెటరీ భవాని శంకర్, జిల్లా అధికారులు, వివిధ రంగాల ప్రముఖులు , తదితరులు పాల్గొన్నారు.






## సాయుధ పోరాటాన్ని వక్రీకరిస్తున్న బిజెపి

### సెప్టెంబర్ 17 ప్రజాపాలన దినోత్సవం అర్థరహితం – సాయుధ పోరాట వారసులు కమ్యూనిస్టులే
### సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కలకొండ కాంతయ్య



ప్రజాపక్షం/పెద్దఅడిశర్లపల్లి: నైజామును తరిమి కొట్టి ప్రజలకు స్వేచ్ఛ స్వతంత్రాలను అందించిన తెలంగాణ సాయుధ పోరాటాన్ని బిజెపి వక్రీకరిస్తుందని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కలకొండ కాంతయ ఆరోపించారు.ఈనెల 11 నుండి 17 వరకు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల సందర్భంగా సిపిఐ పీఏపల్లి మండల సమితి ఆధ్వర్యంలో ఉమ్మడి మండలంలోని గుడిపల్లి, తిరుమలగిరి, అంగడిపేటలో ఉన్న అమరజీవి కత్తి నాగిరెడ్డి, నెలంటి రామనరసయ్య, చోల్లేటి రాఘవాచారి ప్రజా పోరాటంలో భాగస్వామ్యులైన అమరుల స్మారక స్థూపాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.అనంతరం జరిగిన సభలో కాంతయ్య మాట్లాడుతూ భూమికోసం భుక్తి కోసం తెలంగాణ విముక్తి కోసం సిపిఐ ఆధ్వర్యంలో సాయుధ పోరాటం చేసి నిజాం నియంత పాలన నుంచి దొరల, భూస్వాముల అరాచకాల నుండి తెలంగాణను విముక్తి చేసిన తెలంగాణ రైతాంగ సాయిధ పోరాట అమరులకు జోహార్లు అర్పిస్తూ సామాన్యులే సాయుధులై భారత దేశ చరిత్రలో ఒక మహా ఉజ్వల ఘట్టం అన్నారు.తెలంగాణ సాయుధ పోరాట రాచరికం భూస్వామి వ్యవస్థ మతోన్మాదంపై ఏకకాలంలో సాగిన ఉమ్మడి సమరమది అని అన్నారు. ఈ నెల 17న విమోచన దినోత్సవం పేరిట బిజెపి చేపట్టిన కార్యక్రమాలు ప్రజలను మభ్య పెట్టేందుకేనని అన్నారు.తెలంగాణ విలీన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహిస్తామని ట్యాంక్ బండ్ పై సాయుధ పోరాట యోధుల విగ్రహాలు పెడతామని పాఠ్యపుస్తకాలలో తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను చేర్చుతామని చెప్పిన ప్రభుత్వం ఎందుకు ఆ హామీలను నెరవేర్చడం లేదని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి కుంభం జయరాములు గౌడ్,సహాయ కార్యదర్శి నూనె కాంతారావు,ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు వలమల్ల ఆంజనేయులు,మండల కార్యవర్గ సభ్యులు అలుగుబెల్లి భాస్కర్ రెడ్డి పార్టీ అభిమానులు వివిధ పార్టీల నాయకులు మునగాల అంజిరెడ్డి, పాల్వాయి రంగారెడ్డి, చోల్లేటి బ్రహ్మాచారి,దొడ్డి లక్ష్మయ్య,ఆంజనేయులు, పరమేష, శ్రీనివాస్‌రెడ్డి, బోయ సుధాకర్‌రెడ్డి, అడెపు నరసింహ,మల్లాచారి,భూతం సైదులు, చంద్రారెడ్డి,వెంకటేశ్వర్లు, రుక్మారెడ్డి, శివకుమార్,అశోక్, వాల్య నాయక్, ప్రసాద్ తదితరులు ఉన్నారు.



# జాతీయం

NATIONAL & GENERAL NEWS

## నేటి నుంచి భారత్‌–అమెరికా వాణిజ్య చర్చలు

**న్యూఢిల్లీ:** ఒకవైపు భారీ టారిఫ్‌లతో భారత్‌పై అమెరికా ఒత్తిడి పెంచుతుండగా, మరోవైపు ఇరు దేశాల మధ్య వాణిజ్య సంబంధాలను మెరుగుపరిచేందుకు కీలక చర్చలు జరగనున్నాయి. భారత్, అమెరికాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంపై తదుపరి దశ చర్చల కోసం అమెరికా ముఖ్య ప్రతినిధి సోమవారం రాత్రి భారత్‌కు చేరుకున్నారు. చర్చలు మంగళవారం ప్రారంభం కానున్నాయి. ఈ చర్చల్లో అమెరికా తరఫున దక్షిణ, మధ్య ఆసియా వ్యవహారాల సహాయ వాణిజ్య ప్రతినిధి బ్రెండన్ లించ్ పాల్గొననుండగా, భారత్ తరఫున వాణిజ్య శాఖ ప్రత్యేక కార్యదర్శి రాజేశ్ అగర్వాల్ ప్రాతినిధ్యం వహించనున్నారు. తాత్కాలిక వాణిజ్య ఒప్పందంపై గత కొన్ని నెలలుగా సంప్రదింపులు జరుగుతున్నప్పటికీ, కొన్ని అంశాల్లో పురోగతి సాధించాల్సి ఉంది. ముఖ్యంగా వ్యవసాయ, డెయిరీ రంగాలను విదేశీ పోటీకి అందుబాటులో ఉంచాలన్న అమెరికా డిమాండ్‌పై భారత అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దేశంలో అత్యధిక జనాభాకు జీవనాధారమైన ఈ రంగాలు సున్నితమైనవని వారు స్పష్టం చేశారు.

## అమృత్‌సర్, గుర్దాస్‌పూర్ వరద ప్రభావిత ప్రాంతాల్లో రాహుల్ పర్యటన

### బాధితులకు పరామర్శ





**చండీగఢ్ :** ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ సోమవారం పంజాబ్‌లోని అమృత్‌సర్, గురుదాస్‌పూర్ జిల్లాల్లో వరద ప్రభావిత ప్రాంతాలను సందర్శించి ప్రకృతి వైపరీత్యంతో ప్రభావితమైన వారిని పరామర్శించారు. వారితో మాట్లాడారు. ఆయనతో పాటు పంజాబ్ కాంగ్రెస్ చీఫ్ అమరీందర్ సింగ్ రాజా వారింగ్, పంజాబ్ అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుడు ప్రతాప్ సింగ్ బజ్వా, అమృత్‌సర్ ఎంపి గుర్జీత్ సింగ్ ఔజ్లా, గురుదాస్‌పూర్ ఎంపి సుఖ్‌జిందర్ సింగ్ రంధావా, ఇతర పార్టీ నాయకులు ఉన్నారు. అమృత్‌సర్ చేరుకున్న తర్వాత, ఆయన అజ్నాలాలోని ఘోనేవాల్ గ్రామానికి వెళ్లి వరద బాధితులను కలిసి నష్టం గురించి ఆరా తీశారు. అజ్నాలాలోని అనేక ప్రాంతాలలో ఘోనేవాల్ గ్రామం కూడా ఉంది. ఇది వరద నీటికి తీవ్రంగా దెబ్బతింది. ఇటీవల వరదల వల్ల దెబ్బతిన్న ఇళ్లను రాహుల్‌గాంధీ సందర్శించారు. వరద బాధిత ప్రజల మధ్య కూర్చుని వారితో సంభాషించారు. ఘోనేవాల్ గ్రామాన్ని సందర్శించిన తర్వాత రాహుల్‌గాంధీ అమృత్‌సర్‌లోని రాందాస్ ప్రాంతంలో ఉన్న చారిత్రాత్మక గురుద్వారా బాబా బుద్ధ సాహిబ్‌ను సందర్శించారు. ఆయన గురుద్వారాలో 'అర్దాస్' (ప్రార్థన)లో పాల్గొన్నారు. తరువాత గురుదాస్‌పూర్ జిల్లాలోని దేరా బాబా నానక్‌లోని వరద ప్రభావిత గుర్చక్ గ్రామాన్ని సందర్శించారు. ఎంపి సుఖ్‌జిందర్ రాంధావా వరద నీటితో ప్రభావితమైన వ్యవసాయ పొలాలను రాహుల్ గాంధీకి చూపించారు. రాహుల్‌గాంధీ బాధిత కుటుంబాలను కలుసుకుని సహాయక చర్యలను పరిశీలించారని కాంగ్రెస్ ఎక్స్‌లో పేర్కొంది. 'పంజాబ్‌లో వినాశకరమైన వరదలు వేలాది మంది జీవితాలను నాశనం చేశాయి. రాష్ట్రంలో భారీ ప్రాణనష్టం, ఆస్తి నష్టం జరిగిందియ. ప్రజలు సహాయ శిబిరాల్లో నివసించాల్సి వచ్చింది. పరిస్థితి చాలా దారుణంగా ఉంది. ఇంత క్లిష్ట సమయంలో, ప్రతి కాంగ్రెస్ కార్యకర్త పంజాబ్‌తో ఉన్నారు. వరద బాధిత కుటుంబాలకు సాధ్యమైన ప్రతి విధంగా సహాయం చేయాలని మేము ప్రతి ఒక్కరినీ విజ్ఞప్తి చేస్తున్నాము' అని పోస్ట్ హిందీలో పేర్కొంది. కాంగ్రెస్ ఎమ్మెల్యే పర్గత్ సింగ్ అమృత్‌సర్‌లో మాట్లాడుతూ రాహుల్‌గాంధీ పంజాబ్ బాధను అర్థం చేసుకునే నాయకుడన్నారు. కాంగ్రెస్ నాయకురాలు నవజ్యోత్‌కౌర్ సిద్ధూ అమృత్‌సర్‌లో విలేకరులతో మాట్లాడుతూ రాహుల్ గాంధీ పర్యటన ఒక పెద్ద ప్రేరణ అన్నారు. పంజాబ్ దశాబ్దాలలో అత్యంత దారుణమైన వరద విపత్తును ఎదుర్కొంది. హిమాచల్ ప్రదేశ్, జమ్ము కశ్మీర్‌లోని వాటి పరీవాహక ప్రాంతాలలో భారీ వర్షాల కారణంగా సట్లెజ్, బియాస్, రావి నదులు ఉప్పొంగడంతో పాటు కాలానుగుణంగా ప్రవహించే వాగుల ఫలితంగా వరదలు సంభవించాయి. పంజాబ్‌లో భారీ వర్షాలు కూడా వరదల పరిస్థితిని తీవ్రతరం చేశాయి. వరదల కారణంగా ప్రస్తుతం 56 మంది మరణించగా, 1.98 లక్షల హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నాయి. వరదల్లో అత్యంత ప్రభావితమైన జిల్లాల్లో గురుదాస్‌పూర్, అమృత్‌సర్, కపుర్తలా, పఠాన్‌కోట్, హోషియార్‌పూర్, ఫిరోజ్‌పూర్, ఫాజిల్కా, తర్న్ తరణ్ ఉన్నాయి. కాగా, ఈనెల 9న, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తన పర్యటన సందర్భంగా వరదలతో దెబ్బతిన్న ప్రాంతాలను ఏరియల్ సర్వే నిర్వహించిన తర్వాత పంజాబ్‌లో వరద పరిస్థితి మరియు నష్టాన్ని సమీక్షించారు. వరద బాధిత రాష్ట్రానికి ఇప్పటికే రాష్ట్రంలో ఉన్న రూ. 12,000 కోట్లకు అదనంగా రూ. ,600 కోట్ల ఆర్థిక సహాయాన్ని ఆయన ప్రకటించారు.

## ఐటి ఒప్పందంలో అమెరికా బాటలో నడవాలి

### పార్లమెంటరీ కమిటీ నివేదిక



**న్యూఢిల్లీ :** ప్రపంచ వాణిజ్య సంస్థ(డబ్ల్యుటిఒ) బాధ్యతల నుండి అమెరికా ఏకపక్షంగా వైదొలగడాన్ని, దాని దేశీయ పరిశ్రమలను రక్షించుకోవడానికి సుంకాలు విధించడాన్ని భారతదేశానికి సానుకూలమైన అవకాశంగా చూడాలని పార్లమెంటరీ కమిటీ అభిప్రాయపడింది. ఈ చర్యలను ఉపయోగించుకుని బహుళపాక్షిక ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అగ్రిమెంట్ (ఐటిఎ) కింద అనుకూలమైన నిబంధనలపై చర్చలు జరపాలని లేదా ఈ ఒప్పందం నుండి వైదొలగాలని, ఈ విషయంపై భారతదేశం ఆలోచించాలని కమిటీ సిఫార్సు చేసినట్లు సమాచారం. కమ్యూనికేషన్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీపై స్టాండింగ్ కమిటీ ఒక నివేదికలో 1997లో భారతదేశం సంతకం చేసిన ఈ ఒప్పందమే ఐటి, ఎలక్ట్రానిక్స్ రంగాలను పట్టి పీడిస్తున్న సమస్యలకు కారణమని పేర్కొంది. పెద్ద ఎత్తున వాణిజ్య లోటు, భారతీయ తయారీదారులకు గట్టి పోటీ లేకపోవడం వంటి సమస్యలను ఇది సృష్టించిందని, దీని వల్ల అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థలకు మాత్రమే ప్రయోజనం కలిగిందని కమిటీ తెలిపింది. ఐటిఎతో భారతదేశం ఎదుర్కొన్న అనుభవం చాలా నిరుత్సాహకరంగా ఉందని గుర్తించినట్లు కమిటీ వర్గాలు తెలిపాయి. దీని కారణంగా భారతదేశంలో ఐటి, ఎలక్ట్రానిక్స్ పరిశ్రమ దాదాపుగా తుడిచిపెట్టుకుపోయిందని పేర్కొంది. అయితే, తక్కువ ధరలకు సాంకేతికత అందుబాటులోకి రావడం వల్ల వినియోగదారులకు ప్రయోజనం కలిగిందని కమిటీ అంగీకరించింది. ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ కమిటీకి తెలియజేసిన ప్రకారం, డబ్ల్యుటిఒలో ఐటిఎలో సభ్యురాలిగా ఉన్న భారతదేశం ఏకపక్షంగా ఒప్పందం నుండి వైదొలగడం సాధ్యం కాదు. అయితే, ప్రస్తుత పరిస్థితులలో అమెరికా ఉదాహరణను ఉదహరిస్తూ, ఇది సాధ్యమే అని కమిటీ సూచించింది. సభ్య దేశాల మధ్య పరస్పర జాతీయ ప్రయోజనాల కోసం ద్వైపాక్షిక, బహుపాక్షిక స్థాయిలో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలను ఏర్పాటు చేయాలని బిజెపి ఎంపి నిశికాంత్ దూబే నేతృత్వంలోని పార్లమెంటరీ కమిటీ కోరింది. కమిటీ గత వారం తన నివేదికను ఆమోదించి లోక్ సభ స్పీకర్‌కు సమర్పించింది. పార్లమెంట్ తదుపరి సమావేశంలో దానిని ఆమోదించే అవకాశం ఉంది.

## అదానీ సంస్థలకు 1,050 ఎకరాల భూమి బహుమతి

### బిహార్‌లో బిజెపి ఓటమి ఖాయమైనందువల్లే ఈ చర్య : కాంగ్రెస్ ఆరోపణ



**న్యూఢిల్లీ :** బిహార్‌లోని భాగల్‌పూర్‌లో 1,050 ఎకరాల భూమిని మోదీ ప్రభుత్వం పవర్ ప్లాంట్ ఏర్పాటు కోసం అదానీ సంస్థలకు 'బహుమతి'గా ఇచ్చిందని కాంగ్రెస్ ఆరోపించింది. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో తమ ఓటమి ఖాయమైనట్లు బిజెపి గ్రహించినందునే ఈ చర్యకు పూనుకుందని విమర్శించింది. అయితే ఈ ఆరోపణలపై కేంద్రం, బిహార్ ప్రభుత్వం లేదా అదానీ గ్రూప్ నుండి వెంటనే స్పందన రాలేదు. సోమవారం ఢిల్లీలోని ఎఐసిసి ప్రధాన కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ మీడియా, ప్రచార విభాగ అధిపతి పవన్ ఖేరా మాట్లాడుతూ బిజెపి ఎన్నికల్లో ఓడిపోతుందని భావించినప్పుడల్లా, వ్యాపారవేత్త గౌతమ్ అదానీకి ముందుగానే బహుమతులు ఇస్తాయని పేర్కొన్నారు. బిహార్ భాగల్‌పూర్‌లోని పిర్‌పైంటిలో 33 సంవత్సరాల పాటు సంవత్సరానికి 1 రూపాయికి పవర్ ప్లాంట్ ఏర్పాటు కోసం 10 లక్షల చెట్లు, 1,050 ఎకరాల భూమిని 'రాష్ట్ర సేథ్' గౌతమ్ అదానీకి ఇచ్చారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేడు బిహార్‌ను సందర్శిస్తున్నప్పుడు, అక్కడి గ్రామస్తులను గృహ నిర్బంధంలో ఉంచారు, తద్వారా వారు నిరసన వ్యక్తం చేయకుండా చేశారని మండిపడ్డారు. మహారాష్ట్రలో ఎన్నికలు జరిగినప్పుడు, పవర్ ప్లాంట్ ప్రాజెక్ట్, ధారవిని గౌతమ్ అదానీకి అంతకు ముందు ఇచ్చారని, అదేవిధంగా, జార్ఖండ్, ఛత్తీస్‌గఢ్‌లో ఎన్నికలకు ముందు గౌతమ్ అదానీకి ప్రాజెక్టులు ఇచ్చారని, ఇలా చెప్పుకుంటూ పోతా చాలా ఉన్నాయన్నారు. తాజాగా ప్రధాని మోదీ 1,050 ఎకరాల భూమిని అదానీకి ఇవ్వబోతున్నారని ఖేరా పేర్కొన్నారు. 'ఇది 21,400 కోట్ల రూపాయల బడ్జెట్‌తో 2,400 మెగావాట్ల ప్రాజెక్ట్. దీనిపై బడ్జెట్‌లో ప్రకటన చేశారు. అయితే, ఆ సమయంలో, ప్రభుత్వం స్వయంగా ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తామని చెప్పింది. కానీ తరువాత వెనక్కి తగ్గి ఈ ప్రాజెక్టును గౌతమ్ అదానీకి అప్పగించింది' అని ఆయన అన్నారు. బిహార్ భూమిపై రాష్ట్ర డబ్బుతో ప్లాంట్ నిర్మించి, దాని బొగ్గు నుండి విద్యుత్తును ఉత్పత్తి చేస్తుందని, అయితే రాష్ట్ర ప్రజలకు యూనిట్‌కు 6 రూపాయలకు అమ్ముతున్నారని ఖేరా అన్నారు, ఇది 'డబుల్ లూటీ' అని ఆరోపించారు. బిజెపి మొదట 'ఏక్ పేఢ్ మా కే నామ్' వంటి ప్రచారాలను నిర్వహిస్తుందాని, ఆ తరువాత రైతులు తమ తల్లిగా భావించే అదే భూమిని కేవలం 1 రూపాయికి విలువకడుతుందన్నారు. రైతులను బెదిరించి, పెన్సిల్‌తో సంతకం చేయమని బలవంతం చేసి, వారి భూమిని లాక్కున్నారని, అదే ప్లాంట్ నుండి ఉత్పత్తి చేయబడిన విద్యుత్తును బిహార్ ప్రజలకు యూనిట్‌కు 6.75 రూపాయల చొప్పున విక్రయిస్తారన్నారు. మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్‌లకు ఈ రేటు 3 నుండి 4 రూపాయలు అని అన్నారు.

## రైతులపై ఫడ్నవీస్ సర్కార్ ఉదాసీన వైఖరి

### ఎన్‌సిపి (ఎస్‌పి) అధ్యక్షుడు శరద్ పవార్ విమర్శ



**నాశిక్ :** రైతుల దుస్థితి పట్ల మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఎన్‌సిపి (ఎస్‌పి) అధ్యక్షుడు శరద్ పవార్ ఆరోపించారు. రాష్ట్రంలో తీవ్రంగా నెలకొన్ని వ్యవసాయ సంక్షోభం వైపు ప్రభుత్వం దృష్టి పెట్టేలా చేసేందుకు ప్రతిపక్షం తమ నిరసనను తీవ్రతరం చేస్తుందని హెచ్చరించారు. రైతుల కష్టాలను ఎత్తిచూపడానికి నాసిక్‌లో ఎన్‌సిపి (ఎస్‌పి) నిర్వహించిన 'ఆక్రోష్ మోర్చా'కు పవార్ నాయకత్వం వహించారు. అనేక మంది ఎన్‌సిపి (ఎస్‌పి) నాయకులు, కార్మికులతో కలిసి పవార్ ఓపెన్ జీపులో నిరసనలో పాల్గొన్నారు. ప్రభుత్వం వర్షాభావ పరిస్థితిని ప్రకటించాలని, రైతులకు పూర్తి రుణ మాఫీ చేయాలని ఆ పార్టీ డిమాండ్ చేసింది. ప్రభుత్వం ఒక నెలలో రుణ మాఫీ ప్రకటించకపోతే మంత్రులను రాష్ట్రంలో తిరగనివ్వమని ఎన్‌సిపి (ఎస్‌పి) వర్కింగ్ ప్రెసిడెంట్, లోక్‌సభ సభ్యురాలు సుప్రియా సులే హెచ్చరించారు. కాగా, నాశిక్‌లో జరిగిన ర్యాలీలో పవార్ మాట్లాడుతూ 'ఛత్రపతి శివాజీ మహారాజ్ ముందు చేతులు జోడించి దేవభావు (దేవేంద్ర ఫడ్నవీస్) చేస్తున్న పోస్టర్లను మీడియా అంతటా చూశాము. రైతులకు ఇబ్బందులు లేకుండా చూసుకున్న పురాణ యోధుడు రాజు మార్గాన్ని ఆయన అనుసరించాలన్నారు. సోమవారం తన పార్టీ నిర్వహించిన మోర్చా ప్రారంభం మాత్రమేనని మాజీ రాష్ట్ర ముఖ్యమంత్రి హెచ్చరించారు. 'దేవాభావూ... చుట్టూ చూడండి. ఏమి జరుగుతుందో చూడండి. నేపాల్‌లో ప్రజలు తమ ఆకాంక్షలను తీర్చడంలో విఫలమైన ప్రభుత్వాన్ని పడగొట్టారు' అని ఆయన గుర్తుచేశారు. మహారాష్ట్ర ప్రభుత్వం రైతుల దుస్థితి పట్ల ఉదాసీనంగా ఉందని మాజీ కేంద్ర మంత్రి ఆరోపించారు. రైతులకు తమ పంటలకు తగిన ధర లభించడం లేదని, ఎగుమతులపై నిషేధం ఉందని ఆయన వివరించకుండానే పేర్కొన్నారు. 'అప్పు అనేది రైతులు ఎదుర్కొంటున్న అతిపెద్ద ఇబ్బందని, ఈ సమస్యకు పరిష్కారం ఉండాలన్నారు. వ్యవసాయ సంక్షోభాన్ని ప్రభుత్వం చూస్తూనే ఉంటే, వేలల్లో ఉన్న (రైతు) ఆత్మహత్యలు లక్షల్లోకి వెళ్లవచ్చు అని, మనం మౌనంగా ప్రేక్షకులుగా ఉండలేమన్నారు. నిరసన సందర్భంగా ఎన్‌సిపి (ఎస్‌పి) నాయకులు ఉల్లిపాయలు, ద్రాక్ష, ఇతర పంటలకు తగిన కనీస మద్దతు ధర ఇవ్వాలని కూడా డిమాండ్ చేశారు. 'గత ఎనిమిది సంవత్సరాలలో మహారాష్ట్ర జాతీయ ఖజానాకు జిఎస్‌టి రూపంలో రూ. 2 లక్షల కోట్లు ఇచ్చింది. రుణమాఫీ కోసం ప్రభుత్వం రూ. 35,000 కోట్లు ఎందుకు ఇవ్వకూడదు?' అని ఎన్‌సిపి (ఎస్‌పి) ప్రధాన కార్యదర్శి రోహిత్ పవార్ ప్రశ్నించారు.

## బీఎండబ్ల్యూ హిట్ అండ్ రన్ కేసు

### ఆర్థికశాఖ డిప్యూటీ సెక్రటరీ మృతి కేసులో డ్రైవర్ అరెస్టు

**న్యూఢిల్లీ:** దేశ రాజధాని ఢిల్లీలో జరిగిన బీఎండబ్ల్యూ కారు హిట్ అండ్ రన్ కేసులో సోమవారం ఆ కారు డ్రైవర్ గగన్‌ప్రీత్‌ను అరెస్టు చేశారు. ఆర్థిక శాఖ డిప్యూటీ సెక్రటరీ నవజ్యోత్ సింగ్, ఆయన భార్య సందీప్ కౌర్ బైక్‌పై వెళ్తుండగా ఆ వాహనాన్ని బీఎండబ్ల్యూ కారు ఢీకొంది. ఆ సమయంలో కారును గగన్‌ప్రీత్ డ్రైవ్ చేస్తున్నారు. ఈ ప్రమాదంలో ఆర్థికశాఖ ఆఫీసర్ నవజ్యోత్ ప్రాణాలు కోల్పోయారు. ఆయన భార్య తీవ్రంగా గాయపడ్డారు. అయితే ఇదే ప్రమాదంలో గాయపడ్డ బీఎండబ్ల్యూ డ్రైవర్ గగన్‌ప్రీత్ హాస్పిటల్‌లో చికిత్స పొందింది. ఆమెను పోలీసులు అరెస్టు చేసి కస్టడీలోకి తీసుకున్నారు. హిట్ అండ్ రన్ ఘటనలో ఢిల్లీ పోలీసులు ఎఫ్‌ఐఆర్ నమోదు చేశారు. బీఎండబ్ల్యూ కారును ఓ మహిళ డ్రైవ్ చేసిందని, సెంట్రల్ వర్జ్‌ను ఢీకొన్న తర్వాత ఆ వాహనం కంట్రోల్ తప్పి, బైక్‌ను ఢీకొన్నదని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. బీఎండబ్ల్యూ డ్రైవర్ గగన్‌ప్రీత్ వయసు 38 ఏళ్లు. ఆమె భర్త పరీక్షిత్ మక్కడ్ వయసు 40 ఏళ్లు. ఢిల్లీ కంటోన్మెంట్ మెట్రో స్టేషన్ వద్ద ప్రమాదం జరిగింది. బైక్‌ను ఢీకొన్న తర్వాత బాధితులు నవజ్యోత్, సందీప్ కౌర్‌లను ఓ వ్యాన్‌లో ఆస్పత్రికి తీసుకెళ్లారు. జీటీబీ నగర్‌లో ఉన్న న్యూలైఫ్ ఆస్పత్రికి వాళ్లను తరలించారు. అయితే ఆ ఆస్పత్రి ఘటనా స్థలికి 19 కిలోమీటర్ల దూరంలో ఉంది. కాగా ఆ ఆస్పత్రికి, బీఎండబ్ల్యూ డ్రైవర్ గగన్‌ప్రీత్‌కు నేరుగా సంబంధాలు ఉన్నట్లు గుర్తించారు.

## రాజకీయ పార్టీలు 'పని ప్రదేశాలు' కావు లైంగిక వేధింపుల చట్టం వర్తించదు : సుప్రీంకోర్టు



**న్యూఢిల్లీ:** రాజకీయ రంగంలో పనిచేస్తున్న మహిళలకు లైంగిక వేధింపుల నిరోధక చట్టం (పోష్) కింద రక్షణ కల్పించాలంటూ దాఖలైన పిటిషన్‌ను విచారించేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. రాజకీయ పార్టీలకు, కార్యకర్తలకు మధ్య యజమానిఉద్యోగి సంబంధం ఉండదని, కాబట్టి రాజకీయ పార్టీలను 'పని ప్రదేశం'గా పరిగణించజాలమని పేర్కొంది. సోమవారం భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ బీఆర్. గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ పిటిషన్‌ను విచారించింది. రాజకీయ పార్టీలను 'పోష్' చట్టంలోని 'పని ప్రదేశం' నిర్వచనం కిందకు ఎలా తీసుకురాగలమని ధర్మాసనం ప్రశ్నించింది. పార్టీకి, దాని కార్యకర్తలకు మధ్య యజమానిఉద్యోగి బంధం లేనప్పుడు, ఈ చట్టం వర్తింపజేయడం సాధ్యం కాదని అభిప్రాయపడింది. అడ్వకేట్ యోగమాయ ఎం.జి. ఈ స్పెషల్ లీవ్ పిటిషన్ (ఎస్ఎల్‌పీ) దాఖలు చేశారు. 2022 మార్చిలో కేరళ హైకోర్టు ఇచ్చిన తీర్పును ఆమె ఈ పిటిషన్‌లో సవాలు చేశారు. యజమానిఉద్యోగి సంబంధం లేనందున, రాజకీయ పార్టీలు అంతర్గత ఫిర్యాదుల కమిటీలను (ఐసీసీ) ఏర్పాటు చేయాల్సిన అవసరం లేదని అప్పట్లో కేరళ హైకోర్టు తీర్పు ఇచ్చింది. కేరళ హైకోర్టు తీర్పు వల్ల రాజకీయ, సినీ, మీడియా వంటి అనధికారిక రంగాలలో పనిచేస్తున్న ఎంతో మంది మహిళలు పోష్ చట్టం రక్షణకు దూరమవుతున్నారని పిటిషనర్ వాదించారు. 'యజమాని', 'ఉద్యోగి', 'పని ప్రదేశం' వంటి పదాలకు చట్టంలో విస్తత అర్థం ఉందని, కానీ హైకోర్టు తీర్పు దాని స్ఫూర్తిని దెబ్బతీసేలా ఉందని పేర్కొన్నారు. ఇది రాజ్యాంగంలోని ఆర్టికల్స్ 14, 15, 19(1)(జి),21 కింద కల్పించిన ప్రాథమిక హక్కులను ఉల్లంఘించడమేనని పిటిషన్‌లో ఆరోపించారు. గత నెలలో కూడా ఇదే తరహా ప్రజాప్రయోజన వ్యాజ్యాన్ని (పిల్) సీజేఐ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనమే తిరస్కరించింది. అయితే, కేరళ హైకోర్టు తీర్పును ప్రత్యేకంగా ఎస్ఎల్‌పీ ద్వారా సవాలు చేయవచ్చని అప్పుడు సూచించింది. కాగా, గతేడాది డిసెంబర్‌లో ఇలాంటి మరో పిటిషన్‌పై విచారణ జరిపిన సుప్రీంకోర్టు, ఈ విషయంలో ఎన్నికల సంఘాన్ని ఆశ్రయించాలని పిటిషనర్‌కు సూచించడం గమనార్హం.


## ఆర్జేడీ, కాంగ్రెస్ వల్లే బిహార్‌కు నష్టం : ప్రధాని మోదీ



**పాట్నా:** ఆర్‌జేడీ, కాంగ్రెస్ అస్తవ్యస్త పాలన కారణంగా బిహార్ తీవ్రంగా నష్టపోయిందని ప్రధాని నరేంద్ర మోదీ విమర్శించారు. ప్రస్తుతం తాము చేపడుతున్న అభివద్ధిని చూసి ఆ రెండు పార్టీలు జీర్ణించుకోలేకపోతున్నాయని అన్నారు. బీహార్‌లోని పూర్ణియా జిల్లాలో పర్యటించిన ప్రధాని, జాతీయ మఖానా బోర్డుతో పాటు 36 వేల కోట్ల విలువైన అభివద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. పేదలకు మద్దతివ్వటమే తన విధానమని ప్రధాని మోదీ తెలిపారు. అందులో భాగంగానే నాలుగు కోట్ల ఇళ్లను పేదలకు నిర్మించి ఇచ్చామని చెప్పారు. మరో మూడు కోట్ల గహాలు నిర్మాణ దశలో ఉన్నాయని వెల్లడించారు.

## బొకారోలో నక్సలిజం అంతమైంది

### కేంద్ర మంత్రి అమిత్ షా



**న్యూఢిల్లీ:** జార్ఖండ్‌లోని బొకారోలో నక్సలిజం అంతమైనట్లు కేంద్ర మంత్రి అమిత్ షా తెలిపారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్' ద్వారా ట్వీట్ చేశారు.త్వరలో యావత్ దేశం నక్సల్స్ సమస్య నుంచి విముక్తి పొందుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. సోమవారం జార్ఖండ్‌లో జరిగిన ఎన్‌కౌంటర్ వివరాలను ఆయన వెల్లడించారు. జార్ఖండ్‌లోని హజారీబాగ్‌లో యాంటీ నక్సల్స్ ఆపరేషన్‌లో ఘన విజయం సాధించామన్నారు. సీఆర్పీఎఫ్‌కు చెందిన కోబ్రా బెటాలియన్ , రాష్ట్ర పోలీసులు ఈ సక్సెస్‌లో భాగస్వామ్యులైనట్లు తెలిపారు. తలపై కోటి రూపాయల నజరానా ఉన్న నక్సల్ కమాండర్ సీసీఎం సహదేవ్ సోరెన్ అలియాస్ పర్వేశ్‌ను హతమార్చినట్లు ఆయన చెప్పారు. ఇతనికి తోడు మరో ఇద్దరు నక్సల్స్‌ను హతమార్చామన్నారు. రఘునాథ్ హెంబ్రమ్ అలియాస్ ఛంచాల్, బిర్సేన్ గంజూ అలియాస్ రామ్‌కేల్వాన్ ప్రాణాలు కోల్పోయారు. ఈ ఆపరేషన్ ద్వారా బొకారో ప్రాంతంలో ఉన్న నక్సలిజం అంతమైనట్లు షా వెల్లడించారు. యావత్‌దేశం త్వరలో విముక్తి చెందుతుందుతుందన్నారు.

## హఠాత్తుగా ఆగిన మోనో రైలు.. ప్రయాణికులు భద్రం

**ముంబై:** ముంబైలో మోనోరైలు సేవల్లో మరోసారి అంతరాయం ఏర్పడింది. రైలు సోమవారం ఉదయం హఠాత్తుగా ఆగిపోవడంతో అందులోని ప్రయాణికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. మోనో రైలు వడాలా వైపు వెళ్తోంది. అయితే, సాంకేతిక సమస్య కారణంగా రైలు హఠాత్తుగా ఆగిపోయింది. దీంతో అందులోని ప్రయాణికులు ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న అధికారులు వెంటనే అక్కడికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. అందులోని వారందరినీ సురక్షితంగా కాపాడినట్లు ముంబై మెట్రో పాలిటన్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ వెల్లడించింది.

## సాధారణ రిజర్వేషన్ టికెట్లకూ ఆధార్?

### రైల్వే రిజర్వేషన్ విధానంలో కీలక మార్పు



**న్యూఢిల్లీ:** రిజర్వేషన్ విధానానికి సంబంధించి రైల్వే బోర్డు మరో కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై సాధారణ రిజర్వేషన్ టికెట్లకూ ఆధార్ అథెంటికేషన్‌ను తప్పనిసరి చేసింది. మొదటి 15 నిమిషాలు కేవలం అధార్ వెరిఫైడ్ యూజర్లు మాత్రమే ఐఆర్‌సీటీసీ లేదా అధికారిక యాప్‌లో టికెట్లు రిజర్వేషన్ చేసుకునేందుకు వీలుంటుంది. ప్రస్తుతం ఇది తత్కాల్ బుకింగ్ విధానంలో అమల్లో ఉంది. అక్టోబర్ 1 నుంచి సాధారణ రిజర్వేషన్లకు కూడా వర్తింపజేస్తున్నట్లు తెలిపింది. ఏదైనా రైలుకు ప్రస్తుతం 60 రోజుల ముందే టికెట్ రిజర్వేషన్ చేసుకునేందుకు సౌలభ్యం ఉంది. కానీ, తత్కాల్ టికెట్ల మాదిరిగానే బుకింగ్ ప్రారంభమైన వెంటనే అక్రమార్కులు సాఫ్ట్‌వేర్ సాయంతో టికెట్లను బుక్ చేసేస్తున్నారు. దీంతో సాధారణ ప్రయాణికులు నష్టపోతున్నారు. ఈ నేపథ్యంలో రిజర్వేషన్ టికెట్లు పక్కదోవ పట్టకుండా సామాన్య యూజర్‌కు ఆ ప్రయోజనాలు అందాలన్న ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు రైల్వే బోర్డు పేర్కొంది. ఈ మేరకు అన్ని జోనల్ కార్యాలయాలకు సమాచారం ఇచ్చింది.

## మహారాష్ట్ర గవర్నర్‌గా ఆచార్య దేవవ్రత్ ప్రమాణం



**ముంబై:** మహారాష్ట్ర గవర్నర్ గా గుజరాత్ గవర్నర్ ఆచార్య దేవవ్రత్ ప్రమాణ స్వీకారం చేశారు. సోమవారం ఉదయం ముంబైలోని రాజ్‌భవన్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో బాంబే హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రశేఖర్ ఆయన చేత ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమానికి మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ కూడా హాజరయ్యారు. ఇటీవలే జరిగిన ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో సీపీ రాధాకష్ణన్ గెలుపొందిన విషయం తెలిసిందే. దీంతో ఆయన మహారాష్ట్ర గవర్నర్ పదవి నుంచి వైదొలిగారు. ఈనెల 12న భారత 15వ ఉప రాష్ట్రపతిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఆయన రాజీనామాతో ఈ ఖాళీ ఏర్పడింది. ఈ నేపథ్యంలో గుజరాత్ గవర్నర్ ఆచార్య దేవవ్రత్‌కు మహారాష్ట్ర గవర్నర్‌గా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ నేపథ్యంలో ఆయన ప్రమాణ స్వీకారం చేశారు.

## అమలుకాని హామీలకు పెట్టింది పేరు మోదీ

### ప్రధాని హామీలపై తేజ్‌ప్రతాప్ వ్యాఖ్య



**పాట్నా :** ప్రధాని నరేంద్రమోదీ రాజకీయ కారణాలతోనే బీహార్‌కు వస్తారని ఆర్జేడీ బహిష్కత నేత, ఆ పార్టీ చీఫ్ లాలూ ప్రసాద్ యాదవ్ తనయుడు తేజ్‌ప్రతాప్ యాదవ్ విమర్శించారు. ఇప్పుడు బీహార్‌లో అసెంబ్లీ ఎన్నికలు దగ్గరపడ్డాయని, అందుకే ఇక్కడి ప్రజలపై ప్రధాని వరాల వర్షం కురిపిస్తున్నారని తేజ్ ప్రతాప్ విమర్శించారు.గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో కూడా ప్రధాని ఇదేరకంగా బీహార్‌కు వచ్చారని, షుగర్ మిల్లును ఏర్పాటు చేయిస్తానని హామీ ఇచ్చారని తేజ్‌ప్రతాప్ గుర్తుచేశారు. కానీ ఇప్పటికీ ఇక్కడ షుగర్ మిల్లు ప్రారంభం కాలేదని ఎద్దేవా చేశారు. ఎప్పుడూ అబద్ధపు హామీలు ఇచ్చే ప్రధాని పర్యటన బీహార్ ప్రజలపై ఎలాంటి ప్రభావం చూపబోదని అన్నారు. ఈ పర్యటనలో ప్రధాని మోదీ విమానాశ్రయాలు, వంతెనలను ప్రారంభిస్తున్నారని, కానీ ఇక్కడ ఇప్పుడు ప్రధాన సమస్య వరద పరిస్థితి అని తేజ్‌ప్రతాప్ చెప్పారు. వరదల్లో జవానియా గ్రామం పూర్తిగా కొట్టుకుపోయిందని, అయినా ప్రభుత్వం ఎలాంటి సహాయక చర్యలు చేపట్టలేదని విమర్శించారు. జవానియా ప్రజలు ఏడుస్తున్నారని, ప్రధాని అక్కడికి వెళ్లాలని కోరారు. రఘోపూర్‌లో కూడా పరిస్థితి అలాగే ఉన్నా ప్రభుత్వం పట్టించుకోవడంలేదని ఆరోపించారు.

# కేంద్రానికి 'వక్ఫ్' ఎదురుదెబ్బలు

ముస్లింల వక్ఫ్ ఆస్తుల విషయంలో కేంద్రప్రభుత్వం జోక్యం చేసుకుంటూ తెచ్చిన వక్ఫ్(సవరణ) చట్టం, 2025పై సుప్రీంకోర్టు సోమవారం ఇచ్చిన మధ్యంతర తీర్పు ఆ చట్టాన్ని మొత్తంగా స్టే చేయక పోవటం ప్రభుత్వానికి సంతోషకారకమే కావచ్చు, కాని కొన్ని ముఖ్యమైన నిబంధనలను నిలుపుదలలో ఉంచటం మోడీ ప్రభుత్వ ఉద్దేశానికి బ్రేకు వేసింది. తుది తీర్పులో మరిన్ని సానుకూలతలు సాధిస్తామని పిటిషన్ దారులు ఆశాభావం వ్యక్తం చేశారు. ముస్లిం మైనారిటీలను ఉద్ధరించటానికి, వక్ఫ్ ఆస్తుల నిర్వాహకుల దోపిడీని అరికట్టి చట్టబద్ధమైన వక్ఫ్‌లకు భద్రత చేకూర్చటం ప్రభుత్వం ఉద్దేశంగా, ట్రిపుల్ తలాఖ్ రద్దు చట్టం తదుపరి తీసుకువచ్చిన గొప్ప సంస్కరణగా హోంమంత్రి అమిత్ షా సవరణ బిల్లును గట్టిగా సమర్థించారు. కాని ప్రభుత్వ నిజ ఉద్దేశం ముస్లిం మత వ్యవహారాల్లో రాజ్యాంగ విరుద్ధంగా జోక్యం చేసుకోవటంగా ఆనాడే జాయింట్ పార్లమెంటులో, పార్లమెంటరీ కమిటీలో, ప్రతిపక్ష సభ్యులు వాదించారు. అయితే ప్రభుత్వం ఏ మాత్రం పునరాలోచన చేయలేదు – మొండిగా ముందుకెళ్లింది.

ప్రధాన న్యాయమూర్తి బిఆర్ గవాయ్, జస్టిస్ ఎ.జి.మాషిలతో కూడిన బెంచి మే 22 న తాత్కాలిక తీర్పును రిజర్వు చేసింది. చట్టాన్ని మొత్తంగా స్టే చేయాలని పిటిషనర్లు వాదించనందున "స్టే కోసం" విజ్ఞప్తిని తిరస్కరించింది. సుప్రీంకోర్టు బెంచి 5 అంశాలపై నిర్దిష్టమైన ఆదేశాలు జారీ చేసింది. మరికొన్ని ప్రధాన వివాదాంశాల్లో జోక్యం చేసుకోలేదు. అవి – 'వక్ఫ్–బై–యూసర్ 'రద్దు', షెడ్యూల్డు ప్రదేశాలు, సంరక్షిత పురాతన కట్టడాలపై వక్ఫ్‌లు సృష్టించటంపై నిషేధం, ముస్లింలు మాత్రమే వక్ఫ్‌లు ఏర్పాటు చేయగలరన్న షరతు, వక్ఫ్ చట్టానికి లిమిటేషన్ చట్టం వర్తింపు వగైరా. అయితే తుది విచారణ సందర్భంలో ఈ అన్ని విషయాలపైన, ప్రస్తుత మధ్యంతర తీర్పులోని అభ్యంతరకర అంశాలపైన వాదనలు వినిపించే అవకాశం ఉంటుంది. కాంగ్రెస్, కమ్యూనిస్టులు, తదితరులు, ఎఐఎంపిఎల్బి, ఎఐఎస్‌పిఎల్‌బి తదితర ముస్లిం మత వ్యవహారాల సంస్థలు ఈ తాత్కాలిక తీర్పును స్వాగతించాయి.

ప్రజాపక్షం
16-09-2025, మంగళవారం

ఈ తీర్పు ఏమి చెప్పింది? సెంట్రల్ వక్ఫ్ బోర్డులో, రాష్ట్ర వక్ఫ్ బోర్డుల్లో ముస్లిమేతరులను నియమించే అత్యంత ప్రధానమైన వివాదానికి తాత్కాలిక పరిష్కారం చెప్పింది. 20మంది సభ్యులతో కూడిన సెంట్రల్ వక్ఫ్ బోర్డులో ముస్లింయేతరులు నలుగురికి మించకూడదు. 11మంది సభ్యులతో కూడిన రాష్ట్ర బోర్డుల్లో వారు ముగ్గురికి మించరాదు. వక్ఫ్‌ను ప్రకటించే ఏ వ్యక్తి అయినా తాను ఐదేళ్లుగా ఇస్లాంను ఆచరిస్తున్నట్లు నిరూపించాలన్న క్లాజును స్టే చేసింది. అట్టి నిర్ణయం చేసే ఏర్పాటుకు రూల్సు రూపొందించేవరకు ఇది అమలులో ఉంటుంది. వక్ఫ్ ఆస్తుల స్థితిపై తీర్పు చెప్పే అధికారం కలెక్టర్‌కు ఇచ్చిన క్లాజును నిలుపు చేసింది. రికార్డుల్లో మార్పులు చేయటం చెల్లదని చెప్పింది. ట్రిబ్యునల్ లేదా హైకోర్టు తుది తీర్పు ఇచ్చేవరకు రికార్డులు మార్చే అధికారం ఉండదని చెప్పింది. వక్ఫ్ బోర్డు ఛీఫ్ ఎగ్జిక్యూటివ్ అధికారిగా 'సాధ్యమైన మేరకు' ముస్లిం సమాజానికి చెందిన దాని ఎక్స్ అఫిసియో కార్యదర్శిని నియమించాలని సూచించింది.

వక్ఫ్ చట్టం ప్రకారం వక్ఫ్ అనేది ధర్మాదాయ, మత ప్రయోజనాలకోసం అనగా మసీదులు, స్కూళ్లు, ఆసుపత్రులు లేదా ఇతర పబ్లిక్ ఆస్తుల నిమిత్తం ముస్లిం ఇచ్చే దానం అని చట్టం పేర్కొన్నది. మరో విశేషమేమంటే, విక్రయం, బహుమతి, వారసత్వం, భాగస్వామ్యం పేరుతో వక్ఫ్ ఆస్తిని ఎవరికీ బదలాయించటానికి వీల్లేదు. ముతావల్లీలు (వక్ఫ్ సంరక్షకులు) ముప్పదేళ్లపాటు వక్ఫ్‌ను రిజిస్ట్రేషన్ చేయించకపోతే, అట్టి దరఖాస్తుతోపాటు వక్ఫ్ డీడ్ జతపరచాలన్న ప్రస్తుత నిబంధనను వారు ప్రశ్నించలేరని కోర్టు చెప్పింది.

# లేని చరిత్ర కోసం పాకులాట!

## చారిత్రక పోరాటానికి మతం రంగు అద్దే ప్రయత్నం

ఉన్నది ఉన్నట్లుగా చెప్పడం, జరిగింది జరిగినట్లుగా ఒప్పుకోవడం ఒక సలక్షణం. కానీ లేనిది ఉన్నట్లుగా ఉన్నది లేనట్లుగా చిత్రీకరించడం లేదా ఆ ప్రయత్నానికి పూనుకోవడం ఖచ్చితంగా వంచనే. తమకు సంబంధం లేని పోరాటంలో తమ వాటా కోసం ప్రయత్నించడం లేదా మొత్తం పోరాటాన్ని పక్కదారి పట్టించే ప్రయత్నంలో బిజెపి ఉంది. భారతీయ జనతా పార్టీకి కట్టు, బొట్టు, గుడి, బడి ఇలా ఏదైనా ఆచార వ్యవహారాల మాటున మతాన్ని చొప్పించడం జరుగుతుంది. ప్రపంచ చరిత్రలో సువర్ణాక్షర లిఖిత మైన సాయుధ తెలంగాణ పోరాటాన్ని సైతం మతపరమైన పోరాటంగా చిత్రీకరించి లబ్ధి పొందేందుకు ప్రయత్నం చేస్తున్నది. అసలు తెలంగాణ పోరాటం ఎందుకు మొదలైంది, ఆ పిలుపునిచ్చింది ఎవరు, ఆ పిలుపులో భాగస్వాములైంది ఎవరు, చివరికి ఏమైంది ఇవేవి బిజెపి నేతలకు పట్టవు. నైజాం రాజు ముస్లిం కాబట్టి ఆయనకు వ్యతిరేకంగా జరిగిన పోరాటాన్ని హిందువుల, ముస్లిం వ్యతిరేక పోరాటంగా చిత్రీకరిస్తున్నది.

వాస్తవానికి 1947 సెప్టెంబర్ 11న తెలంగాణలో సాయుధ పోరాటానికి పిలుపునిచ్చిన సమయంలో ఉన్న పరిస్థితులు ఏమిటి? ఒక పక్క భారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చింది. ప్రజలు స్వేచ్ఛావాయులు పీల్చారు. కానీ తెలంగాణలో అది జరగలేదు. అప్పటికీ ముస్లిం నైజాం నవాబు ఆధీనంలోని హైదరాబాద్ సంస్థానం దేశంలో విలీనం కాలేదు. బ్రిటిష్ వారి క్రింద సామంతుడిగా ఉన్న మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ స్వయం ప్రతిపత్తి కలిగిన రాజ్యాధినేత. ప్రత్యేక కరెన్సీతో పాటు ప్రపంచంలోనే ధనవంతుడైన రాజుగా ఆయనకు పేరుంది. ప్రజల్లో తీవ్రమైన వేదన ఉండేది. గ్రామాల్లో వెట్టిచాకిరితో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. మాట్లాడే హక్కు లేదు. ప్రజల మాన ప్రాణాలకు రక్షణ లేదు. ఎక్కడ చూసిన దొరలు, జాగీర్‌దార్లు, జమీందార్ల దౌర్జన్యాలు ఉండేవి. పండిన పంటను ఇంటికి తెచ్చుకునే పరిస్థితి లేదు. ఆఖరుకు వండిన అన్నం కూడా తినగలమన్న నమ్మకం ప్రజల్లో లేకుండాపోయింది. అటువంటి సమయంలో 1947 సెప్టెంబర్ 11న రావి నారాయణరెడ్డి (ఆంధ్రమహాసభ), బద్దం ఎల్లారెడ్డి (సిపిఐ), మగ్దూం మొహియుద్దీన్ (ఎఐటియుసి) సాయుధ పోరాటానికి పిలుపు నిచ్చారు. సాయుధ పోరాటానికి ప్రజలు సానుకూలంగా స్పందించారు. పటేళ్లు, పట్వారీల ఆగడాలకు వ్యతిరేకంగా గ్రామాల్లో తిరుగుబాటు మొదలైంది. ఆ తిరుగుబాటు తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా దావానలంలా సాగింది. ఊరు ఊరుకు పోరాటం పాకింది. గ్రామాలు విముక్తి చేయబడ్డాయి. 10 లక్షల ఎకరాల భూములను పేదలకు పంచడం జరిగింది. ఈ పోరాటంలో నాలుగున్నర వేలమంది అమరులయ్యారు. ఈ పరిస్థితుల్లో కమ్యూనిస్టుల చేతిలో ఓటమి కన్న కేంద్ర ప్రభుత్వంతో రాజీపడి బతకాలన్న ఆలోచన నైజాం రాజు మీర్ ఉస్మాన్ అలీ ఖాన్‌కు వచ్చింది. రహస్య ఒప్పందంతో ఒక అంగీకారానికి వచ్చిన తర్వాత యూనియన్ సైన్యాలు తెలంగాణలోకి వచ్చాయి. యూనియన్ సైన్యాలను నైజాం సైన్యాలు ఎక్కడ ప్రతిఘటించ లేదన్నది చారిత్రిక సత్యం.

కమ్యూనిస్టుల పోరాట ఫలితంగానే తెలంగాణ భారతదేశంలో విలీనమైంది. సామాన్యులు సాయుధులై పోరాటం చేశారు. కారం, రోకలి, ఒడిషల, కర్ర, గొడ్డలి ఇలా ఏదో ఒక ఆయుధంతో ప్రజలు పోరాటం చేశారు. ఇది చరిత్ర. ఈ పోరాట పూర్వాపరాలను అప్పటి వాస్తవిక పరిస్థితులను అర్థం చేసుకోకుండా సాయుధ పోరాటంలో ఏ పాత్ర లేని బిజెపి దీనిని మతపరమైన పోరాటంగా ఇప్పుడు ప్రజల ముందు ఉంచుతుంది. 83వేల చదరపు కిలో మీటర్ల మేర వ్యాపించిన నైజాం రాజ్యంలో 50 శాతం భూభాగం తెలంగాణకు చెందింది. 28 శాతం మహారాష్ట్రకు, 22 శాతం కర్నాటకలో ఉంది. అప్పట్లో నిజాం రాజ్యంలో 1.64 కోట్ల మంది జనాభా ఉంటే 80 లక్షల మంది తెలుగు మాట్లాడే వారు ఉన్నారు. అధికార భాషగా ఉర్దూ ఉండడంతో తెలుగు మాట్లాడే వారు సైతం తిరుగుబాటుకు సిద్ధమయ్యారు. అందుకే కమ్యూనిస్టుల సాయుధ పోరాటానికి మరింత ఊపు వచ్చింది.

జమీందార్లు, జాగీర్‌దార్లు అంతా హిందువులే. రాజు ముస్లిం కావచ్చు కానీ గ్రామాల్లో అరాచకం చేసే పటేళ్లు, పట్వారీలు కూడా హిందువులే ఎక్కువగా ఉండేవారు. ఇదే సమయంలో సాయుధ పోరాటానికి పిలుపు నిచ్చిన మగ్దూం మొహియుద్దీన్‌తో పాటు సాయుధ పోరాటంలో అమరుడైన బందగి, తన కవితలతో, వార్తలతో ప్రజలను చైతన్యపరిచిన సోయాబుల్లాఖాన్ కూడా ముస్లిమే. దీనిని బట్టి మహత్తర తెలంగాణ పోరాటం హిందు, ముస్లిం పోరాటం కాదు. భూమి భుక్తి, వెట్టి చాకిరి విముక్తి కోసం జరిగిన పోరాటం. సాయుధ పోరాటం తెలంగాణ ప్రజల జీవన సంస్కృతిలో ఒక గొప్పమార్పును తీసుకు వచ్చింది. బాంచన్ దొర అంటూ బతికేవాళ్లు బందూకులు పట్టారు. సాయుధ పోరాటం భూమి విలువను ఎజెండాలోకి తీసుకు వచ్చింది. రాచరిక వ్యవస్థలకు చరమగీతం పాడడంతో పాటు గ్రామాల్లో ప్రజలు స్వేచ్ఛావాయువులు పీలుస్తూ తమ పని తాము చేసుకునే ఒక మహత్తర అవకాశాన్ని కల్పించింది. పర పీడనకు తిలోదకాలు పలికేందుకు కారణమైంది. భారతదేశ సమగ్రతను పరిపూర్ణం చేసింది. అనేక ఉద్యమాలకు ప్రేరణగా నిలిచింది. ఇంతటి మహోద్యమాన్ని ఒక మత పోరాటంగా చూపి బిజెపి లబ్ధి పొందేందుకు ప్రయత్నిస్తుంది. సాయుధ పోరాట వారోత్సవాల వేళ ఈ అంశాన్ని ప్రజల ముందుకు తీసుకు పోవాల్సిన అవసరం వామపక్ష, అభ్యుదయ శక్తులపై ఉన్నది. తెలంగాణ ప్రజల ధిక్కార స్వరం సాయుధ పోరాటం.

పోరాటంలో అమరులైన వారికి నివాళులర్పిస్తూనే ఈ మత ప్రచారాన్ని తిప్పికొడుతూ నేటి యువతకు చారిత్రిక వాస్తవాన్ని తెలియచెప్పాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

**జంకెందుకు :**

అధికారంలోకి రాక ముందు ఒక తీరుగా, అధికారంలోకి వచ్చిన తర్వాత మరో తీరుగా వ్యవహరించడం పాలకులకు అలవాటుగా మారింది. తెలంగాణ నినాదాన్ని ఎత్తుకుని ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత అధికారంలోకి వచ్చిన బిఆర్‌ఎస్ తెలంగాణ విలీనాన్ని అధికారికంగా నిర్వహించాలన్న ఆలోచనను పక్కదారి పట్టించింది. మేము వస్తే విలీనాన్ని అధికారికంగా నిర్వహిస్తామని చెప్పిన ఫలితం శూన్యం.

ఆ తర్వాత కాంగ్రెస్ కూడా ప్రత్యేక తెలంగాణ ఏర్పాటు జరిగిన తర్వాత మేము విలీనాన్ని అధికారికంగా నిర్వహిస్తామని చెప్పిన అది అమలు కాలేదు. పాలకులు ఎందుకు జంకు ప్రదర్శిస్తున్నారో అర్థం కాని పరిస్థితి. ఇప్పటికైనా సెప్టెంబర్ 17ను అధికారికంగా నిర్వహించటం చరిత్రకు నీరాజనం అవుతుంది.

**ఏనుగు వెంకటేశ్వరరావు,**
ప్రజాపక్షం, ఖమ్మం

# పౌర సమాజం విస్మరిస్తున్న నిశ్శబ్ద సంక్షోభం

మానసిక ఆరోగ్యం ప్రజా ఆరోగ్యంలో అంతర్భాగం; ఇది మానసిక అనారోగ్యం లేకపోవడం కంటే ఎక్కువ. వ్యక్తి శ్రేయస్సు ప్రభావవంతమైన పనితీరుకు పునాది. ఇందులో మానసిక శ్రేయస్సు, మానసిక రుగ్మతలు నివారణ, చికిత్స మరియు పునరావాసం మానసిక ఆరోగ్యంలో భాగమే.

భారతదేశంలో మానసిక ఆరోగ్య సమస్యల భారం 10,000 జనాభాకు 2443 వైకల్యంసర్దుబాటు జీవిత సంవత్సరాలు అని ప్రపంచ ఆరోగ్య సంస్థ అంచనా వేసింది; 100000 జనాభాకు వయస్సు సర్దుబాటు ఆత్మహత్య రేటు 21.1.2012 – 2030 మధ్య మానసిక ఆరోగ్య పరిస్థితుల వల్ల కలిగే ఆర్థిక నష్టం 1.03 ట్రిలియన్ డాలర్లు అని అంచనా వేయబడింది. మానసిక ఆరోగ్య విధానం, 2014 నాణ్యమైన సేవా నిబంధనల కోసం భాగస్వామ్య హక్కుల ఆధారిత విధానాన్ని సమర్థిస్తుంది. మానసిక ఆరోగ్య సంరక్షణ చట్టం, 2017 మానసిక అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తుల హక్కులను రక్షించడానికి, ప్రోత్సహించడానికి అలాగే నెరవేర్చడానికి సేవలను అందించడానికి చట్టపరమైన చట్రాన్ని అందిస్తుంది. ఇది ఐక్యరాజ్యసమితి వికలాంగుల హక్కుల సమావేశానికి అనుగుణంగా ఉంటాయి. జాతీయ మానసిక ఆరోగ్య కార్యక్రమం ఉద్దేశం మానసిక ఆరోగ్య, వెల్ నెస్ కేంద్రం, ప్రాథమిక ఆరోగ్య సంరక్షణ స్థాయిలో నాణ్యమైన సంరక్షణ అందించడం. డి అడిక్షన్ కేంద్రాలు, పునరావాస సేవ లు కూడా అందుబాటులో ఉన్నాయి. మానసిక ఆరోగ్యాన్ని నిర్ణయించే వాటిలో ఆలోచనలు, భావోద్వేగాలు, ప్రవర్తన మరియు ఇతరులతో పరస్పర చర్యలు నిర్వహించే సామర్థ్యం వంటి వ్యక్తిగత లక్షణాలు ఉంటాయి. అదనంగా, సామాజిక, సాంస్కృతిక, ఆర్థిక, రాజకీయ మరియు పర్యావరణ కారకాలు నిర్దిష్ట మానసిక, వ్యక్తిత్వం, జన్యుపరమైన కారకాల వలె పాత్ర పోషిస్తాయి. మానసిక ఆరోగ్యానికి మద్దతుగా అవగాహన పెంచడం, ప్రయత్నాలను సమీకరించడం పరిస్థితిని పరిష్కరించడానికి అవసరం. మానసిక ఆరోగ్య ప్రచారంలో ఆరోగ్యకరమైన జీవితాన్ని ప్రోత్సహించి, ప్రజలు ఆరోగ్యకరమైన జీవనశైలిని అవలంబించే వాతావరణాన్ని సృష్టించడం ఉంటుంది. జాతీయ మానసిక ఆరోగ్య విధానాలు చట్టపరమైన చట్రాల ద్వారా వాతావరణాన్ని కల్పించడం మానసిక ఆరోగ్య రుగ్మతల ప్రభావవంతమైన నిర్వహణకు, మానసిక ఆరోగ్య ప్రమోషన్‌ను నిర్ధారించడానికి విస్తృత దిశలను అందించడానికి అత్యవసరం. దీనికి బహుళ రంగాల తోడ్పాటుతో పాటు జాతీయ విధానం అవసరం. మానసిక ఆరో గ్య రుగ్మతల చికిత్సకు అత్యంత ప్రాముఖ్యత ఉంది. ఇది మొత్తం ప్రభుత్వ విధానం ద్వారా ప్రమోషన్, నివారణ, చికిత్స, కోలుకోవడానికి సమగ్ర వ్యూహాలను కోరుతుంది. ప్రాథమిక ఆరోగ్య సంరక్షణ స్థాయిలో సాధారణ మానసిక రుగ్మతలకు ఖర్చుతో కూడుకున్న చికిత్స లభ్యత, ప్రాప్యతను ప్రోత్సహించడానికి విధాన రూపకర్తలను ప్రోత్సహించాలి. మానసిక ఆరోగ్యం అనేది చాలాకాలంగా పౌర సమాజం విస్మరిస్తున్న నిశ్శబ్ద సంక్షోభం. వర్క్‌ప్లేస్ సర్వేలో మెంటల్ హెల్త్ అండ్ వెల్‌నెస్ కోషెంట్ అనేది ఉండాలి. ప్రపంచవ్యాప్తంగా మానసిక అనారోగ్యాలు సర్వసాధారణం. మానసిక అనారోగ్యాలలో తేలికపాటి నుండి మితమైన, తీవ్రమైన వరకు తీవ్రతలో తేడా ఉన్న అనేక విభిన్న పరిస్థితులు ఉన్నాయి. ఈ పరిస్థితులను వివరించడానికి రెండు విస్తృత వర్గాలను ఉపయోగించవచ్చు:ఏదైనా మానసిక అనారోగ్యం, తీవ్రమైన మానసిక అనారోగ్యం.

2023 నేషనల్ మెంటల్ హెల్త్ సర్వేలో కార్పొరేట్ భారతదేశంలో 42% నిరాశ లేదా ఆందోళన రుగ్మతలతో బాధపడుతున్నారని గణాంకాలు తెలుపుతున్నాయి. డిప్రెషన్‌తో బాధపడుతున్న ముగ్గురిలో ఇద్దరు ఇప్పటికీ పనిలో లేదా కొత్త ఉద్యోగాల కోసం దరఖాస్తు చేస్తున్నప్పుడు ఇబ్బంది లు ఎదుర్కొంటున్నారు. పదిమందిలో ఒకరికి మాత్రమే ఎంప్లాయీ అసిస్టెన్స్ ప్రోగ్రామ్ యాక్సెస్ ఉంది. భారతదేశంలో కేవలం వెయ్యికి పైగా నమోదిత కార్పొరేట్ సంస్థలు నిర్మాణాత్మక ఎంప్లాయీస్ అసిస్టెన్స్ ప్రోగ్రాంను కలిగి ఉన్నాయి. శ్రామిక శక్తి లో దాదాపు సగం మంది మానసిక ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నారని సర్వే ఫలితాలు తెలుపుతున్నాయి, పురుషుల కంటే స్త్రీలు ఎక్కువ ప్రమాదం లో ఉన్నారు. ఉద్యోగుల మానసిక ఆరోగ్యాన్ని శాస్త్రీ య పద్ధతిలో అర్థం చేసుకోవాలి, కార్యాలయంలో మానసిక ఆరోగ్యానికి కారణమయ్యే అంశాలు గుర్తించాలి, ఉద్యోగుల కోసం పరివర్తన విధానాలు కేంద్రీకృత మానసికఆరోగ్య కార్యక్రమాలను ప్రోత్సహిస్తుంది. మంచి ఆరోగ్యం శ్రేయస్సు కోసం ఐక్యరాజ్యసమితి సుస్థిర అభివృద్ధి లక్ష్యం 3ని చేరుకోవడానికి సీఎస్ఆర్ నిధులు, వనరుల దృక్పథాన్ని పునర్నిర్వచించడంలో సహాయపడుతుంది. మరీ ముఖ్యంగా, మానసికఆరోగ్య పర్యావరణ వ్యవస్థను బలోపేతం చేయడానికి వినూత్న పబ్లిక్, ప్రైవేట్ కమ్యూనిటీఆధారిత భాగస్వామ్యం సృష్టికి ఇది మార్గదర్శకంగా పనిచేస్తుంది.

నిమ్ హన్స్ 2022–23 సర్వే ప్రకారం, దాదాపు 18% భారతీయ పెద్దలు ఏదో ఒక రకమైన మానసిక అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఇది దేశంలోనే 210 మిలియన్ల కంటే ఎక్కు వ మంది బాధపడుతున్నారు, కొద్దిమందికి మాత్రమే అవసరమైన వైద్య సదుపాయాలు అందుబాటులో ఉన్నాయి. ముఖ్యం గా గ్రామీణ ప్రాంతాల్లో మానసిక వైద్యుల కొరత తీవ్రంగా ఉంది. భారతదేశంలోని 80%పైగా ప్రభు త్వ ఆసుపత్రులకు మానసిక వైద్యు లు లేరు. చాలామంది భారతీయ మానసిక వైద్యులు మెరుగైన అవకాశాల కోసం విదేశాలకు వెళ్లేందుకు ఇష్టపడుతున్నారు 150 కోట్ల జనాభా ఉన్న దేశంలో కేవలం 9,000 కంటే తక్కువ మంది మానసిక వైద్యులు ఉన్నారు. మానసిక అనారోగ్యం భారతదేశంలో ఎక్కువగా నిషిద్ధ అంశంగా కొనసాగుతోంది. ఈ సంవత్సరం చివరి నాటికి భారతదేశంలో సుమా రు 20 శాతం మంది మానసిక అనారోగ్యంతో బాధపడుతున్నారని అంచనా వేస్తున్నారు. ప్రపంచ ఆరోగ్య లెక్కలు చూస్తే 56 మిలియన్ల భారతీయులు నిరాశతో బాధపడుతున్నారు, 38 మిలియన్ల మంది భారతీయులు ఆందోళన రుగ్మతలతో బాధపడుతున్నారు. ప్రపంచంలోని అన్ని దేశాలలో ఆరోగ్యం, సామాజిక, మానవ హక్కులు, ఆర్థిక పరిణామాలపై గణనీయమైన ప్రభావాలతో మానసిక రుగ్మతల భారం పెరుగుతూనే ఉంది. నిరాశ, నిస్పృహ, బాధ, ఆనందం కోల్పోవడం, ఆత్మ విశ్వాసం కోల్పోవడం, నిద్ర లేమి, ఆకలి, అలసట, ఏకాగ్రత లేక పోవడం వంటివి ఈ మానసిక రుగ్మతలు కారణాలు. వీటి ప్రభావంతో మనుషులు ఆత్మహత్య చేసుకుంటారు.

మానసిక రుగ్మతలు: నిరాశ (డిప్రెషన్), బైపోలార్ డిజార్డర్, మనోవైకల్యం( స్కిజోఫ్రెనియా), సైకోసెస్, చిత్తవైకల్యం, ఆటిజం. నిరాశ, నిస్పృహ, మానసిక రుగ్మతలకు ఆరోగ్య పరంగా, సామాజికంగా బయట పడటానికి ప్రజలకు అవకాశం ఉన్నది. మానసిక ఆరోగ్య కార్యాచరణ ప్రణాళిక 2020 2023 ప్రజలందరికీ ఆరోగ్యాన్ని సాధించడంలో పూర్తిగా విఫలమైంది మానసిక ఆరోగ్యానికి మరింత సమర్థవంతమైన నాయకత్వం పాలన,సమాజఆధారిత అమరికలలో సమగ్ర, అందరికి మానసిక ఆరోగ్యం, సామాజిక సంరక్షణ సేవలను అందించడం, అమలు , నివారణ కోసం వ్యూహాలు అమలు,సమాచార వ్యవస్థ, పరిశోధనలను బలోపేతం చేయలేక విఫలమయ్యింది.

# ఓజోన్ పొర రక్షణతోనే ఆరోగ్యకర భవిష్యత్ తరాలు

జీవకోటి ఆరోగ్యకర మనుగడకు అనువైన వాతావరణం భూగ్రహంపైన మాత్రమే ఉన్నది. సూర్యరశ్మి లేకుండా జీవి మనుగడ సాగించలేదు. భూమాత గృహంలో సకల ప్రాణికోటి మనుగడకు సంబంధించిన ఉష్ణోగ్రతలు, వాతావరణం, పరిశుద్ధ గాలి, స్వచ్ఛమైన నీరు, పవిత్రమైన మట్టి అందుబాటులో ఉన్నాయి. ప్రాణులకు హాని కలిగించే అంశాలకు ప్రకృతి మాత్రమే అడ్డుకట్ట వేస్తున్నది. సూర్యుడి నుంచి భూమిపైకి చేరుతున్న సూర్యరశ్మిలో అతి ప్రమాదకర అతినీలలోహిత లేదా అల్ట్రావాయిలెట్ (యూవీ) కిరణాలు కూడా ఉంటాయి. ఈ కిరణాలు నేలపైకి చేరితే జీవకోటి ఉనికికి అతి ప్రమాదకరంగా మారుతుంది.

పలు రోగాలకు ఊపిరి పోస్తుంది. ఇలాంటి అత్యంత ప్రమాదరమైన, హానికారక యూవీ కిరణాలను నేలపైకి రాకుండా 10 –30 కిమీ దూరంలోని స్ట్రాటోస్ఫియర్‌లో ఓజోన్ అనబడే పొర అడ్డుకొని, శోషణం చేసుకొని, సాధారణ సూర్యరశ్మి నేలపైకి చేరడానికి దోహదపడుతుంది. ఇలాంటి ప్రకృతి సిద్ధంగా ఏర్పడిన ఓజోన్ పొర భూగోళంపై ఉన్న జీవులకు ఒక రక్షణ గొడుగుగా పని చేస్తున్నది.

**ప్రపంచ ఓజోన్ దినం–2025:** ప్రకృతిలో ఏదో ఒక పొర యూవీ కిరణాలను నేలపైకి రాకుండా అడ్డుకుంటున్నట్లు 1913లోనే శాస్త్రజ్ఞులు గమనించారు. ఇలాంటి ఓజోన్ పొర ఉండడం వల్లనే యూవీ కిరణాలు లేని సూర్యరశ్మి సకల ప్రాణికోటికి అందుతున్నట్లు గమనించారు. ఈ పొరను పరిరక్షించుకోవాలనే సదుద్దేశంతో 16 సెప్టెంబర్ 1987 రోజున అంతర్జాతీయ ఐరాస సంఘం మాన్‌ట్రియేల్ ప్రోటోకాల్ పేరుతో పలు నిర్ణయాలు చేయడం జరిగింది. ఇలాంటి ఓజోన్ పొర రక్షణకు చేపట్టిన తొలి సమావేశానికి గుర్తుగా 1995 నుంచి ప్రతి ఏట 16 సెప్టెంబర్ రోజున ఐరాస సభ్య దేశాలు ప్రపంచ ఓజోన్ దినం (వరల్ ఓజోన్ డే) లేదా అంతర్జాతీయ ఓజోన్ పొర పరిరక్షణ దినం పాటించడం కొనసాగుతున్నది. ప్రపంచ ఓజోన్ దినం2025 ఇతివృత్తంగా జీవుల కోసం ఓజోన్ (ఓజోన్ ఫర్ లైఫ్) అనబడే అంశాన్ని తీసుకొని ప్రచారం నిర్వహించడం జరుగుతోంది.

**ఓజోన్ పొర ప్రాధాన్యం:** మానవాళి అనాలోచిత, ఆధునిక జీవనశైలికి అనుగుణంగా విచ్చలవిడిగా వాడుతున్న క్లోరోఫ్లోరో కార్బన్స్ (సిఎఫ్‌సి) అనబడే ప్రమాదకర రసాయనాలను రిఫ్రిజిరేషన్, ఏయిర్ కండీషనింగ్, ఏరోసోల్ స్ప్రే లాంటి అవసరాలకు అధిక మొత్తంలో వాడుతున్నాం. ఇలాంటి ప్రమాదకర రసాయనాలు వాతావరణంలోకి లీక్ అయినపుడు, అవి ఓజోన్ పొరతో చర్యలో పాల్గొని, ఆ రక్షణ పొరను క్రమంగా నాశనం చేయడంతో, పొర పలుచబడడం లేదా పొరకు చిల్లులు పడడం జరుగుతోంది. రసాయనపరంగా త్రిపరమాణుక ఆక్సీజన్ అణువు ($O_3$)ని ఓడోన్ అని పిలుస్తాం. ఈ అణువు యూవీ కిరణాలను శోషణం చేసుకొని, సాధారణ సూర్యరశ్మిని భూమిపైకి చేర్చుతుంది. ఓజోన్ పొర పలుచడినపుడు లేదా పొరకు రంధ్రాలు ఏర్పడినపుడు సూర్యరశ్మితో పాటు యూవీ కిరణాలు నేలపైకి చేరి మానవాళికి, జంతువులకు, వృక్ష సంపదకు హానిని కలిగిస్తాయి.

అధిక యువి కిరణాల బారినపడిన మానవాళికి క్యాన్సర్, కాటరాక్ట్, పలు అనారోగ్యాలు కలుగుతాయి. ప్రపంచ పర్యావరణ వ్యవస్థ లు, జీవవైవిధ్యాలకు విఘాతంగా నిలుస్తున్న ఓజోన్ పొర తరుగుదలను అడ్డుకోవడానికి స్థానిక స్థాయి నుంచి అంతర్జాత స్థాయి వరకు నిర్దిష్ట చర్యలు తీసుకోవడం నిరంతరం జరగాలి.

అంటార్కిటికాలో ఓజోన్ పొరకు రంధ్రం పడినట్లు శాస్త్రసమాజం గమనించిన 'షేర్‌వుడ్ రౌలాండ్'కు నోబెల్ పురస్కారం కూడా లభించింది. శీతలీకరణ, రిఫ్రిజిరేషన్, ఎయిడ్ కండిషనింగ్ పరిశ్రమలు అత్యధికంగా ప్రమాదకరమైన సిఎఫ్‌సిలను వాడుతున్నాయి. వీటికి బదులుగా ప్రత్యామ్నాయ రసాయనాలను ఆయా పరిశ్రమల్లో వాడాల్సిన అగత్యం ఏర్పడింది. రేపటి తరానికి ఆస్తులు కాదు ఆరోగ్యంగా జీవించడానికి అనువైన వాతావరణాలను బహుకరించడానికి కృషి చేద్దాం. నేటి యువతలో ఓజోన్ పరిరక్షణ అవగాహన పెంచుదాం.




## 16వ కాంగ్రెస్, (న్యూఢిల్లీ, 1995)

గత పార్టీ కాంగ్రెస్ (ఏప్రిల్ 1992) నాటికి ఆర్‌ఎస్‌ఎస్, విశ్వహిందూ పరిషత్, బిజెపి సారథ్యంలో రామజన్మభూమి–బాబ్రీమసీదు వివాదం తీవ్రస్థాయిలో ఉంది. బిజెపి తన ఎదుగుదలకు దాన్ని స్ప్రింగ్‌బోర్డుగా ఉపయోగించుకుంది. బిజెపి 1989 జూన్ 9–11 తేదీల్లో పాలమూర్‌లో జరిగిన జాతీయ కార్యవర్గ సమావేశంలో రామజన్మభూమి సమస్యపై తీర్మానంతో ఆ సమస్యను తొట్టతొలిసారి తన ఎజండాలోకి తీసుకుంది. బిజెపి అధ్యక్షుడు ఎల్‌కె అద్వానీ 1990 సెప్టెంబర్ 25న గుజరాత్‌లోని సోమనాథ్ నుంచి రామజన్మభూమి ప్రచార తొలి రథయాత్ర మొదలుపెట్టి అక్టోబర్ 30న అయోధ్యలో ముగించారు. 1992, డిసెంబర్ 6న హిందూ ఉన్మాద కార్‌సేవకులు బాబ్రీమసీదు కూల్చివేశారు. దేశంలో మత పరిస్థితి ఉద్రిక్తంగా ఉంది. అంతకుముందు, 1991 ఎన్నికల ప్రచారంలో శ్రీలంక ఎల్‌టిటిఇ తీవ్రవాదులు రాజీవ్‌గాంధీని శ్రీ పెరంబదూర్‌లో (తమిళనాడు) హత్య చేశారు. రాజీవ్‌గాంధి హత్యకు ముందు – తర్వాత రెండు విడతలుగా జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పి.వి.నరసింహారావు నాయకత్వంలో మైనారిటీ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. నరసింహారావు–మన్మోహన్‌సింగ్ ద్వయం నయా ఉదారవిధానాలను ప్రవేశపెట్టి గుత్తపెట్టుబడికి అనుకూలంగా శ్రామికశక్తులపై దాడిచేయటం మొదలుపెట్టారు.

అటువంటి అస్థిర రాజకీయ పరిస్థితుల్లో సిపిఐ 16వ మహాసభ 1995 అక్టోబర్ 7 నుంచి 11వరకు న్యూఢిల్లీలో జరిగింది. 720మంది ప్రతినిధులు, 44మంది ప్రత్యామ్నాయ ప్రతినిధులు పాల్గొన్నారు. దేశంలోని రాజకీయ, మత పరిస్థితులు, వామపక్ష, కమ్యూనిస్టు ఐక్యత సమస్యలు, పూర్వపు సోవియట్ యూనియన్, తూర్పు యూరప్‌లలో పరిణామాలు ప్రధానంగా చర్చకు వచ్చాయి. రానున్న (1996) సార్వత్రిక ఎన్నికల్లో పోరాటం ప్రధానంగా మూడు కూటముల మధ్య ఉంటుందని పార్టీ కాంగ్రెస్ అంచనా వేసింది. 1) కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు, 2) బిజెపి నాయకత్వంలోని కూటమి, 3) నేషనల్ ఫ్రంట్, లెఫ్ట్‌ఫ్రంట్ అలయెన్స్. ఎన్.ఎఫ్, ఎల్.ఎఫ్ అలయెన్స్ కాంగ్రెస్‌కు, బిజెపి–శివసేన కూటమికి వ్యతిరేకంగా పోరాడుతుందని పేర్కొన్నది.

ఇంద్రజిత్ గుప్తా పార్టీ ప్రధాన కార్యదర్శిగా, ఎ.బి.బర్దన్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకోబడ్డారు. అయితే 1996లో దేవగౌడ ప్రధానిగా ఏర్పడిన యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వంలో ఇంద్రజిత్‌గుప్తా హోంమంత్రిగా బాధ్యతలు స్వీకరించి పార్టీ పదవికి రాజీనామా చేయటంతో ఎ.బి.బర్దన్ ప్రధాన కార్యదర్శి బాధ్యతల్లోకి వచ్చారు. డిప్యూటీ ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకోబడిన నల్లమల గిరిప్రసాద్ 1997మే 24న అకాలమరణం చెందారు.

## 17వ కాంగ్రెస్ (చెన్నై, 1998)

సిపిఐ 17వ కాంగ్రెస్ 1998, సెప్టెంబర్ 14–19 తేదీల్లో చెన్నైలో జరిగింది. 975మంది ప్రతినిధులు హాజరైనారు. అది దేశంలో రాజకీయ అస్థిరత కొనసాగుతున్న కాలం; నాలుగేళ్లలో మూడుసార్లు లోక్‌సభ ఎన్నికలు జరిగిన కాలం. కాంగ్రెస్ పాలన అంతమై కాంగ్రెసేతర ప్రభుత్వాలు ఏర్పడిన కాలం. 1996 సార్వత్రిక ఎన్నికల్లో లోక్‌సభలో ఏ పార్టీకి కనీస మెజారిటీ రాలేదు. పెద్దపార్టీగా ఆవిర్భవించిన బిజెపి (161 సీట్లు) నాయకుడు ఎ.బి.వాజ్‌పేయి ప్రధానమంత్రిగా ప్రమాణస్వీకారం చేశారు. బలపరిచేవారు లేక (1996 మే 16 – జూన్1) 13వ రోజున పార్లమెంటు ముందుకు రాకుండానే ఆయన రాజీనామా చేశారు. అయోధ్యలో రామాలయం, ఆర్టికల్ 370 రద్దు, ఉమ్మడి పౌరస్మృతి అనే మూడంశాల హిందూత్వ ఎజండా ఉన్న ఆ ప్రభుత్వాన్ని బలపరిచేందుకు ఏ పార్టీ ముందుకు రాలేదు. లౌకికపార్టీలు ఐక్యసంఘటనగా ఏర్పడి కాంగ్రెస్ తోడ్పాటుతో జనతాదళ్ (ఎస్) నేత హెచ్.డి.దేవగౌడ ప్రధానిగా 1996 జూన్1న ప్రభుత్వం ఏర్పాటు చేశాయి. పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి జ్యోతిబసుకు ప్రధానమంత్రి పదవి ఆఫర్ చేయగా, సిపిఐ(ఎం) నిరాకరించింది. దీన్ని 'చారిత్రక తప్పిదం'గా ఆ తర్వాత జ్యోతిబసు వ్యాఖ్యానించారు. సిపిఐ తర్జనభర్జనల తర్వాత గౌడ మంత్రివర్గంలో చేరింది. చతురానన్ మిశ్రా (వ్యవసాయం), ఇంద్రజిత్ గుప్తా (హోం) ఒకింత ఆలస్యంగా 1996 జూన్ 29న మంత్రులైనారు. 1997 ఏప్రిల్ 21న గౌడ రాజీనామా చేయగా ఐ.కె.గుజ్రాల్ ప్రధాని అయినారు. ఆ ప్రభుత్వానికి కాంగ్రెస్ తోడ్పాటు ఉపసంహరణతో 1998లో మళ్లీ ఎన్నికలు వచ్చాయి. బిజెపి పెద్ద పార్టీగా అవతరించింది. తన ఎజండాలోని వివాదాస్పదమైన హిందూత్వ ఎజండా అంశాలను –అయోధ్యలో రామాలయం, ఆర్టికల్ 370 రద్దు, ఉమ్మడి పౌరస్మృతి – వెనక్కు పెట్టటంతో ప్రాంతీయ పార్టీలు బలపరిచాయి. 1998 మార్చి 19న వాజ్‌పేయి ఎన్‌డిఎ ప్రభుత్వం ప్రమాణ స్వీకారం చేసింది. అయితే ఎఐఎడిఎంకె నాయకురాలు జె.జయలలిత తోడ్పాటు ఉపసంహరణతో ఆ ప్రభుత్వం మైనారిటీలో పడింది. రాష్ట్రపతి కె.ఆర్.నారాయణన్ ఎన్నికలకు ఉత్తర్వు చేశారు. తరచూ ఎన్నికలు, ప్రభుత్వాల మార్పుతో ప్రజల్లో వచ్చిన ఏహ్యత, కార్గిల్ యుద్ధంలో భారతసైన్యం విజయం కలిసొచ్చి 1999 ఎన్నికల్లో బిజెపికి సీట్లు పెరిగాయి. వాజ్‌పేయి మూడోసారి ప్రధానిగా ప్రమాణ స్వీకారం చేశారు.

రాజకీయ అస్థిరత, కాంగ్రెస్ పట్ల వ్యతిరేకనుంచి బిజెపి లాభపడింది. ఏకాకితనం నుండి బయటపడి ప్రాంతీయ పార్టీలకు చేరువైంది.

ఈ నేపథ్యంలో జరిగిన సిపిఐ చెన్నై కాంగ్రెస్ కేంద్రంలో లౌకిక ప్రజాతంత్ర ప్రత్యామ్నాయం తీసుకురావటం, రాజకీయాల్లో మితవాద మలుపును అరికట్టి వామపక్షం వైపు మలుపు తీసుకురావటం, పార్టీ లక్ష్యంగా ప్రకటించింది. కొత్త ప్రత్యామ్నాయంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్యమైన పాత్ర వహించాల్సి ఉంటుందని చెప్పింది.

కొత్తగా ఎన్నుకోబడిన జాతీయ సమితి ఎ.బి.బర్ధన్‌ను ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకుంది.1996లో ఇంద్రజిత్‌గుప్తా రాజీనామా తదుపరి ఆయన తొలుత ఆ పదవీ బాధ్యతలు చేబట్టారు.

## 18వ కాంగ్రెస్(తిరువనంతపురం, 2002)

సిపిఐ 18వ కాంగ్రెస్ 2002 మార్చి 26–31 తేదీల్లో తిరువనంతపురంలో జరిగింది. 604 మంది ప్రతినిధులు, 56 మంది ప్రత్యామ్నాయ ప్రతినిధులు పాల్గొన్నారు. దేశంలో టెర్రరిస్టు దాడులు, ముఖ్యంగా 2001 డిసెంబర్ 13న భారత పార్లమెంటుపై టెర్రరిస్టు దాడి జరిగింది. ఐదుగురు జైష్–ఎ–మొహమ్మద్ టెర్రరిస్టులు జరిపిన కాల్పుల్లో ఆరుగురు ఢిల్లీ పోలీసులు, ఇద్దరు పార్లమెంటు సెక్యూరిటీ దళం సిబ్బంది, ఒక తోటమాలి మరణించారు. ఐదుగురు టెర్రరిస్టుల్నీ భద్రతాదళాలు కాల్చి చంపాయి. ఈ ఘటన పార్లమెంటరీ ప్రజాస్వామ్యంపై దాడిగా ఖండనకు గురైంది. ఈ ఘటన భారత్–పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు పెంచింది. దాని పర్యవసానమే 2001–2002లో భారత్, పాకిస్థాన్ సైనిక మోహరింపు. 1971 ఇండో–పాక్ యుద్ధం తర్వాత భారత్ కశ్మీర్, పంజాబ్ సరిహద్దుల్లో పెద్ద ఎత్తున సైన్యాన్ని మోహరించటం ఇదే ప్రథమం. 2002 నవంబర్‌లో అరెస్టు చేసిన నలుగురు జెమ్ సభ్యులకు శిక్షలు పడ్డాయి. వారిలో అఫ్జల్ గురు ఒకడు. గుజరాత్‌లో విస్తృతంగా మతకలహాలు జరిగాయి.

సిపిఐ, సిపిఐ(ఎం) మధ్య ఏర్పడిన సమన్వయ కమిటీ రద్దయింది. ఈ నేపథ్యంలో జరిగిన సిపిఐ కాంగ్రెస్, సిపిఐని బలోపేతం చేయటం తక్షణావసరమని నొక్కిచెప్పింది. అందువల్ల రానున్న రోజుల్లో పార్టీలో "దిద్దుబాటు, పునర్నిర్మాణం" కార్యక్రమం చేపట్టాలని పిలుపుఇచ్చింది.

ప్రధాన కార్యదర్శిగా ఎ.బి.బర్దన్ తిరిగి ఎన్నికైనారు.

## 19వ కాంగ్రెస్ (చండీఘడ్, 2005)

ప్రధాని వాజ్‌పేయి, ఉపప్రధాని, హోంమంత్రి ఎల్.కె.అద్వానీ సారథ్యంలో ఎన్‌డిఎ పాలనలో 'దేశం వెలిగిపోతోంది' అన్న అంచనాతో ప్రభుత్వం షెడ్యూలుకన్నా కొంత ముందుగా 2004లో సార్వత్రిక ఎన్నికలకు వెళ్లింది. ఆ మితవాద, మతవాద ప్రభుత్వ విధానాల వల్ల దేశం చీకటి వైపు వెళుతోందని భావించిన దేశప్రజలు ఎన్‌డిఎను ఓడించారు. కాంగ్రెస్ పెద్ద పార్టీగా ఆవిర్భవించింది. దేశ చరిత్రలో తొలిసారి వామపక్షాలు 64 సీట్లతో లోక్‌సభలో పెద్ద గ్రూపుగా ఆవిర్భవించాయి. కాంగ్రెస్, వామపక్షాలు, మరికొన్ని ఇతర పక్షాలతో యునైటెడ్ ప్రోగ్రెసివ్ అలవెన్స్ (యుపిఎ) ఏర్పడింది. పరిపాలనకు ఉమ్మడి కనీస కార్యక్రమం రూపొందించబడింది. సోనియాగాంధీ ప్రధానమంత్రి అభ్యర్థిగా నిర్ణయమైనారు. అయితే మితవాదశక్తుల నుంచి తన కుటుంబానికి ముప్పు ఉందంటూ ఆమె తన స్థానే డాక్టర్ మన్మోహన్‌సింగ్‌ను ప్రధాని అభ్యర్థిగా నిర్ణయించారు. మొదటి యుపిఎ ప్రభుత్వం ఆర్థికవేత్త మన్మోహన్‌సింగ్ ప్రధానమంత్రిగా 2004 మే 22న ప్రమాణ స్వీకారం చేసింది. కమ్యూనిస్టు పార్టీలు ప్రభుత్వంలో చేరలేదు–వెలుపల నుండి తోడ్పాటు ఇచ్చాయి. సోనియాగాంధీ చైర్‌పర్సన్‌గా ఏర్పడిన యుపిఎ జాతీయ సలహామండలిలో కమ్యూనిస్టులు సభ్యులుగా ఉన్నారు. వారి ఒత్తిడి వల్లనే సమాచార హక్కు చట్టం, గ్రామీణ ఉపాధి హామీ చట్టం వగైరా ప్రభావవంతమైన చట్టాలు వచ్చాయి.

ఈ నేపథ్యంలో 2005 (మార్చి 29–ఏప్రిల్ 3)లో చండీఘడ్‌లో జరిగిన సిపిఐ 19వ కాంగ్రెస్ "కమ్యూనిస్టు ఐక్యత కోసం సిపిఐ అర్థించదు. బలమైన, స్వతంత్ర సిపిఐని నిర్మిస్తుంది'' అని స్పష్టం చేసింది.పార్టీ ప్రధాన కార్యదర్శిగా ఎ.బి.బర్దన్ తిరిగి ఎన్నుకోబడ్డారు. 2007లో డిప్యూటీ ప్రధాన కార్యదర్శిగా జాతీయసమితి ఎన్నుకున్న సురవరం సుధాకర రెడ్డి ఈ కాంగ్రెస్‌లో తిరిగి ఆ పదవికి ఎన్నికైనారు.

## 'గ్రీవెన్స్ డే' ద్వారానే సత్వర న్యాయం: ఎస్‌పి

**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** ప్రజలకు పోలీస్ సేవలు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా ప్రతి సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో గ్రీవెన్స్ డే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేష్ బి గీతే అన్నారు. సోమవారం ఫిర్యాదుదారుల నుండి 36 ఫిర్యాదులను జిల్లా పోలీసు కార్యాలయంలో స్వీకరించి మాట్లాడారు. ప్రజల వద్ద నుండి ఫిర్యాదులు స్వీకరించి సమస్యలు పరిష్కారమే లక్ష్యంగా బాధితులకు సత్వర న్యాయం చేయడానికి గ్రీవెన్స్ డే కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని అన్నారు. పోలీసు అధికారులు, సిబ్బంది పోలీస్ స్టేషన్ కి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాద పూర్వకంగా ప్రవర్తించి, వినతులు, ఫిర్యాదులు స్వీకరించి, అవసరమైతే క్షేత్ర స్థాయిలో పరిశీలించి చట్ట ప్రకారం బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలన్నారు.

## బాధిత కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/కోహెడ:** కోహెడ మండలం శనిగరం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కర్ర శ్రీహరి మరణించడంతో వారి కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే, సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్ రెడ్డి పరామర్శించి, ప్రగాఢసానుభూతి తెలిపారు.కర్ర శ్రీహరి చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో కరీంనగర్ సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్, సిద్దిపేట జిల్లా రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కసుకుంట శంకర్, జిల్లా కార్యవర్గ సభ్యులు పోలిరెడ్డి వెంకటరెడ్డి, కోహెడ మండల కార్యదర్శి వేల్పుల శ్రీనివాస్, మండల నాయకులు బోయిని శంకర్, చాడ శ్రీధర్‌రెడ్డి, నేలపట్ల రవి, ప్రతాపరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## యూరియా కోసం రైతుల ధర్నా



**ప్రజాపక్షం/జగదేవ్‌పూర్:** రైతులకు సరిపడా యూరియా పంపిణీ చేయాలని కోరుతూ మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన రైతులు జగదేవ్‌పూర్‌లో రోడ్డుపై బైఠాయించి ధర్నా నిర్వహించారు. సోమవారం జగదేవ్‌పూర్ రైతు వేదిక వద్ద 500 బస్తాల యూరియా పంపిణీ కోసం కూపన్లు జారి చేస్తామని మండల వ్యవసాయాధికారి ప్రచార మాధ్యమాల ద్వారా ప్రచారం చేశారు. దింతో మండల రైతులు ఉదయం నుండే యూరియా కోసం రైతు వేదిక వద్దకు చేరుకొని క్యూ లైన్లో ఉన్నారు. అయితే 11 గంటలు దాటిన వ్యవసాయాధికారులు మాత్రం రైతు వేదిక వద్దకు రాకపోవడంతో ఆగ్రహానికి గురైన రైతులు భారీ సంఖ్యలో భువనగిరి గజ్వేల్ రహదారిపై బైఠాయించి గంట పాటు ధర్నా నిర్వహించారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ధర్నా కొనసాగించారు. దింతో రహదారిపై వాహనాలు భారీ సంఖ్యలో నిలిచి పోవడంతో రవాణ సౌకర్యాలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు ధర్నా స్థలానికి చేరుకొని రైతులతో మాట్లాడి ధర్నాను విరమింపజేశారు.

### కరీంనగర్, కొత్తపల్లిలో



**ప్రజాపక్షం/కొత్తపల్లి :** యూరియా కోసం రైతులు రాజీవ్ రహదారిపై ధర్నా చేశారు. కరీంనగర్ రూరల్ మండలంలోరని గోపాల్‌పూర్ బస్టాండ్ వద్ద బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే గంగుల కమలాకర్ హాజరై ఖాళీ యూరియా సంచులతో నిరసన వ్యక్తం చేస్తూ మాట్లాడారు. బిఆర్ఎస్ అధికారంలో ఉండగా రైతులకు కావాల్సిన యూరియా సకాలంలో అందజేశామని గుర్తు చేశారు. ప్రస్తు యూరియా కొరత కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యమే కారణమన్నారు. బిఆర్ఎస్ పార్టీకి ప్రజల ప్రయోజనాలో ముఖ్యమన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి యూరియా పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. రోడ్డుపై దర్నా చేసి ఎమ్మెల్యే, బిఆర్ఎస్ కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. మాజీ ఎంపిటిసి మల్లారెడ్డి, మాజీ వైస్ చైర్మన్ తిరుపతి నాయక్, వేల్పుల నారాయణ, బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు పెండ్యాల శ్యాంసుందర్, దుర్శేడ్ పాక్స్ చైర్మన్ తోట తిరుపతి, మాజీ ఉప సర్పంచ్ సుంకిశాల సంపత్‌రావు, రైతులు పాల్గొన్నారు.

# రైతులు ఆందోళన చెందొద్దు

## ఇంకా యూరియా సరఫరా అవుతోంది

### కలెక్టర్ సందీప్ కుమార్ ఝా





**ప్రజాపక్షం/వేములవాడ:** జిల్లాలో ఆయా పంటల సాగుకు సరిపడా యూరియా నిల్వలు ఉన్నాయని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా వెల్లడించారు. బోయినపల్లి మండలం కొదురుపాక లోని రైతు వేదికలో సోమవారం రైతులకు యూరియా పంపిణీ చేస్తుండగా, కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా టోకెన్ పద్ధతి, ఎరువుల పంపిణీ పరిశీలించారు. అనంతరం కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడారు. జిల్లాలో ఆయా పంటల సాగుకు అనుగుణంగా ఎప్పటికప్పుడు యూరియా స్టాక్ తెప్పిస్తున్నామని స్పష్టం చేశారు. యూరియా విషయమై రైతులు ఆందోళన చెందవద్దని సూచించారు.వ్యవసాయ శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలని తమ మండలాలకు వచ్చే ఎరువులను రైతుల పంటల సాగు విస్తీర్ణానికి అనుగుణంగా ఎరువుల సరఫరా చేయాలని ఆదేశించారు. రైతుల తమకు అవసరమైన ఎరువులు మాత్రమే తీసుకెళ్లాలని సూచించారు. వ్యవసాయ శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎరువులు పక్కదారి పట్టకుండా.ఇతర అవసరాలకు వాడకుండా చూడాలని ఆదేశించారు.

**అర్జీలు సకాలంలో పరిష్కరించాలి**

**రాజన్న సిరిసిల్ల :** ప్రజావాణికి వచ్చే అర్జీలు సకాలంలో పరిష్కరించాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో ప్రజల నుంచి కలెక్టర్ దరఖాస్తులు స్వీకరించారు. మొత్తం 185 దరఖాస్తులు వచ్చాయి. రెవెన్యూ 61, డీఆర్డీఏ కు 44, హౌసింగ్ శాఖకు 25, ఉపాధి కల్పన కార్యాలయం, ఎస్సీడీ కార్యాలయానికి 8 చొప్పున, విద్యా శాఖ, జిల్లా పంచాయతీ కార్యాలయానికి 6 చొప్పున, జిల్లా పౌర సరఫరాల అధికారికి 5, ఎస్పీ, జిల్లా లైబ్రరీ సెక్రటరీ, జిల్లా వైద్యాధి కారికి మూడు చొప్పున, మున్సిపల్ కమిషనర్ వేములవాడ, ఈడీ ఎంకు రెండు చొప్పున, జిల్లా సంక్షేమ అధికారి, మున్సిపల్ కమిషనర్ సిరిసిల్ల, ఏడీ ఎస్ ఎల్ ఆర్, డీఐఈఓ, సీపీఓ, సెస్, జిల్లా నీటి పారుదల శాఖ అధికారి, ఈఈ ఆర్ అండ్ బీ, ఎస్ఆర్ఆర్ టెంపుల్ ఈఓ వేములవాడకు ఒకటి చొప్పున వచ్చాయి.ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవోలు వెంకటేశ్వర్లు, రాధాభాయ్, జెడ్పీ సీఈవో వినోద్ కుమార్, డీఆర్డీఓ శేషాద్రి, జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## బకాయిలపై నిర్లక్ష్యం ఎందుకు?

### ఏఐఎస్ఎఫ్ జిల్లా సమితి ఆధ్వర్యంలో భిక్షాటన




**ప్రజాపక్షం/కరీంనగర్‌సిటీ:** తెలంగాణ రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను విడుదల చేయకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం కారణంగా ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు , కళాశాలలలు బంద్ చేయడం మూలంగా విధ్యార్థుల చదువులకు తరచూ ఆటంకాలు కలుగుతున్నా ప్రభుత్వంలో చలనం లేకపోకవడం సిగ్గు చేటని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మచ్చ రమేష్ అన్నారు. స్కాలర్‌షిఫ్ , ఫీజు రీయంబర్స్‌మెంట్ విడుదల చేయాలని కోరుతూ సోమవారం ఏఐఎస్ఎఫ్ జిల్లా సమితి ఆద్వర్యంలో అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించి అనంతరం బిక్షాటన చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఫీజు రీయంబర్స్‌మెంట్ పథకాన్ని ఎత్తివేసే కుట్ర చేస్తూ బకాయిలు విడుదల చేయడం లేదన్నారు. సీఎం వద్ద విద్యాశాఖ ఉన్నా ఫీజు బకాయిలు విడుదల చేయకపోవడం నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. విద్యార్థులు, కళాశాలలు ఇబ్బందులు పడుతున్నా పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేయడం తగదన్నారు. 15 నుంచి ఫీజు బకాయిలు విడుదల చేసే వరకు కళాశాలలు నిరవదిక బంద్ చేస్తామని ప్రకటించడం జరిగిందన్నారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రామారపు వెంకటేష్, రాము, నగర నాయకులు కసిరెడ్డి సందీప్ రెడ్డి, రాహుల్, యశ్వంత్, రాకేష్, రాజేష్, ఆకాష్ న్నారు.

## ఫీజు బకాయిలు వెంటనే విడుదల చేయాలి

### ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ప్రీతం



**ప్రజాపక్షం/పెద్దపల్లి :** పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) ఆధ్వర్యంలో పెద్దపల్లిలో సోమవారం భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. స్థానిక మార్కండేయ కాలనీ నుంచి ప్రధాన చౌరస్తా వరకు విద్యార్థులు ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ఫీజు బకాయిలను విడుదల చేయడంలో నిర్లక్ష్యం వహించడం వల్ల విద్యార్థుల చదువులకు ఆటంకాలు కలుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పథకాన్ని ఎత్తివేసే కుట్ర చేస్తోందని, అందుకే బకాయిలను విడుదల చేయడం లేదని ఆరోపించారు. విద్యాశాఖ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వద్ద ఉన్నప్పటికీ, ఫీజు బకాయిలు విడుదల కాకపోవడం ఆయన నిర్లక్ష్యానికి నిదర్శనమని ప్రీతం విమర్శించారు. గత మూడు విద్యా సంవత్సరాల నుంచి సుమారు రూ. 8 వేల కోట్ల ఫీజు బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని, దీనివల్ల విద్యార్థులతో పాటు కళాశాల యాజమాన్యాలు, సిబ్బంది కూడా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. గతంలో ఫీజు బకాయిలు విడుదల చేస్తామని హామీ ఇవ్వడంతో డిగ్రీ కళాశాలలు పరీక్షలు నిర్వహించాయని, కానీ ఇప్పటికీ బకాయిలు విడుదల కాకపోవడంతో డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులు డబ్బులు కట్టి సర్టిఫికెట్లు తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని అన్నారు. ప్రస్తుతం ఇంజినీరింగ్ కళాశాలలు కూడా బకాయిలు విడుదల చేయనంత వరకు సెప్టెంబర్ 15 నుంచి నిరవధిక బంద్ ప్రకటించాయని, ఇది విద్యార్థుల భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపుతుందని ఆయన హెచ్చరించారు. ప్రభుత్వం తక్షణమే కళాశాలల యాజమాన్యాలతో చర్చించి బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఏఐఎస్ఎఫ్ విద్యార్థులను ఏకం చేసి మిలిటెంట్ ఉద్యమాలు నిర్వహిస్తుందని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సాయి ఆజాద్, మాతంగి సాగర్, మహంకాళి లిటిల్, జశ్వంత్, అభిషేక్, సజన్ తదితరులు పాల్గొన్నారు.

## సుందరీకరణ పనుల్లో అవినీతిపై విచారణ : సిపిఐ డిమాండ్



**ప్రజాపక్షం/కరీంనగర్‌సిటీ:** కరీంనగర్ నగరంలో స్మార్ట్ సిటీ పనుల్లో భాగంగా పలు చౌరస్తాలో జరిగిన జంక్షన్‌ల పనుల్లో పూర్తిగా అవినీతి జరిగిందని, అవినీతికి పాల్పడ్డ కాంట్రాక్టర్లను, ఇంజనీరింగ్ అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సిపిఐ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్ రెడ్డి, సహాయ కార్యదర్శి పైడిపల్లి రాజులు ప్రజావాణిలో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతిని కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కరీంనగర్‌లో గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో లక్షల రూపాయలు వెచ్చించి టెండర్లు పిలిచి పనులు ప్రారంభించిందని, అయితే పనుల సమయంలో పేర్కొన్న ధర కంటే ఎస్టిమేషన్ మించి ఖర్చు అయ్యిందని కాంట్రాక్టర్లు, ఇంజనీరింగ్ అధికారులు కుమ్మక్కై మున్సిపల్ నుంచి అధిక మొత్తంలో ప్రజాధనాన్ని దోచుకున్నారని ఆరోపించారు. నగరంలోని గీతాభవన్ చౌరస్తాకు 45 లక్షల టెండర్‌తో పని ప్రారంభమైతే పూర్తయిన సమయానికి 95 లక్షలుగా చేసి కాంట్రాక్టర్ బిల్లు దోచుకున్నాడని, దీనిపై మున్సిపల్ అధికారులు నోరు మెదపకుండా బిల్లు చెల్లించడం చూస్తుంటే అవినీతి స్పష్టమవుతోందన్నారు. పద్మనగర్ జంక్షన్‌లో 20 లక్షల టెండర్‌కు కాంట్రాక్టర్ 30 లక్షలు ఎక్కువ చేసి దోచుకున్నారని ఆరోపించారు. బొమ్మకల్ చౌరస్తాలో జంక్షన్ పనులు పూర్తిగా నిబంధనలకు విరుద్ధంగా జరిగాయని, గ్రామంలో మున్సిపల్‌లో కలవక ముందే దానికి టెండర్ పిలిచి పనులు చేయించారని, దీని పనులు చేయొద్దని కేసు ఉండగా పనులు చేశారని పేర్కొన్నారు. వన్ పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న చొక్కారావు జంక్షన్‌కు 2022 సంవత్సరంలో టెండర్ వేసి పనులు పూర్తి చేశారని, పనులు పూర్తి చేసి మూడు సంవత్సరాలు దాటిన తర్వాత మున్సిపల్ అధికారులు తప్పుడు రికార్డులు సృష్టించి కొటేషన్ టెండర్ పెట్టి రీ షెడ్యూల్ చేసి కాంట్రాక్టర్ బిల్లు పెట్టడం చూస్తుంటే మున్సిపల్‌లో ఎంత అవినీతి అక్రమాలు జరుగుతున్నాయో స్పష్టమవుతోందన్నారు. సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

## పెండింగ్‌లో ఉన్న ఫీజు బకాయిలు చెల్లించాలని నిరసన

**ప్రజాపక్షం/కోరుట్ల:** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా గత నాలుగు సంవత్సరాలుగా ఫెండింగ్ ఉన్న ఫీజు బకాయిలు చెల్లించకపోవడం వల్ల కళాశాలను నిర్వహించే పరిస్థితిలేదని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఫీజు బకాయిలు చెల్లించాలని జగిత్యాల జిల్లా కోరుట్ల రామకృష్ణ డిగ్రీ పిజి కళాశాల విద్యార్థులు అద్యాపకులు నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు ఈకార్యక్రమంలో కళాశాల యమజయాన్యం, అధ్యాపక బృందం విద్యార్థిని విద్యార్థులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

## తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటయోధులకు నివాళులు




**ప్రజాపక్షం/కోరుట్ల :** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల సందర్భంగా అమరులైన యోధుల స్పూర్తితో మన హక్కులకై ఉద్యమించాలని ఏఐటియుసి జిల్లా అధ్యక్షులు సుతారి రాములు పిలుపునిచ్చారు. జగిత్యాల జిల్లా కోరుట్ల డివిజన్ కేంద్రంలోని సి నాయాణ రెడ్డి కళాభవన్ ఆవరణలో తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ మరియు హెల్పర్స్ వర్కర్స్ యూనియన్ ఏఐటియుసి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ నె ల11నుండి 17 వరకు జరిగే వారోత్సవాల సందర్భంగా తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధులు మాజీ ఉమ్మడి కరీంనగర్ జిల్లా పార్లమెంట్ సభ్యులు బద్దం ఎల్లారెడ్డి, నల్గొండ జిల్లా పార్లమెంట్ సభ్యులు రావి నారాయణరెడ్డి, కవి రచయిత ఎంఎల్‌సి మఖ్దూమ్ మొయినుద్దీన్, నైజాం నవాబ్ పరిపాలనలో రజాకార్ల గుండాలకు తొలి అమరుడైన దొడ్డి కొమురయ్య చాకలి ఐలమ్మలకు పూలమాలలతో ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలోఅంగన్‌వాడీ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు ఎం సాయిశ్వరి, ప్రధాన కార్యదర్శి నందూరి కర్ణకుమారి, సుమలత, పద్మ, గంగామణి, హిమగిరి లక్ష్మీ , రాధా, ఏఐ ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎండీ సమీర్ పుల్లం గోపాల్ తదితరులు పాల్గొన్నారు

## నిషేధిత ప్లాస్టిక్ వినియోగిస్తే చర్యలు



**ప్రజాపక్షం/కోరుట్ల:** సింగిల్ యూస్ ప్లాస్టిక్‌ను పూర్తిస్థాయిలో నిషేదించాలని కోరుట్ల మున్సిపల్ కమిషనర్ రవీందర్ అన్నారు. జగిత్యాల జిల్లా కోరుట్ల మున్సిపల్ కమిషనర్ రవీంధర్ ఆదేశాల మేరకు పట్టణంలోని టిఫిన్ సెంటర్లు మరియు దుకాణ సముదాయాలలో ఆకస్మీక తనిఖీలు నిర్వహించారు. వారు వినియోగిస్తున్న సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను స్వాధీన పరచుకొని 3000 రూపాయలు జరిమానాలు విధించడంతో పాటు బట్ట సంచుల వాడకంపై అవగాహన కల్పించడం జరిగింది. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్లాస్టిక్‌ను పూర్తి గా నిషేదించాలని లేని యెడల జరిమానాలు విధించడంతోపాటు దుకాణాలు సీజ్ చేయడం జరుగుతుందన్నారు. ట్రేడ్ లైసెన్స్ లేనివారు వెంటనే తీసుకోవాలని వ్యాపార కార్యకపాలలో వెలువడిన చెత్త తడి, పొడి హానికరక చెత్తగా వేరుచేసి షాప్ వద్దకు వచ్చే మున్సిపల్ వాహానాలకు అందించాని తెలిపారు. ఈ కార్యక్రమంలో సానిటరి ఇన్స్‌ఫెక్టార్లు రాజేంద్రప్రసాద్, అశోక్, రికార్డ్ అసిస్టెంట్ జగదీష్, వార్డు ఆఫీసర్లు ఎన్విరాల్‌మెంటల్ ఇంజనీర్ మహేష్, హేమంత్, జవాన్ రమేష్ పాల్గొన్నారు.

# డెంగీ ప్రభలకుండా చర్యలు: కలెక్టర్




**ప్రజాపక్షం/సిద్దిపేట:** గత రెండు,మూడురోజులుగా జిల్లాలో అధికంగా వర్షాలు కురిసినందున డెంగ్యూ వ్యాధి ప్రభల కుండ జిల్లా వ్యాప్తంగా గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలు పకడ్బందీగా నిర్వహించేలా పర్యావేక్షించాలని జిల్లా కలెక్టర్ హైమావతి మండల ప్రత్యేక అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ గడిచిన రెండు,మూడు రోజుల్లో జిల్లాలో కురిసిన అధిక వర్షాలతో నేల చిత్తడిగా మారి, నీరు నిల్వ ఉండటం వల్ల దోమలు వృద్ది చెంది డెంగ్యూ మలేరియా వ్యాధులు వ్యాపించే అవకాశం ఉన్నందున జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలు పకడ్బందీగా నిర్వహించేలా మండల ప్రత్యేక అధికారులు పర్యావేక్షించాలన్నారు. అదేవిధంగా జిల్లాలో గల మున్సిపాల్టీల్లో మున్సిపల్ కమిషనర్లు పారిశుధ్య కార్యక్రమాలను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. ఈనెల 17 నుండి అక్టోబర్ 2వరకు స్వస్త్ వారి స్వశక్తి అభియాన్ కార్యక్రమాన్ని సంక్షేమశాఖ, డిఆర్డీఎ, విద్య తదితర శాఖల సమన్వయంతో జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో నిర్వహించి అన్ని వయస్సుల బాలికలు,మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించి సాధరణ వైద్య సేవలతోపాటు ప్రత్యేక వ్యాధి నిపుణులచే వైద్య సేవలు, అందించేలా ప్రణాళిక బద్ధంగా చర్యలు చేపట్టాలని వైద్య ఆరోగ్యశాఖ అధికారి ధన్‌రాజ్‌ను ఆదేశించారు. ఈసందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్లు గరిమా అగర్వాల్, అబ్దుల్ హమీద్, డిఆర్డీడిఓ జైదేవ్ ఆర్యతో కలసి స్వచ్చతాహి సేవా 2025కార్యక్రమ ఫోస్టర్‌ను విడుదల చేశారు. ఈకార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి నాగరాజమ్మ, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## హరికృష్ణకు మద్దతుగా గాంధీభవన్‌కు తరలి వెళ్లిన కాంగ్రెస్ నేతలు




**ప్రజాపక్షం/ సిద్దిపేట :** సిద్దిపేట నియోజక వర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి పూజల హరికృష్ణకు మద్దతుగా సిద్దిపేట జిల్లా కేంద్రంలో సోమవారం పెద్దఎత్తున కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు గాంధీ భవన్‌కు తరలివెళ్లారు. నియోజకవర్గం ముఖ్యనేతలు గంప మహేందర్‌రావు, బొమ్మల యాదగిరి, కలిమొద్దీన్, మీసం మహేందర్, రాజబహదూర్‌రెడ్డి. ముద్దం లక్ష్మి ,దాస అంజయ్య, గోపి కృష్ణ ఆధ్వర్యంలో వాహనాల్లో కాంగ్రెస్ నాయకులు గాంధీ భవన్‌కు తరలివెళ్లారు. గాంధీభవన్‌లో పిసిసి క్రమశిక్షణ కమిటి చైర్మన్ శ్యాంమోహన్‌తో కలసి నియోజక వర్గంలో కాంగ్రెస్ పరిస్థితిని వివరించారు. సిద్దిపేట నియోజకవర్గంలో కొందరు కాంగ్రెస్ నేతలు పార్టీకి కోవర్టుగా పనిచేస్తూ, బిఆర్ఎస్‌కు అనుకూలంగా వ్యవహరిస్తున్నారన్నారు. పార్టీ కార్యక్రమాలకను దూరంగా అంటిఅంటనట్లుగా వ్యవహరిస్తున్నారన్నారు. పిసిసి పిలుపునిచ్చిన కార్యక్రమాల్లో పాల్గొనకుండ పార్టీ అభివృద్ధికి కృషిచేస్తున్న నియోజక వర్గం ఇంచార్జి పూజల హరికృష్ణపై అధిష్టానానికి తప్పుడు ఫిర్యాదు చేశారు. పార్టీ వ్యతిరేకంగా పాల్పతే నాయకులపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు.తామంత పూజల హరికృష్ణ నేతృత్వంలో పనిచేస్తున్నట్లు తెలిపారు.రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల్లో సిద్దిపేట నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ సత్తాను చాటుతామని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో నియోజక వర్గంలోని ముఖ్యనేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

### కలెక్టర్ కోయ శ్రీ హర్ష





**ప్రజాపక్షం/పెద్దపల్లి :** ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అధికారులను ఆదేశించారు. సోమవారం పెద్దపల్లి పట్టణంలోని మాతా శిశు సంరక్షణ కేంద్రాన్ని (ఎంసిహెచ్) ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్, ఔట్ పేషెంట్ బ్లాక్‌లు, ఆపరేషన్ థియేటర్లు, గర్భిణుల ప్రత్యేక వార్డులు, చిన్న పిల్లల వార్డులు, ల్యాబ్, మందుల పంపిణీ కేంద్రాన్ని పరిశీలించారు. ఆసుపత్రిలో పారిశుద్ధ్య నిర్వహణ మరింత మెరుగ్గా ఉండాలని, ఔట్ పేషెంట్ సేవలు అందించే సమయంలో అప్రమత్తంగా ఉండాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సెప్టెంబరు నెలలో ఎంసిహెచ్ ఆసుపత్రిలో 136 ప్రసవాలు జరిగినట్లు తెలుసుకున్న కలెక్టర్, ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవాల సంఖ్య పెంచేందుకు కృషి చేయాలని సూచించారు. గర్భిణీ స్త్రీలకు 100 శాతం ఎఎన్‌సి రిజిస్ట్రేషన్ చేయాలని, టీకాలు సకాలంలో వేయాలని ఆదేశించారు. ఈ పర్యటనలో ఆయన వెంట జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీధర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

**అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలి**

ప్రజావాణిలో వచ్చే దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ డి.వేణుతో కలిసి ఆయన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా పలు సమస్యలు కలెక్టర్ దృష్టికి వచ్చాయి. సుల్తానాబాద్ మండలం రెబ్బల్ దేవ్ పల్లికి చెందిన తాండ్ర శంకర్ తన భూమిలో వేసిన సిసి రోడ్డు బిల్లు అడ్డుకున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరగా, సుల్తానాబాద్ మండలం గొల్లపల్లికి చెందిన సైదం మహేష్, సర్వే నెంబర్ 42లో ఉన్న 20 గుంటల భూమికి అసైన్‌మెంట్ ఇవ్వాలని దరఖాస్తు చేసుకున్నారు. అర్హతను పరిశీలించి నివేదిక అందించాలని తహసిల్దార్‌ను ఆదేశించారు. ఓదెల మండలం నాగపురి రవి, సర్వే నెంబర్ 1034లో ఉన్న నాలుగు ఎకరాల 20 గుంటల ప్రభుత్వ భూమిని ఆక్రమించుకుని సాగు చేస్తున్నారని ఫిర్యాదు చేయగా, వెంటనే విచారణ చేసి చర్యలు చేపట్టాలని తహసిల్దార్‌ను ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## ప్రజావాణీ ఆర్జీలపై సమగ్ర విచారణ: కలెక్టర్ బి.సత్యప్రసాద్

**ప్రజాపక్షం/జగిత్యాల:** ప్రజావాణీ ఆర్జీలపై సమగ్ర విచారణ జరిపి సమస్యలను పరిష్కరించాలని అధికారులను జిల్లా కలెక్టర్‌బి.సత్యప్రసాద్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి ఫిర్యాదులు వినతులను అదనపు కలెక్టర్, ఆర్డీవోలతొ కలిసి స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోని జిల్లాలోని పలు ప్రాంతాలనుండి చవ్చే ప్రజలు సమస్యలు విన్నవించుకోవడానికి ప్రజావాణికి వస్తారని అధికారులు వారి శాఖల వారిగా స్వీకరించిన ఫిర్యాదులపై సానుకూలంగా స్పందించాలని అన్నారు. ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 31 ఫిర్యాదులు వినతులు వచ్చాయని వాటిని వెంటనే సంబంధిత అధికారులను పరిష్కరించే తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాజాగౌడ్, జగిత్యాల, మెట్‌పల్లి ఆర్డీవోలు మధుసూధన్, శ్రీనివాస్, వివిధ శాఖల జిల్లా అధికారులు, తహాసీల్దార్లు కలెక్టరేట్ పర్యవేక్షకులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాదానికి గురైన వ్యక్తికి పరిహారం అందజేత



**ప్రజాపక్షం/మనోహరాబాద్ :** మనోహరాబాద్ మండలంలోని మేజర్ గ్రామ పంచాయతీ కళ్ళకల్ గ్రామ శివారులో గల శ్రీరామ్ స్విమ్మింగ్ మిల్ పరిశ్రమలో, ఇటీవల జరిగిన ప్రమాదంలో గాయపడిన కళ్ళకల్ గ్రామానికి చెందిన గానుగు రవి ముదిరాజ్‌కి స్థానిక తాజా మాజీ సర్పంచ్ నత్తి మల్లేష్ ముదిరాజ్, గ్రామ పెద్దలతో కలిసి పోలీసుల సహకారంతో పరిశ్రమ యాజమాన్యంతో చర్చించి బాధితుడి కుటుంబానికి 8 లక్షల రూపాయల చెక్కును పరిహారంగా సోమవారం వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమ ప్రతినిధి సుబ్బారావు, గానుగు సురేష్, సతీష్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ స్థాయి యోగా పోటీలకు జన్నారం యువకుడు



**ప్రజాపక్షం/జన్నారం :** జన్నారం మండలంలోని మహ్మదాబాద్ గ్రామానికి చెందిన దుర్గం వినోద్ కుమార్ జాతీయ స్థాయి యోగా పోటీలకు ఎంపికయ్యాడు. ఆదివారం నల్గొండ జిల్లాలో జరిగిన 12వ సీనియర్ రాష్ట్ర స్థాయి యోగా పోటీల్లో వినోద్ బంగారు పతకం సాధించాడు. ఈ విజయంతో వచ్చే నెల 9 నుంచి 12 వరకు కర్ణాటకలోని మైసూరు నగరంలో జరగబోయే జాతీయ స్థాయి పోటీల్లో తెలంగాణ రాష్ట్రం తరపున పోటీ పడనున్నాడు. ఈ సందర్భంగా తెలంగాణ యోగా అసోసియేషన్ ఇన్‌చార్జ్ కార్యదర్శి సిద్దరెడ్డి, యోగా ఫెడరేషన్ ఆఫ్ ఇండియా వైస్ ప్రెసిడెంట్ మనోహర్ చేతుల మీదుగా వినోద్‌కు బంగారు పతకం ప్రదానం చేశారు. వినోద్ విజయాన్ని మండల ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు అభినందించారు.



## యూరియా కొరత.. బారులు తీరిన రైతులు

**ప్రజాపక్షం/కేరమేరి :** ఈ వానాకాలం సీజన్‌లో రైతులకు యూరియా కొరత పెద్ద సమస్యగా మారింది. సోమవారం కేరమేరి సహకార సంఘంలో యూరియా స్టాక్ వచ్చిందన్న సమాచారం తెలుసుకున్న రైతులు తెల్లవారు జామునే క్యూలు కట్టారు. రైతుల వద్ద ఆధార్ కార్డు, పట్టాదారు పాస్‌బుక్ జిరాక్స్ ప్రతులు తీసుకుని ఒక్కో రైతుకు కేవలం రెండు బస్తాల యూరియా మాత్రమే ఇచ్చారు. గందరగోళం తలెత్తకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఒక్కో రైతుకు రెండు బస్తాల యూరియా ఇవ్వడంపై రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండు బస్తాలు సరిపోవని, ఇప్పటికే పంటలకు యూరియా వేసే సమయం దాటిపోతోందని, పొలాలు పసుపుపచ్చగా మారుతున్నాయని, దిగుబడులు దెబ్బతినే ప్రమాదం ఎక్కువ అని తెలిపారు. రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని యూరియా సరఫరా పెంచాలని, బస్తాల పరిమితి తొలగించాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



## పెండింగ్ వేతనాలు అందజేయాలి

**ప్రజాపక్షం/ఆదిలాబాద్ :** ఆగస్టు నెల పెండింగ్ వేతనాలు వెంటనే విడుదల చేయాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి సిర్ర దేవేందర్ డిమాండ్ చేశారు. సోమవారం ఎఐటియుసి తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రిమ్స్ బ్రాంచ్ ఆధ్వర్యంలో కలెక్టర్ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిర్ర దేవేందర్ మాట్లాడుతూ రిమ్స్, సూపర్‌స్పెషలిటీ అసుపత్రుల్లో పనిచేస్తున్న శానిటేషన్, పేసెంట్ కేర్, సెక్యూరిటీగార్డ్స్ కార్మికుల నెల జీతాలు ప్రతి నెల అందజేయాలని అన్నారు. లేనిపక్షంలో ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రిమ్స్ బ్రాంచ్ అధ్యక్ష,కార్యదర్శులు జి.సంగీత, ఎండి ఖాసీం, నాయకులు నల్ల శివకుమార్, కన్నల లక్ష్మి, ఎస్.కె.సైబస్‌లు ఉన్నారు. అనంతరం జిల్లా కేంద్రంలోని బొక్కల గూడాకు చెందిన మున్సిపల్ కార్మికుడు ములుగురి రవి అనారోగ్యంతో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందారు. సోమవారం ఆయన పార్థివ దేహానికి ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి సిర్ర దేవేందర్, నాయకులు పూల మాలలు వేసి అంతిమ వీడ్కోలు పలిరారు. ఆయన వెంట మున్సిపల్ ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మంతెన కాంతారావు, యూనియన్ జిల్లా డిప్యూటీ ప్రధాన కార్యదర్శి అల్లూరి నారాయణరెడ్డి, యూనియన్ సలహాదారులు గాజంగుల చంద్రశేఖర్, యూనియన్ జిల్లా నాయకులు కె.ఉషాన్న, అగ్గిమళ్ళ రమేష్, మున్సిపల్ కార్మికులు నాడ్పి రాజన్న, రాంచందర్, డ్రైవర్ నరేందర్, అడ్డురి ఆశన్న, అడ్డికి ఆశన్న, డైవర్ ఎ. శ్రీనివాస్ ఉన్నారు.



## ఫొటో ట్రేడ్ ఎక్స్‌పో పోస్టర్ ఆవిష్కరణ

**ప్రజాపక్షం/జన్నారం :** ఫొటోగ్రఫీ రంగంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రతిబింబించే తెలంగాణ ఫోటో ట్రేడ్ ఎక్స్‌పో పోస్టర్‌ను జన్నారం మండల అధ్యక్షుడు దుమల్ల ప్రశాంత్ ఆవిష్కరించారు. సోమవారం మండల కేంద్రంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఫొటోగ్రఫీ ఒక సృజనాత్మక స్ఫూర్తిగా మారిందని, ఇటువంటి ఎక్స్‌పోలు కొత్త పరికరాలు, కెమెరాలు, లెన్స్‌లు, డ్రోన్లు, ప్రింటింగ్ యంత్రాలు, లైటింగ్ సిస్టమ్‌లు, ఫోటో ఎడిటింగ్ సాఫ్ట్‌వేర్, స్టూడియో మోడల్స్‌ను ప్రదర్శించే వేదికగా ఉంటాయని తెలిపారు. ఆసక్తిగల ఫొటోగ్రాఫర్లు ఈ ఎక్స్‌పోలో పాల్గొని తమ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈనెల 19, 20, 21 తేదీల్లో హైద్రాబాద్ ఓం కన్వెన్షన్ హాల్లో ఎక్స్‌పో నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో ఫొటో వీడియో గ్రాఫర్ల సంఘం ప్రధాన కార్యదర్శి ఉపారపు శేఖర్, ఉపాధ్యక్షులు గుగ్లవత్ వసంత్, పోతూ వేణుగోపాల్, భీమేష్, రవి, శ్రీనివాస్, శేఖర్, కస్తూరి సాయి, మహేష్, స్వామి, పవన్ చారి, వినోద్, మారుతి, సాయి తదితరులు పాల్గొన్నారు.

## ఐదవ రోజు కాంట్రాక్టు కార్మికుల నిరసన

**ప్రజాపక్షం/ రెబ్బెన :** గోలేటి సివిల్ డిపార్ట్మెంట్ కాంట్రాక్టు కార్మికులు 26 పని దినాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ గత ఐదు రోజులుగా విధులు బహిష్కరించి ఆందోళన చేస్తున్నారు. సోమవారం గోలేటి సివిల్ డిపార్ట్మెంట్ వద్ద జరిగిన నిరసనలో ఎఐటియుసి బెల్లంపల్లి రీజియన్ అధ్యక్షుడు భోగే ఉపేందర్, ఎఐటియుసి గోలేటి బ్రాంచ్ వర్కింగ్ అధ్యక్షుడు రాయుల నరసయ్య, ఐఎఫ్‌టియు బ్రాంచ్ అధ్యక్షుడు అరకిల్ల పోశం, కార్యదర్శి గోలేటి శ్రీనివాస్ మాట్లాడుతూ బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ కార్మికుల సమస్యలపై ప్రేక్షక పాత్ర వహిస్తున్నారని విమర్శించారు. బొగ్గు ఉత్పత్తి పెంపుపై మాత్రమే శ్రద్ధపెట్టి, కార్మికుల సంక్షేమంపై పూర్తిగా విస్మరించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కొంతమంది కాంట్రాక్టర్లకు యాజమాన్యానికి ఊడిగం చేస్తూ, కార్మికుల న్యాయమైన డిమాండ్లను పట్టించుకోవడంలేదని ఆరోపించారు. యాజమాన్యం తక్షణమే స్పందించి పాత కార్మికులందరికీ 26 పని దినాలు కల్పించాలని, లేకుంటే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్టుకు కార్మికులు, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.



### మంచిర్యాల రైల్వే స్టేషన్‌ను

# ఎయిర్‌పోర్ట్ స్థాయిలో తీర్చిదిద్దుతాం

**రాబోయే దశాబ్దంలో తెలంగాణ రైల్వే అభివృద్ధికి రూ.80 వేల కోట్లు**

**కేంద్ర హోం సహాయ మంత్రి బండి సంజయ్**



**ప్రజాపక్షం / మంచిర్యాల :** విమానాశ్రయాలను తలపించేలా దేశవ్యాప్తంగా రైల్వే స్టేషన్లను అభివృద్ధి చేస్తున్నట్లు కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తెలిపారు. సోమవారం మంచిర్యాల రైల్వే స్టేషన్‌లో వందే భారత్ (20101 నాగ్‌పూర్, సికింద్రాబాద్) రైలు స్టాపేజీని రాష్ట్ర మంత్రి గడ్డం వివేకానంద, పెద్దపల్లి పార్లమెంట్ సభ్యుడు గడ్డం వంశీకృష్ణ, జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, ఎంఎల్‌సి అంజిరెడ్డి, డిఆర్‌ఎం. గోపాలకృష్ణన్ సమక్షంలో ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కేంద్ర హోం సహాయ మంత్రి బండి సంజయ్ మాట్లాడుతూ వందే భారత్ రైళ్లు భారతీయ రైల్వే చరిత్రలో విప్లవాత్మక మార్పులు తెచ్చాయని, దేశ వ్యాప్తంగా 150 వందే భారత్ రైళ్లు సేవలు అందిస్తున్నాయని, వీటి ద్వారా ఇప్పటివరకు 3 కోట్ల ప్రయాణికులు లబ్ధిపొందారని, ఒక్కో వందే భారత్ రైలు తయారీకి 130 కోట్లు ఖర్చవుతోందని వివరించారు. ప్రస్తుతం తెలంగాణలో 5 వందే భారత్ రైళ్లు నడుస్తున్నాయని, త్వరలో మరో రెండు రాబోతున్నాయని తెలిపారు. సికింద్రాబాద్ నుండి పూణె, నాందేడ్ రూట్లపై వందే భారత్ నడపాలనే ప్రతిపాదనలు సిద్ధంగా ఉన్నాయని, అమృత్ భారత్ పథకం కింద రైల్వే స్టేషన్లను ఆధునీకరించేందుకు తెలంగాణలో 2,751 కోట్లు కేటాయించామని చెప్పారు. రాష్ట్రంలో 40 స్టేషన్లు ఆధునీకరణ పొందనున్నాయని, 2014కు ముందు రైల్వే పరిస్థితి దారుణంగా ఉండేవని, స్టేషన్లలో కనీస సౌకర్యాలు లేక, ట్రాక్‌లు చెత్తతో నిండిపోయేవని, కానీ మోదీ నేతృత్వంలో రైల్వే రూపురేఖలు మార్చుకున్నాయని వ్యాఖ్యానించారు. మంచిర్యాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించడం జరుగుతుందని, స్టేషన్‌లో ఫుట్ ఓవర్ బ్రిడ్జి కోసం 3.5 కోట్లు, ఇతర అభివృద్ధి కోసం అమృత్ భారత్ పథకం కింద 26 కోట్లు కేటాయించామని వెల్లడించారు. మంచిర్యాలను మినీ ఎయిర్‌పోర్ట్‌లా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. 2014లో యుపిఎ ప్రభుత్వం తెలంగాణకు రైల్వే బడ్జెట్ కింద కేవలం 258 కోట్లు మాత్రమే ఇచ్చిందని, కానీ ఈ ఏడాదే బిజెపి ప్రభుత్వం 5,336 కోట్లు కేటాయించిందని తెలిపారు. రాజకీయ విభేదాలు పక్కనపెట్టి అభివృద్ధికి సహకరించాలని, గతంలో బిఆర్‌ఎస్ ప్రభుత్వం కేంద్రంపై ఆరోపణలు చేస్తూ నిధులను కోల్పోయిందని, ఇకపై రాష్ట్రం, కేంద్రం కలిసి పనిచేస్తేనే అభివృద్ధి సాధ్యమవుతుంది అని స్పష్టం చేశారు.

**వందే భారత్ స్టాపేజీపై రాష్ట్ర మంత్రి వివేక్ హర్షం :** మంచిర్యాల నుండి హైదరాబాద్‌కు ఉదయం పూట రైలు లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ఈ సమయంలో వందే భారత్ స్టాపేజీ ఇవ్వడం సంతోషంగా ఉందని తెలిపారు.

మంచిర్యాల నుండి శబరిమల వెళ్లే భక్తుల కోసం కేరళ ఎక్స్‌ప్రెస్ రైలును మంచిర్యాలలో ఆపాలని కోరారు. రూ. 10 వేల కోట్లతో రామగుండం యూరియా ప్లాంట్‌ను తిరిగి ప్రారంభించామని, మరొక ప్లాంట్ ఏర్పాటు చేస్తే యూరియా కొరత ఉండదని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.



## పర్యావరణ పరిరక్షణకు ప్రతీ ఒక్కరూ మొక్కను నాటి సంరక్షించాలి

**సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు**

**ప్రజాపక్షం/కాగజ్‌నగర్ రూరల్ :** పర్యావరణ పరిరక్షణకు ప్రతీ ఒక్కరూ మొక్కను నాటి సంరక్షించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు అన్నారు. సోమవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాలుర కాగజ్‌నగర్‌లో సామూహిక మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే హాజరై ఉపాధ్యాయులు, పోషకులు, విద్యార్థులతో కలిసి మొక్కను నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చెట్లు కేవలం ఆకుపచ్చ అందమే కాదని ఆరోగ్యానికి ఆధారమని, భావితరాలకు తరగతి సంపద కాబట్టి పర్యావరణ పరిరక్షణఖు ప్రతీ ఒక్కరు మొక్కలు ఆనటి సంరక్షించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ కోట ప్రసాద్, మండల విద్యాధికారి వాసాల ప్రభాకర్, మున్సిపల్ కమిషనర్ రాజేందర్, ప్రధానోపాధ్యాయురాలు ఆత్రం ప్రమీల, ఉపాధ్యాయులు, పోషకులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



## సిపిఐ పోరాటంతోనే భారత్‌లో 'హైదరాబాద్' విలీనం

**ప్రజాపక్షం/నిజామాబాద్ అర్బన్ :** తెలంగాణ సాయుధ పోరాటంలో అనేకమంది కమ్యూనిస్టులు తమ ప్రాణాల త్యాగఫలమే నేటి తెలంగాణ ఆవిర్భావమని సిపిఐ రాష్ట్ర నాయకులు కంజర భూమయ్య అన్నారు. సోమవారం మోపాల్ మండలం సిరిపూర్ గ్రామంలో సిహెచ్.సాయాగౌడ్ అధ్యక్షతన తెలంగాణ సాయుధ పోరాటం వారోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సిపిఐ రాష్ట్ర నాయకులు కంజర భూమయ్య మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ పోరాటం ద్వారా 1948 సెప్టెంబర్ 17న భారతదేశంలో విలీనమైందని, కావున సెప్టెంబర్ 17న అధికారిక దినోత్సవంగా తెలంగాణ ఆవిర్భావ దినోత్సవంగా జరుపుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఐ నిజామాబాద్ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు అడ్డిక రాజేశ్వర్, గంగాధర్, సాయిలు, గ్రామస్తులు పాల్గొన్నారు.




## ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

**ప్రజాపక్షం/నేరడిగొండ :** జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు, పదోన్నతి పొందిన సునీత,లీలావతి,కోడూర సంతోష్‌కుమార్ లని పి.ఆర్.టి.యు టిఎస్, అధ్యక్షుడు కట్కూరి గంగాధర్ ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులకు త్వరితగతిన పరిష్కారం

**జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్**



**ప్రజాపక్షం/నిర్మల్ :** ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిస్కరించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని ప్రజల నుండి వచ్చిన ఫిర్యాదులను స్వయంగా స్వీకరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ,ప్రతి దరఖాస్తును పూర్తిగా పరిశీలించి వెంటనే స్పందించాలని సూచించారు.మండలాల వారీగా పెండింగ్‌లో ఉన్న ప్రజావాణి దరఖాస్తులను సంబంధిత శాఖలు సమన్వయంతో పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజావాణి అనంతరం అధికారులతో మాట్లాడిన కలెక్టర్,కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వస్త్ నారిస్వశక్తి పరివార్' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. సెప్టెంబర్ 17 నుండి అక్టోబర్ 2 వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు.మహిళలకు రక్తహీనత, బిపి, థైరాయిడ్, టిబి, గర్భిణీ స్త్రీల ఆరోగ్య పరీక్షలు నిర్వహించి నిపుణ వైద్యుల పర్యవేక్షణలో చికిత్స అందించడమే ప్రధాన లక్ష్యమని వివరించారు.

అలాగే,ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని, సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 16 వరకు జరగనున్న పోషణ్ మా కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని ఆదేశించారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా ప్రత్యేక పోషకాహార కార్యక్రమాలు నిర్వహించి ఎనీమియా ముక్త నిర్మల్ సాధించాలని సూచించారు.జిల్లాలోని అన్ని ప్రభుత్వ విద్యాసంస్థల్లో ఫేషియల్ రికగ్నైజేషన్ హాజరు విధానాన్ని కచ్చితంగా అమలు చేయాలని, ఉపాధ్యాయులు,విద్యార్థులందరూ వంద శాతం హాజరు కావాలన్నదే తమ లక్ష్యమని కలెక్టర్ స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఫైజాన్ అహ్మద్,ఆర్డీవో రత్న కళ్యాణి, జెడ్పీ సీఈవో గోవింద్‌తో పాటు వివిధ శాఖల అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

## బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలపై కమిటీ సమీక్ష



**ప్రజాపక్షం/మందమర్రి :** మందమర్రి ఏరియాలో బొగ్గు ఉత్పత్తి సామర్థ్యం పెంచడంపై కార్పొరేట్ టార్గెట్ కమిటీ దృష్టి సారించింది. 2026, 27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఉత్పత్తి లక్ష్యాలను ఖరారు చేయడానికి కమిటీ సోమవారం కీలక సమావేశం నిర్వహించింది. జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కార్పొరేట్ ప్రాజెక్ట్స్ అండ్ ప్లానింగ్ జనరల్ మేనేజర్ ఎ. మనోహర్ నేతృత్వంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎ. మనోహర్ మాట్లాడుతూ మందమర్రి ఏరియాకు కేటాయించిన ఉత్పత్తి లక్ష్యాలను పూర్తిస్థాయిలో సాధించాలని సూచించారు. బొగ్గు నాణ్యత మెరుగుదల, యంత్రాల అవసరాలు, భూసేకరణ సమస్యలు మరియు వాటి పరిష్కారాలపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు. ఈ మేరకు మందమర్రిలోని భూగర్భ, ఉపరితల గనులు నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేస్తాయని జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్స్ అండ్ ప్లానింగ్ జనరల్ మేనేజర్లు, మార్కెటింగ్ అధికారులు, ఏరియా ఇంజనీర్లు, ప్రాజెక్ట్ ఆఫీసర్లు, ఇతర సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

### 17 నుండి అక్టోబర్ 2వ వరకు

# స్వచ్ఛత ఉత్సవ్ కార్యక్రమాలు

**కలెక్టర్ పి.ప్రావీణ్య**




**ప్రజాపక్షం/సంగారెడ్డి :** స్వచ్ఛత ఉత్సవ్ కార్యక్రమాలను విజయవంతం చేయాలని, సెప్టెంబర్ 17 నుండి అక్టోబర్ 2వ వరకు స్వచ్ఛత ఉత్సవ్ కార్యక్రామాలు నిర్వహించుచున్నట్లు జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య గోడ పత్రికను ఆవిష్కరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న స్వచ్ఛత హే సేవ 2025 కార్యక్రమాన్ని సోమవారం కలెక్టరేట్లో కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య స్వచ్ఛ ఉత్సవ్ కార్యక్రమాల విజయవంతం కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు సెప్టెంబర్ 17 నుండి అక్టోబర్ 2 వరకు జిల్లాలోని అన్ని గ్రామాలు పట్టణాలో ప్రజలకు పారిశుద్ధ్యం విస్తృత స్థాయిలో అవగాహన కల్పించడం వ్యర్థాల తొలగింపు స్వచ్ఛ శ్రామికలు సంక్షేమం, పర్యావరణహితమైన పండుగలను ప్రోత్సహించడం, పరిశుభ్రమైన గ్రామాలు, పరిశుభ్రమైన భారత్ అనే సంకల్పం నెరవేర్చడం లక్ష్యంగా స్వచ్ఛ ఉత్సవ్ కార్యక్రమాలు నిర్వహించుచున్నట్లు తెలిపారు. స్వచ్ఛ భారత్ మిషన్ లో భాగంగా రూపొందించిన కార్యక్రమాలు ప్రతి గ్రామ పంచాయతీలో తప్పనిసరిగా అమలు చేయాలని సూచించారు. స్వచ్ఛ ఉత్సవ కార్యక్రమంలో భాగంగా మొదటగా స్వచ్ఛత లక్ష యూనిట్లు మ్యాపింగ్ కార్యక్రమం చేపట్టాలని ఇందులో జిల్లాలో పెద్ద మొత్తంలో పేర్కొన్న వ్యర్థాల ప్రదేశాలను గుర్తించి ఎన్‌హెచ్ ఎస్ 2025 పోర్టల్‌లో భౌగోళిక స్థానం గుర్తించడం ఫోటోలు ప్రగతి నివేదికలు అప్లోడ్ చేయడం గుర్తించిన ప్రదేశాలలో శాశ్వతంగా శుభ్రంగ ఉపయోగకరంగా మార్చేలా ఏర్పాట్లు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు, చంద్రశేఖర్, మాదురి, నారాయణఖేడ్, సబ్ కలెక్టర్ ఉమా హారతి డిఆర్‌ఓ పద్మజారాణి జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారులు, పంచాయతీరాజ్ అధికారులు సంబందిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.




## స్వచ్ఛతలో ప్రతి గ్రామం ఆదర్శంగా నిలవాలి

**కలెక్టర్ వెంకటేశ్ దోత్రే**

**ప్రజాపక్షం/ఆసిఫాబాద్ :** కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలోని ప్రతి పట్టణం, గ్రామం స్వచ్ఛతలో ఆదర్శంగా నిలవాలని జిల్లా కలెక్టర్ వెంకటేశ్ దోత్రే ఆకాంక్షించారు. ఈనెల 17 నుండి అక్టోబర్ 2 వరకు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జరగనున్న స్వచ్ఛత హీ సేవ 2025 కార్యక్రమాలకు సంబంధించిన గోడ పత్రికను ఆయన సోమవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్వచ్ఛతతో పల్లెలు మెరిసేలా ఈ కార్యక్రమాలు పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. ప్రజలను పెద్ద ఎత్తున ఈ కార్యక్రమాల్లో భాగస్వాములను చేయడం అత్యంత ముఖ్యమని ఆయన నొక్కి చెప్పారు. 15 రోజులలో గ్రామాలు, మున్సిపాలిటీలలో చెత్త పేరుకుపోయిన ప్రాంతాలను శుభ్రం చేయడం, ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, విద్యా సంస్థలను పరిశుభ్రం చేయడం, శ్రమదాన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ దీపక్ తివారి, జిల్లా పంచాయతీ అధికారి బిక్షపతి, డిఎల్‌పిఓ ఒమర్ హుస్సైన్, ఎస్‌బిఎం జిల్లా కో ఆర్డినేటర్లు ఫణికుమార్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

క్రీడ

# వరుసగా రెండో 'గ్రాండ్ స్విస్' టైటిల్.. చరిత్ర సృష్టించిన దివ్య



ప్రపంచ చదరంగాన్ని భారత యువ గ్రాండ్ మాస్టర్ శాసిస్తున్నారు. ఈ మధ్యే ఫిడే మహిళల వరల్డ్ కప్ టైటిల్‌తో దివ్య దేశ్‌ముఖ్ కొత్త అధ్యాయం లిఖించగా.. తాజాగా రమేశ్‌బాబు వైశాలి సైతం చరిత్ర సృష్టించింది. ప్రతిష్ఠాత్మక గ్రాండ్ స్విస్ టైటిల్‌ని నిలబెట్టుకున్న తొలి ప్లేయర్‌గా రికార్డు నెలకొల్పింది. సోమవారం జరిగిన ఫైనల్లో మాజీ వరల్డ్ ఛాంపియన్ టాన్ జొంగ్యీకు ముచ్చెమటలు పట్టించింది వైశాలి. అసమాన పోరాటంతో మ్యాచ్ డ్రా చేసుకున్న భారత చెస్ క్వీన్.. అత్యధిక పాయింట్లతో టైటిల్‌ను ఎగరేసుకుపోయింది. ఉత్కంఠగా సాగిన ఫైనల్లో టాన్ జోంగ్యీకి చెక్ పెట్టడం ద్వారా వచ్చే ఏడాది జరుగబోయే క్యాండిడేట్స్ టోర్నీకి అర్హత సాధించింది చెస్ క్వీన్.

## టాస్ గెలిచిన శ్రీలంక.. బ్యాటర్లనే నమ్ముకున్న హాంకాంగ్

ఆసియా కప్‌ను విజయంతో ఆరంభించిన శ్రీలంక రెండో మ్యాచ్ ఆడుతోంది. దుబాయ్లోని ఇంటర్నేషనల్ స్టేడియంలో హాంకాంగ్ జట్టుతో లంక తలపడుతోంది. టాస్ గెలిచిన సారథి చరిత అసలంక బౌలింగ్ ఎంచుకున్నాడు. కీలకమైన ఈ మ్యాచ్‌కు లంక ఒక మార్పు చేసింది. పిచ్ స్పిన్నర్లకు అనుకూలిస్తున్న నేపథ్యంలో పేసర్ పథిరన స్థానంలో తీక్షణను తీసుకుంది లంక. తొలి మ్యాచ్‌లో అఫ్గనిస్థాన్ చేతిలో చిత్తుగా ఓడిన హాంకాంగ్ లంకను నిలువరించాలని భావిస్తోంది. ఒక మార్పుతో బ్యాటింగ్‌కు దిగుతున్న పసికూన పోరాడగలిగే స్కోర్ సాధిస్తుందా? లేదా? అనేది మరికొన్ని నిమిషాల్లో తెలియనుంది.

**శ్రీలంక తుది జట్టు :** పథుమ్ నిశాంక, కుశాల్ మెండిస్ (వికెట్ కీపర్), కమిల్ మిశ్రా, కుశాల్ పెరీరా, చరిత్ అసలంక(కెప్టెన్), కమిందు మెండిస్, దసున్ శనక, వనిందు హసరంగ, తీక్షణ, దుష్మంత చమీర, నువాన్ తుషార.

**హాంకాంగ్ తుది జట్టు :** జీషన్ అలీ(వికెట్ కీపర్), అన్షుమన్ రథ్, బాబర్ హయత్, నిజకాత్ ఖాన్, షాహిద్ వసీఫ్, కించిత్ షా, యాసీం ముర్తాజా(కెప్టెన్), ఐజజ్ ఖాన్, ఆయుష్ శుక్లా, ఇషాన్ ఖాన్, అతీక్ ఇక్బాల్.



## పాక్‌తో ఆడటం భారత ఆటగాళ్లకు ఇష్టం లేదు : సురేశ్ రైనా




పాకిస్తాన్‌తో అయిష్టంగానే భారత ఆటగాళ్లు మ్యాచ్ ఆడారని మాజీ క్రికెటర్ సురేశ్ రైనా అన్నాడు. బిసిసిఐ ఒత్తిడి మేరకే తప్పని పరిస్థితుల్లో బరిలోకి దిగారని తెలిపాడు. ఆసియా కప్ 2025లో భాగంగా ఆదివారం పాకిస్థాన్‌తో తలపడిన భారత్ 7 వికెట్ల తేడాతో ఘన విజయాన్నందుకున్న విషయం తెలిసిందే. అయితే ఈ మ్యాచ్‌ను బాయ్‌కట్ చేయాలని మేజార్టీ భారతీయులు పిలుపునిచ్చారు. పహల్గామ్ ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్ ఘటనల నేపథ్యంలో పాక్‌తో ఎలాంటి సంబంధాలు పెట్టుకోవద్దని భారతీయులు కోరుకుంటున్నారు. కానీ ఐసిసి, ఎసిసి రూల్స్ ప్రకారం పాకిస్థాన్‌కు ఆడాల్సిన పరిస్థితి ఏర్పడిందని బిసిసిఐ వివరణ ఇచ్చింది. అయినా వినని అభిమానులు ఈ మ్యాచ్ పట్టించుకోలేదు. అభిమానుల నిరసనల మధ్యే పాక్‌తో ఆడిన భారత్ అసాధారణ విజయాన్నందుకుంది. ఈ విజయానంతరం పాక్ ఆటగాళ్లకు షేక్ హ్యాండ్ ఇవ్వకుండా భారత ఆటగాళ్లు డ్రెస్సింగ్ రూమ్‌కు వెళ్లిపోయారు. అంతేకాకుండా ఈ విజయాన్ని భారత సాయుధ దళాలకు అంకితమిస్తున్నట్లు కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ ప్రకటించాడు. పహల్గామ్ ఉగ్రదాడి బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని, వారికి సానుభూతిని తెలియజేస్తున్నామని వెల్లడించాడు. తప్పని పరిస్థితుల్లోనే ఈ మ్యాచ్ ఆడాల్సి వచ్చిందని అభిమానులకు పరోక్షంగా సంజాయిషీ ఇచ్చుకున్నాడు. ఈ క్రమంలోనే సురేశ్ రైనా సంచలన వ్యాఖ్యలు చేశాడు. అసలు భారత జట్టుకు ఈ మ్యాచ్ ఆడే ఇష్టమే లేదని చెప్పాడు. 'పాక్‌తో మ్యాచ్ ఆడాలని భారత ఆటగాళ్లకు ఏ మాత్రం ఇష్టం లేదు. మీరు మన ఆటగాళ్లను వ్యక్తిగతంగా తమ అభిప్రాయాలను అడిగితే ఇదే విషయం చెబుతారు. ఆసియా కప్లో పాక్తో ఆడాలని ఉందా? లేదా? అనే ప్రశ్నకు అందరూ లేదనే బదులిస్తారు. బిసిసిఐ ఒత్తిడి వల్లే ఈ మ్యాచ్ ఆడేందుకు వారు అంగీకరించారు. పాక్‌తో ఆడటం నన్ను బాధించింది. విజయం సాధించడం ఆనందమే కానీ.. అసలు ఆడకుండా ఉండుంటే ఇంకా బాగుండేది.'అని సురేశ్ రైనా పేర్కొన్నాడు. వరుసగా రెండు విజయాలతో టీమిండియా సూపర్4 బెర్తు ఖరారు చేసుకుంది. మరోవైపు పాకిస్థాన్ తమ ఆఖరి మ్యాచ్లో యూఏఈపై విజయం సాధిస్తే రెండో జట్టుగా సూపర్4కు అర్హత సాధిస్తుంది. అదే జరిగితే మరోసారి భారత్, పాక్ జట్లు తలపడుతాయి. వచ్చే ఆదివారమే(సెప్టెంబర్ 21) ఈ మ్యాచ్ ఉంటుంది. అప్పుడు ఇరు జట్ల మధ్య మరింత ఉద్రిక్త పరిస్థితులు నెలకొనే అవకాశం ఉంది.

యువతరంగం

ఫోకస్

# ప్రమాద ఘంటికలు






శాన్‌ఫ్రాన్సిస్కో, కాలిఫోర్నియా (అమెరికా)లోని మైక్రోసాఫ్ట్ మౌంటెన్ వ్యూ కార్యాలయంలో భారత సంతతికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ప్రతీక్ పాండే మరణం టెక్ కంపెనీల్లో పని చేస్తున్న ఉద్యోగులందరికీ హెచ్చరికలు జారీ చేస్తున్నది. గత నెల (ఆగస్టు 20న) విధినిర్వహణలో ఉండగానే 35 సంవత్సరాల పాండే గుండెపోటుకుగురయ్యాడు. అక్కడికక్కే మరణించాడు. అయితే, పాండేకు ఆరోగ్య సమస్యలు ఏవీ లేదని అతని కుటుంబ సభ్యులు స్పష్టం చేశారు. తీవ్రమైన మానసిక ఒత్తిడే అతని మరణానికి కారణమని అనుమానిస్తున్నారు. ఉద్యోగంలో భాగంగా పాండే ఎన్నో ప్రాజెక్టులను మేనేజ్ చేస్తున్నందు వల్ల చాలా ఒత్తిడిగా ఉన్నట్టు సహచరులు అంటున్నారు. పాండే మృతి అందరినీ దిగ్భ్రాంతికి గురి చేసింది. అదే సమయంలో టెక్ కంపెనీల్లోని పరిస్థితులపై ప్రమాద ఘంటికలు మోగిస్తున్నది. ఉద్యోగులను రాత్రిళ్లు ఎక్కువగా పని చేయడాన్ని టెక్ కంపెనీలు నియంత్రించాల్సిన అవసరం ఉందన్న డిమాండ్ బలంగా వినిపిస్తున్నది. పని ఒత్తిడిని తగ్గించే చర్యలు చేపట్టాలని పలువురు సూచిస్తున్నారు. పాండే మృతి సంఘటన సిలికాన్ వ్యాలీ సహా ప్రపంచ ఐటి రంగంలో నెలకొన్న పరిస్థితులపై అనుమానాలకు కారణమవుతున్నది. ప్రత్యేకించి అతిగా పనులు చేయాల్సి రావడాన్ని చాలా మంది తప్పుపడుతున్నారు. కృత్రిమ మేధస్సు (ఎఐ), చాట్‌బోట్స్ వంటి అధునాతన సాంకేతిక అందుబాటులోకి రావడంతో, ఉద్యోగ భద్రతపై ఉన్న ఒత్తిడి కూడా ప్రస్తుతం టెక్ రంగంలో మరింత పెరిగిందని పరిశీలనలు వెల్లడించాయి. తగినంత విశ్రాంతి లేకుండా పని చేయాల్సి రావడం, ఆపై తీవ్రమైన ఒత్తిడి పాండే మరణానికి కారణమయ్యాయి. ఐటి రంగంలో నెలకొన్న పరిస్థితులకు ఈ ఘటన అద్దం పడుతున్నది.

## ఓపెన్ 'ఎఐ'పై కేసు



అమెరికాలోని లాస్‌ఏంజిల్స్‌కు చెందిన మరియా రైనే, మాట్ రైనే దంపతులు ఓపెన్ ఎఐ కంపెనీపై కేసు వేశారు. తమ కుమారుడు ఆడమ్ రైనే ఆత్మహత్య చేసుకోవడానికి ఈ సంస్థ అందుబాటులోకి తెచ్చిన చాట్‌జిపిటియే కారణమన్నది వారి ఆరోపణ. 16 ఏళ్ల ఆడమ్ ఈ ఏడాది ఏప్రిల్ మాసంలో ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటనకు కొన్ని వారాల ముందు నుంచి అతను సరుసగా చాట్‌జిపిటిలో 'ఆత్మహత్య చేసుకోవడం ఎలా' అనే ప్రశ్నకు సమాధానాలు వెతకడం మొదలుపెట్టాడు. అతని ఫోన్‌ను పరిశీలిస్తే, మనుషుల కంటే కృత్రిమ మేధస్సు (ఎఐ)తోనే ఎక్కువ సమయం గడిపేందుకు ఇష్టపడేవాడన్న విషయం స్పష్టమైంది. చాట్‌జిపిటి ఇచ్చిన సూచనలను తు.చ తప్పకుండా పాటించి, అతను ఆత్మహత్య చేసుకోవడం కలకలం రేపింది. రైనే దంపతులు తమ కుమారుడి మృతికి చాట్‌జిపిటి ఇచ్చిన సమాచారమే కారణమంటూ లా సూట్‌లో ఆరోపించారు. ఇప్పుడు అమెరికా వ్యాప్తంగా ఈ కేసుపై జోరుగా చర్చ జరుగుతున్నది. కారణాలు ఏవైనా, యువత ఏ విధంగా తప్పు తోవ పడుతున్నది, ఎలాంటి తొందరపాటు నిర్ణయాలు తీసుకుంటున్నదనేది ఈ ఘటన నిరూపిస్తున్నది. ఇలాంటి అకాల మరణాలు, బలవంతపు చావులు తగ్గాలంటే సమాజం మొత్తం జాకరూకతతో ఉండాలి. ఎఐ కంటే స్నేహితులు, కుటుంబ సభ్యులే ముఖ్యమనే ఆలోచనను పిల్లలకు కలిగించాలి. సాధ్యమైనంత ఎక్కువ సమయాన్ని వారితో గడపాలి.

## పెరుగుతున్న అంతర్జాల వ్యసనం!

యువతీయువకుల్లో అంతర్జాల వ్యసనం క్రమంగా పెరుగుతున్నది. అమెరికా, ఐరోపా దేశాల్లో ప్రస్తుతం 18.25 శాతం మంది నెటిజన్లు ఈ సమస్యతో సతమతమవుతున్నారు. వివిధ మీడియా కథనాలను అనుసరించి, ఒక్క చైనాలోనే 2.5 కోట్ల మంది గేమింగ్ అడిక్షన్‌కు గురయ్యారు. దక్షిణ కొరియాలో 24 శాతం మంది గేమ్స్‌ఆడేవారు ఆ ఆటే వ్యసనంగా మారి ఆసుపత్రి పాలవుతున్నారు. మాస్కోలో 17 ఏళ్ల యువకుడు 22 రోజుల పాటు ఏకధాటిగా గేమ్స్ ఆడి చివరకు మృతి చెందిన ఘటన పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతున్నది. అంతర్జాతీయ నివేదికల ప్రకారం, పది మందిలో కనీసం ముగ్గురు నిద్రలేచింది మొదలు పడుకొనేదాకా ఫోన్ వదలడం లేదు. సగం మందికివైగా రోజుకు సగటున 50 సార్లు తమతమ ఫోన్లను చెక్ చేసుకుంటూ ఉన్నారు. ప్రయాణంలో, విధుల్లో, చివరికి స్నేహితులు లేదా కుటుంబ సభ్యులతో కలిసి ఉన్నప్పటికీ, 60 శాతం మంది సెల్‌ఫోన్లు చూడడాన్ని మానుకోలేకపోతున్నారు. మద్యపానం, డ్రగ్స్, పొగతాగేవారున్న కుటుంబాలోని వారికి ఈ సమస్య ఎక్కువ. అదే విధంగా ఇప్పటికే మానసిక సమస్యలున్న వారు, ఆందోళన, ఒత్తిడి ఎక్కువున్నవారు, వ్యక్తిత్వలోపం ఉన్నవారు, భావవ్యక్తీకరణ లోపంతో నలుగురిలో కలవలేకపోతున్నవారు ఎక్కువగా ఫోన్లపైనే ఆధారపడుతున్నారు. నిజానికి అంతర్జాలాన్ని చూసే వారందరూ దానికి బానిసలు కారు. కాకుంటే పైన వేర్కొన్న సమస్యలున్న వారు వ్యసనపరులయ్యే ప్రమాదం ఎక్కువ. ఆందోళన, ఒత్తిడి, వ్యక్తిత్వ సమస్యలున్నవారు ఇతరులతో మేరుగైన సంబంధాలు నిర్వహించలేరు. ఈ సమస్యను అధిగమించేందుకు ఇలాంటి వారు ఎక్కువగా నెట్ పై ఆధారపడి వర్చువల్ రిలేషన్‌ను కోరుకుంటారు. ఇందులో భాగంగా క్రమంగా నెట్కి బానిసలవుతారు. కాబట్టి, పిల్లలు నెట్లో ఏమి చేస్తున్నారు.. ఏమి చూస్తున్నారో అనే విషయంపై తల్లిదండ్రులు తప్పకుండా నిఘా ఉంచాలి. పరిమితి మించితే వారికి కౌన్సెలింగ్ ఇప్పించాలి. ఇంట్లో పిల్లలు నెట్‌ను పరిమితికి మించి వినియోగిస్తుంటే వారిని ఆటలు, వ్యాయామం, ఇతర అంశాల వైపు మళ్లించాలి. ఇంట్లో కంప్యూటర్‌ను హాల్లోనే అందరికీ కనిపించేలా ఉంచాలి. మానసిక ఒత్తిడి, ఆందోళన, భావవ్యక్తీకరణ లేమి తదితర సమస్యలతో బాధపడుతున్న వారు నెట్ వల్ల కాస్త రిలీఫ్ గా భావిస్తారు. కానీ, తర్వాత ఇదే వారిని క్రమంగా మరింత ప్రమాదంలోకి నెట్టేస్తుంది. వర్చువల్ ప్రపంచంలో (నెట్) నుంచి బయటపడలేక మానసిక సమస్యలు మరింత పెరుగుతాయి. దీంతో వారు బయట కంటే వర్చువల్ ప్రపంచమే బాగుందనుకుని క్రమంగా దానికి బానిసలైపోతారు. ప్రస్తుతం మా వద్దకు కౌన్సెలింగ్ కోసం నిత్యం కొంత మంది నెట్ వ్యసనపరులు వస్తున్నారు.

# సాయుధ పోరాట చరిత్రను వక్రీకరిస్తున్న పాలకులు


వరంగల్...


నేలకొండపల్లి...

## సిపిఐ రాష్ట్ర సహాయకార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు : ఘనంగా తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలు

**ప్రజాపక్షం/వరంగల్ :** తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను పాలకులు వక్రీకరిస్తున్నారని, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. విలీనం దినోత్సవంపై మాట్లాడే హక్కు బిజెపికి ఎంతమాత్రం లేదన్నారు. తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల సందర్భంగా వరంగల్‌లోని అబ్బాస్ ఫంక్షన్ హాల్‌లో సాయుధ పోరాట వారోత్సవాల సభను సోమవారం ఘనంగా నిర్వహించారు. పోచమ్మ మైదాన్ లోని చెన్నబోయిన కమలమ్మ అప్పన్న విగ్రహాలకు నివాళులర్పించిన అనంతరం ర్యాలీ నిర్వహించారు. సిపిఐ జిల్లా కార్యదర్శి షేక్ బాష్మియా అధ్యక్షతన జరిగిన సాయుధ పోరాట వారోత్సవాల సభలో తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ తెలంగాణ విలీన దినోత్సవంపై కేంద్రంలో, రాష్ట్రంలో అధికారంలో ఉన్న ప్రభుత్వాలు నాటకాలు ఆడుతున్నాయని విమర్శించారు. విమోచన దినోత్సవం పేరిట బిజెపి ప్రజలను మభ్యపెడుతుందన్నారు. నైజాం వ్యతిరేక పోరాటంలో బిజెపి పాత్ర ఏమాత్రం లేదన్నారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు టి.వెంకటరాములు, మేకల రవి, సిరబోయిన కరుణాకర్, దండు లక్ష్మణ్, గన్నారపు రమేష్, బుస్సా రవీందర్, గుండె బద్రి, ఆరెల్లి రవి, అక్కపెల్లి రమేష్, ఎండి అక్బర్, ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ల్యాదెల్ల శరత్ పాల్గొన్నారు.

### నిజాం నవాబు, రజాకార్లను తరిమి కొట్టిన ఘనత కమ్యూనిస్టులది

**నేలకొండపల్లి :** తెలంగాణ సాయుధ పోరాటంలో నిజాం, రజాకార్లను తరిమికొట్టిన ఘనత కమ్యూనిస్టులదని సిపిఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు అన్నారు. తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల సందర్భంగా సోమవారం నేలకొండపల్లి సిపిఐ సమితి ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని అమరజీవి కర్నాటి కృష్ణయ్య స్థూపం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బాగం హేమంతరావు మాట్లాడుతూ నిజాం నవాబు, రజాకార్లను, జమీందార్లు లకు భూస్వాములకు వ్యతిరేకంగా పోరాటాలు చేసి పేదలకు భూములు పంచిన ఘనత కమ్యూనిస్టు పార్టీదన్నారు. కార్యక్రమంలో మిడికంటి వెంకట రెడ్డి, కర్నాటి భాను ప్రసాద్, కనకబండి సీతారాములు, వెంపటి సురేందర్, సిపిఐ మండల కార్యదర్శి మారిశెట్టి వేంకటేశ్వరరావు, రైతుసంఘం మండల కార్యదర్శి పాల్తియ శ్రీనివాస్‌రావు, చావ గణపతిరావు, ఆలేటి మహేష్, తమ్మిశెట్టి మమత, కుంచం బిక్షం, బాలిన కృష్ణంరాజు, కాశబోయిన అయోధ్య, అబ్దుల్ సత్తార్, రావెల కృష్ణయ్య, వల్లాల కృష్ణ, వాసంశెట్టి వెంకటేశ్వర్లు, అనంత పుల్లయ్య, బాలెబోయిన వెంకటేశ్వర్లు, చిలువేరు రేణుబాబు, కనకబండి కృష్ణయ్య, చెన్నబోయిన మల్లయ్య, మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

**శాయంపేట :** తెలంగాణ సాయుధ పోరాటం గురించి మాట్లాడి నైతిక హక్కు బిజెపికి లేదని సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి అన్నారు. సోమవారం సిపిఐ శాయంపేట మండల సమితి ఆధ్వర్యంలో మందార్ పేట్‌లో సాయుధ పోరాట వారోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు అదరి శ్రీనివాస్, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎన్ ఎ స్టాలిన్, మండల కార్యదర్శి బత్తిని సదానందం, సహాయ కార్యదర్శి అనుకారి అశోక్, ఎండీ అంకుషావలి, వల్లాల రమేష్, బండారి సాంబయ్య, ముంద్రాతి రమేష్, తీగలా కల్పనా, వైదుల రమా, లక్ష్మీ పాల్గొన్నారు.

**ఆత్మకూరు :** తెలంగాణ విలీన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి డిమాండ్ చేశారు. సోమవారం ఆత్మకూరులోని బస్టాండ్ వద్ద సిపిఐ ఆధ్వర్యంలో సాయుధ పోరాట వారోత్సవాలు నిర్వహించారు. జన్నారపు మొగిలి అధ్యక్షత వహించగా ఆదరి శ్రీనివాస్, ఎన్ఎ స్టాలిన్, బత్తిని సదానందం, కొట్టేపాక రవి, అనుకారి అశోక్, జన్నారపు మొగిలి, ఎండీ అంకుషావలి, జె.తరుణ్, బండారి సాంబయ్య, ముంద్రాతి రమేష్, తీగలా కల్పనా, వైదుల రమా, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

**ఎల్కతుర్తి:** సిపిఐ మండల సమితి ఆధ్వర్యంలో తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలను ఎల్కతుర్తి మండల కేంద్రంలో అంబేద్కర్ విగ్రహం వద్ద సిపిఐ మండల కార్యదర్శి శనగరపు రాజకుమార్ అధ్యక్షతన నిర్వహించారు. సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, ఆదారి శ్రీనివాస్, ఊటుకూరు రాములు, కొట్టపాక రవి, మరిపెల్లి తిరుమల, తండముండయ్య, మల్లయ్య మోహన్ రెడ్డి, రాజిరెడ్డి, చంద్రమౌళి, కుమారస్వామి, పోచయ్యలు తదితరులు పాల్గొన్నారు.

### పోరాట వారోత్సవాలను అధికారికంగా నిర్వహించాలి

**నిర్మల్ :** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కలవేని శంకర్ డిమాండ్ చేశారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల సందర్భంగా జిల్లాకేంద్రంలో రాంజీగోండ్, కొమరం భీమ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సిపిఐ నిర్మల్ జిల్లా కార్యదర్శి భుక్య రమేష్, ఎస్ఎన్‌రెడ్డి పాల్గొన్నారు.

**భైంసా :** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం వారసత్వం పూర్తిగా సిపిఐకే దక్కుతుందని పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కలవేని శంకర్ అన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వార్షికోత్సవాలు భైంసా పట్టణంలో సిపిఐ, ఎఐటియుసి ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠ్యపుస్తకాల్లో తెలంగాణ సాయుధ పోరాట పోరాట చరిత్రను చేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ఎస్.విలాస్, భూక్యా రమేష్, జిల్లా కార్యదర్శి ఎస్ఎన్.రెడ్డి. గోపి, మండల కార్యదర్శి పెందరి ముత్యం, సహాయ కార్యదర్శి లక్ష్మణ్, అనిల్ సింగ్, జావేద్, బాలు, విఠల్ తదితరులు పాల్గొన్నారు.

**రాజన్న సిరిసిల్ల :** రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో బద్దం ఎల్లారెడ్డి సింగిరెడ్డి భూపతి రెడ్డిల కాంస్య విగ్రహాలను ఏర్పాటు చేయాలనీ సిపిఐ జిల్లా కార్యదర్శి మంద సుదర్శన్ ప్రభుత్వాన్ని కోరారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాల వారోత్సవాల సందర్భంగా లక్ష్మీ పూర్ శివారులో గల సింగిరెడ్డి భూపతిరెడ్డి స్తూపం నివాళులర్పించారు. కార్యక్రమంలో సిపిఐ కార్యవర్గ సభ్యులు కడారి రాములు, సోమ నాగరాజు, మీసం లక్ష్మణ్, మంగ అనిల్, సుంకనపల్లి శాంత, గాజుల లింగం, కొంక విజయ్ పాల్గొన్నారు.

**సంగారెడ్డి :** మట్టి మనషులను పోరాట యోధులుగా మార్చింది తెలంగాణ సాయుధ పోరాటమని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ప్రకాష్‌రావు అన్నారు. సదాశివపేటలో సిపిపి ఆధ్వర్యంలో తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలను తాజోద్దీన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి రెహమాన్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు షఫీ అహ్మద్, మండల కార్యదర్శి పాండు, పట్టణ కార్యదర్శి అనసూజ, మునిపల్లి, మండల కార్యదర్శి, గంగమ్మ, నాయకులు బుజ్జమ్మ, ముస్తాపా, పూలమ్మ, శంకరప్ప, సాదిక్ అలీ, బిపాషా, సంజీవ్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, వెంకట్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు,.

**యాదాద్రి :** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలలో భాగంగా సోమవారం రాజపేట మండలంలో రేణిగుంట గ్రామంలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధులు, భారత కమ్యూనిస్టు పార్టీ నాయకులు అమరజీవి చింతలపూడి రామ్‌రెడ్డి విగ్రహం వద్ద, కురారం గ్రామంలో పాశం రామ్‌రెడ్డి, బొందు గుండ్ల గ్రామంలో నారాయణరెడ్డి, బేగంపేట గ్రామంలో బద్దం నర్సిరెడ్డి, జిట్టా రామచంద్రారెడ్డి, చిగుళ్ల మల్లయ్య, జంగం శంకరయ్యల బాలయ్య బలిజ వీరయ్యల స్తూపాల వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి, జిల్లా సహాయ కార్యదర్శి బోలగాని సత్యనారాయణ, కార్యవర్గ సభ్యులు చిగుళ్ల లింగం, మండల సహాయకార్యదర్శి మూలపోచయ్య, ఒగ్గు కరుణాకర్, మూల హరినాథ్, దేవి, సత్తయ్య, ఆకుల బాల నరసయ్య, దొంతి సారపు లక్ష్మీ పతి, గంధమల్ల రాజయ్య, పుట్ట గణేష్, మంగా ఐలయ్య, నంద మల్లేశం, జీడిపల్లి ఉప్పల్‌రెడ్డి, జంగా అంజయ్య, పుంజాల రాజు పాల్గొన్నారు.

**షాబాద్ :** భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం మట్టి మనుషులు చేసిన తిరుగుబాటు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటమని సిపిఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య అన్నారు. సోమవారం చేవెళ్ల మండల కేంద్రంలో సిపిఐ ఆధ్వర్యంలో తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట నాయకులు ప్రభులింగం, నియోజకరవ్గ ఇన్‌చార్జ్ రామస్వామి, కౌన్సిల్ సభ్యులు వడ్ల సత్యనారాయణ, సుధాకర్ గౌడ్, వడ్ల మంజుల, మక్బూల్, కార్యదర్శులు పాలమాకుల శ్రీశైలం, శ్రీనివాస్, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.


ఎల్కతుర్తి...


శాయంపేట...


సిరిసిల్ల...


షాబాద్...


నిర్మల్...


భైంసా...


సంగారెడ్డి...


యాదాద్రి...

# స్థానికం

REGIONAL NEWS

వరంగల్, హన్మకొండ, జనగాం, భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్



## పెంచిన పెన్షన్లు వెంటనే అమలు చేయండి



**ప్రజాపక్షం/గూడూరు:**దివ్యాంగులకు వృద్ధులకు వితంతువులకు పెంచిన పెన్షన్లను వెంటనే అమలు చేయాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి నాయకులు పాశం సాంబయ్య రుద్ర తిరుపతి డిమాండ్ చేశారు. సోమవారం మహబూబాబాద్ జిల్లా గూడూరు మండల కేంద్రంలో తాసిల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేసి నిరసన వ్యక్తం చేశారు.రేవంత్‌రెడ్డి పదవి చేపట్టి 22 నెలల గడిచిన ఇచ్చిన ప్రకారం పెన్షన్‌నెందుకు పెంచలేదని అన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం అందిస్తున్న పెన్షన్ దివ్యాంగులకు వృద్ధులకువితంతువులకు సరిపోవడం లేదని అన్నారు.నిత్యవసర వస్తువుల వాటి ధరలు విపరీతంగా పెరిగాయని అన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం పెంచిన పెన్షన్ విధానాన్ని వెంటనే అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు ఈకార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

## యూరియా కోసం రైతుల ఆందోళన



**ప్రజాపక్షం/ఖానాపూర్:**సరిపడా యూరియా సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ ఖానాపురం మండల కేంద్రంలోని 365 ఎన్‌హెచ్‌పై సోమవారం రైతులు ఆందోళనకు దిగారు. యూరియా కోసం రైతులు ఉదయమే వ్యవసాయ సహకార సంఘం వద్దకు చేరుకున్నారు. ఆఫీస్ ప్రారంభం కాకపోవడంతో ఆగ్రహించిన రైతులు హైవే పైన బైఠాయించారు. రైతులు ధర్నాతో ఇరువైపులా వాహనాలు భారీ సంఖ్యలో నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న స్థానిక ఎస్ఐ రఘుపతి సిబ్బందితో ఘటన స్థలానికి చేరుకొని రైతులకు నచ్చజెప్పడంతో ధర్నా విరమించారు. రెండు రోజుల్లో స్టాక్ వస్తుందని, రాగానే పంపిణీ చేస్తామని ఎస్ఐ సర్ది చెప్పడం జరిగింది. ధర్నా చేస్తున్న క్రమంలో యూరియా లారీ ఆగడంతో ఆ లారీకి అడ్డంగా కొందరు బైఠాయించి లారీ నుండి యూరియా బస్తాలను తీసుకునే ప్రయత్నం చేయగా ఎస్ఐ చెదరగొట్టి లారీని అక్కడి నుండి పంపించేసారు. పార్టీలతో సంబంధం లేకుండా ధర్నాలో ప్రతిపక్ష టిఆర్ఎస్ పార్టీతో పాటు అధికార పక్షం నాయకులు కూడా పాల్గొనడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బత్తిని శ్రీనివాస్ గౌడ్, ఉద్యమ నాయకుడు వల్లెపు శ్రీనివాస్, బాంధరపు శ్రీను గౌడ్, జాటోతు నరసింహనాయక్, చాగంటి పెద్ద వెంకటేశ్వర్లు, సొసైటీ డైరెక్టర్ ఆంగోత్ అశోక్, తదితరులు పాల్గొన్నారు.

## కేటాయించిన గ్రామాల్లోనే యూరియా తీసుకోవాలి

**ప్రజాపక్షం/నెక్కొండ:** రాష్ట్ర వ్యాప్తంగా యూరియా కొరత ఉన్నందున నెక్కొండలోని కొన్ని సెంటర్లలో యూరియా సరఫరా చేస్తున్నందున ఒక్కసారిగా 39 గ్రామపంచాయతీల్లోని రైతులు నెక్కొండకు చేరుకోవడంతో కొందరు వ్యక్తులు కావాలని దీన్ని రాద్ధాంతం చేస్తున్నారని, దీనిని దృష్టిలో పెట్టుకొని జిల్లా అధికారుల సూచనల మేరకు ఏఏ గ్రామాల్లో ఏఏ సెంటర్లలో ఆ గ్రామాల రైతులు యూరియా తీసుకోవాలని ఆ వివరాలు ఏవో నాగరాజు తెలిపారు. ప్రస్తుత వర్షకాలం సీజన్‌కు సంబంధించిన యూరియా పంపిణీ మండలంలోని నెక్కొండ పాక్స్ ద్వారా నెక్కొండ, పనికర, పత్తిపాక, పెద్దకొర్పోలు, గుండ్రపల్లి, అప్పల్‌రావుపేట రైతులు తీసుకోవాలని అలాగే నెక్కొండ సహకార సంఘం పరిధిలోని పాక్స్ దీక్షకుంట్లలో దీక్షకుంట్ల, ముదిగొండ, సీతారంపురం గ్రామాల రైతులు తీసుకోవాలని, రెడ్లవాడ పాక్స్ పరిధిలో రెడ్లవాడ, సాయిరెడ్డిపల్లి, గొట్లకొండ రైతులు తీసుకోవాలని, పాక్స్ రెడ్లవాడ బ్రాంచ్ తోపనపల్లిలో తోపనపల్లి, బొల్లికొండ, అలంఖానిపేట రైతులు తీసుకోవాలని, వీటితోపాటు పాక్స్ చంద్రుగొండ ద్వారా చంద్రుగొండ రెవెన్యూ గ్రామ పరిధిలోని గ్రామాలు గొల్లపల్లి, బంజరుపల్లి, గేటుపల్లి, గిరిజనతండా, చంద్రుగొండ తీసుకోవాలని అలాగే సూరిపల్లి పాక్స్ ద్వారా సూరిపల్లి, చిన్నకొర్పోలు, నాగరాజు గ్రామాల రైతులు తీసుకోవాలని ఆయా గ్రామాల రైతులు ఎట్టి పరిస్థితుల్లో నెక్కొడ, ఇతర సెంటర్లకు వెళ్లరాదన్నారు.

## అకాల వర్షాలకు నేలకు ఒరిగిన శివాలమర్రి చెట్టు

అధికారులతో కలిసి పరిశీలించిన ఎమ్మెల్యే నాగరాజు, చైర్మన్ మార్నేని



**ప్రజాపక్షం/ఐనవోలు :** ఐనవోలు మల్లికార్జున దేవాలయ సమీ పం లోని దాదా పు 100 ఏండ్ల చరిత్ర కలిగిన శివాలమర్రి చెట్టు గత రెండు మూడు రోజులుగా కురుస్తున్న అకాల వర్షాల కారణంగా నేలకు ఒరిగిపోవడంతో చెట్టు వేర్లు బయటపడిపోయాయి. ఈ పరిణామాన్ని గమనించిన వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు, టెస్కాబ్ చైర్మన్ మార్నేనీ రవీందర్ రావు సోమవారం క్షేత్రస్థాయిలో అధికారులతో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ "ఈ శివాలమర్రి చెట్టు దాదాపు శతాబ్ద కాలం చరిత్ర కలిగి, ఐనవోలు దేవాలయ పరిసరాలకు ఒక ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోందన్నారు. ఈ చెట్టును రక్షించేందుకు అటవీశాఖ, దేవాదాయశాఖ, పర్యావరణ నిపుణులతో చర్చించి తగిన చర్యలు తీసుకుంటామని, ప్రజల విశ్వాసాలకు అనుసంధానమైన ఈ వృక్షాన్ని కాపాడటం మనందరి బాధ్యత" అని అన్నారు. అకాల వర్షాలతో ఈ చెట్టు నష్టపోవడం విచారకరమని, దీన్ని రక్షించేందుకు అవసరమైన సాంకేతిక చర్యలు, ఆధునిక పద్ధతులు అనుసరిస్తామన్నారు. శతాబ్దాల వృక్ష సంపదను కాపాడటం కోసం ప్రభుత్వంతో కలిసి పనిచేస్తాం అని ఎమ్మెల్యే నాగరాజు తెలిపారు.ఈ సందర్భంగా ఐనవోలు దేవస్థానం చైర్మన్ కమ్మగోని ప్రభాకర్ గౌడ్, ధర్మకర్తలు, మండల, గ్రామ స్థాయి ప్రజా ప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## విద్య, వైద్యంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలి: కలెక్టర్

**ప్రజాపక్షం/మహబూబాబాద్ :**విద్య, వైద్యంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలని జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ అన్నారు.సోమవారం జిల్లా కలెక్టర్ బయ్యారం మండలం నామాలపాడు లోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ పాఠశాల కిచెన్ హాల్, డైనింగ్ హాల్, మ్యూజిక్ గది,తరగతి గదులను తనిఖీ చేసి విద్యార్థులతో మాట్లాడి బోధనాంశాల సామర్థ్యాలను అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం పరిశుభ్రమైన ఆహారాన్ని విద్యార్థులకు అందించాలన్నారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు.అనంతరం మహబూబాబాద్ పట్టణంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని కలెక్టర్ తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని జనరల్ మేల్, ఫిమేల్ వార్డులను, పిల్లల వార్డులను తనిఖీ చేసి అక్కడి పేషెంట్ల యొక్క వివరాలను, వారికి అందుతున్న వైద్యసేవలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రి ఆవరణ పరిశుభ్రంగా ఉండాలని, ఆసుపత్రి కు వచ్చే రోగులకు ఎటువంటి ఇబ్బంది కలుగకుండా వైద్యానికి సంబంధించిన అన్ని సదుపాయాలని కల్పించాలని వైద్య సిబ్బందికి ఆదేశించారు. సీజనల్ వ్యాధులకు సంబంధించిన మందులను ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంచుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట ఈ.ఎం.ఆర్.ఎస్ ప్రిన్సిపాల్, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఆర్.ఎం.ఓ జగదీశ్వర్, సూపరింటెండెంట్ శ్రీనివాస్, వైద్యులుపాల్గొన్నారు.

# పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం భరోసా

పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

ఆడపడుచులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ





**ప్రజాపక్షం/తొర్రూరు :** తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిరుపేదల ఆరోగ్యానికి కాంగ్రెస్ ప్రభుత్వం భరోసానిస్తుందని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. డివిజన్ కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో సోమవారం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అర్హులైన లబ్దిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి కింద మంజూరైన రూ.కోటి71లక్షల22వేల విలువ చేసే చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి అంకితభావంతో పని చేస్తుందన్నారు. నియోజకవర్గంలో ప్రజలు ప్రమాదాల బారిన పడితే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోతు హామ్యా నాయక్, పట్టణ అధ్యక్షుడు సోమ రాజశేఖర్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మేకల కుమార్, మహిళా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షురాలు పింగిలి ఉష, కాంగ్రెస్ నాయకులు పెదగాని సోమయ్య, చాపల బాపురెడ్డి, గంజి విజయపాల్‌రెడ్డి, చింతకుంట్ల శ్రీనివాస్ రెడ్డి, చిత్తలూరి శ్రీనివాస్ గౌడ్, జలకం శ్రీనివాస్, మంగళపల్లి రాంచంద్రయ్య, జినుగ సురేందర్‌రెడ్డి,వెంకట్‌రెడ్డి, ప్రవీణ్‌యాదవ్, మహేశ్వరి, అశోక్, రమేశ్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

**ఆడపడుచులకుఅండగాకల్యాణలక్ష్మి ,**

**షాదీముబారక్ చెక్కుల పంపిణీ....**

పేదింటి ఆడపడుచులకు అండగా కల్యాణలక్ష్మి , షాదీముబారక్ కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తుందని ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి తెలిపారు. డివిజన్ కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం మండలంలోని 78మంది లబ్దిదారులకు కల్యాణలక్ష్మి , షాదీముబారక్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాల పెళ్లిళ్లు గౌరవప్రద ంగా జరిగేందుకు ప్రభుత్వం కల్యాణలక్ష్మి , షాదీముబారక్ పథకాలను అమలు చేస్తోందన్నారు. ఈ కార్యక్రమ ంలో ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, ఏఎంసీ డైరెక్టర్లు కందాడి అచ్చిరెడ్డి, వెంకటాచారి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జా టోతు హామ్యానాయక్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సో మ రాజశేఖర్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మేకల కు మార్, మహిళా మండల నాయకురాలు సునీత రాజేందర్, గ్రామాల నాయకులు, పాల్గొన్నారు.

## పెన్షన్ల అమలులో నిర్లక్ష్యం వద్దు



**ప్రజాపక్షం /ఎల్కతుర్తి :** వికలాంగులు, వృద్ధులు, వితంతువులు, నేత, గీతకార్మికులు తదితర పెన్షనుదారులు తమ హక్కుల కోసం సోమవారం ఎల్కతుర్తి మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయం ఎదుట భారీ ఎత్తున ధర్నా చేపట్టి, పెన్షన్లను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమం ఎమ్మార్పీఎస్ మండల ఇంచార్జ్ అడ్డూరి అనిల్ మాదిగ, కో ఇంచార్జ్ బొంకూరి కార్తీక్ మాదిగ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం జరగగా, పెద్ద ఎత్తున వికలాంగులు, వృద్ధులు, వితంతువులు నినాదాలతో కార్యాలయ ప్రాంగణాన్ని మార్మోగించారు.ఈ సందర్భంగా అడ్డూరి అనిల్ మాదిగ మాట్లాడుతూ వికలాంగులకు రూ.6 వేల పెన్షన్ వృద్ధులు వితంతువులు నేత గీతకార్మికులు మరియు ఇతరులకు రూ.4 వేల పెన్షన్, పూర్తిస్థాయి కండరాల క్షీణత గల వారికి రూ.15 వేల పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. పెన్షన్ల పెంపు, కొత్త పెన్షన్ల మంజూరులో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తే, ఉద్యమాన్ని మరింతగా ఉధృతం చేస్తామని తెలిపారు.ప్రజల హక్కులను కాపాడేందుకు రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపడతాం అని పేర్కొన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి పెన్షన్లను అమలు చేయకపోతే నిరసనలు తీవ్ర రూపం దాల్చుతాయి అని హెచ్చరించారు.అనంతరం ఆందోళనకారులు తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించి, తమ డిమాండ్లను నెరవేర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో వి హెచ్ పి ఎస్ జిల్లా నాయకులు , వి హెచ్ పి ఎస్ మండల ఇన్‌చార్జ్ నార్లగిరి శ్రీనివాస్, ఎం ఎస్ పి మండల నాయకులు అంబాల సంపత్, ఎం ఆర్ పి ఎస్ మండల నాయకులు అడ్డూరి నవిన్ మాదిగ, ఎం ఎస్ ఎఫ్ మండల అధ్యక్షుడు గొల్ల మండల చరణ్ మాదిగ, ఎమ్మార్పీఎస్ చింతలపల్లి గ్రామ శాఖ అధ్యక్షులు అడ్డూరి శ్రీకాంత్ మాదిగ,ఉపాధ్యక్షులు శనిగరం వంశి మాదిగ,ఎమ్మార్పీఎస్ జీలుగుల అధ్యక్షులు ఆరేపెల్లి శ్రీనివాస్, ప్రచార కార్యదర్శి అరేపల్లి ప్రశాంత్,దామెర అధ్యక్షులు గంగారపు రాజుమాదిగ, మైస మధుకర్మాదిగ,పవన్ మాదిగ వికలాంగులు,వృద్ధులు, ఒంటరి మహిళలు, ఎమ్మార్పీఎస్ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొనడం జరిగింది.

## స్ట్రక్చర్ మీటింగుల ఒప్పందాలు అమలు చేయాలి

ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి రాజ్ కుమార్



**ప్రజాపక్షం/భూపాలపల్లి :**గత స్ట్రక్చర్ మీటింగ్లో జరిగిన ఒప్పందాల కు సర్క్యులర్ జారీ చేసి సమస్యలను పరిష్కరించాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం భూపాలపల్లి ఏరియాలోని కేటీకే 1 గని ఫస్ట్ షిఫ్ట్ లో ఏఐటీయూసీ ఫిట్ సెక్రటరీ సదయ్య అధ్యక్షతన జరిగిన గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎఐటియుసిజనరల్ సెక్రెటరీ కొరిమి రాజ్ కు మార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గతంలో సింగరేణి యాజమాన్యంతో మూడుసార్లు స్ట్రక్చర్ మీటింగ్ నిర్వహించడం జరిగిందని అందులో ఒప్పుకున్న సమస్యలను యాజమాన్యం పరిష్కరించలేదని అందుకనే సింగరేణి సిఎండితో జరిగే స్ట్రక్చర్ మీటింగ్‌ను బహిష్కరించడం జరిగిందన్నారు. గతంలో ఒప్పుకున్న ఏ హామీకి సర్క్యులర్ జారీ చేయలేదని, కార్మిక సమస్యలను పరిష్కరించడంలో జాప్యం జరుగుతుందని ఆరోపించారు. కార్మికులకు రావలసిన వాస్తవ లాభాలు ప్రకటించి వెంటనే మెరుగైన లాభాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా యాజమాన్యం నిర్లక్ష్య వైఖరిని మానుకొని తక్షణమే స్ట్రక్చర్ మీ టింగ్లో ఒప్పుకున్న సమస్యలను పరిష్కార దిశగా చర్యలు తీసుకోకుంటే భవిష్యత్తులో సమ్మెకైనా వెళ్లడానికి సిద్ధం గా ఉన్నామని ఈ సందర్భంగా రాజ్ కుమార్ హెచ్చరించారు. ఎఐటియుసి బ్రాంచ్ సెక్రటరీ మోటపలుకుల రమేష్, అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీలు గంగసరపు శ్రీనివాస్, పిట్ సెక్రటరీ సదయ్య పిట్, టెంపుల్, సేఫ్టీ, క్యాంటీన్ కమిటీ సభ్యులు కార్మిక వర్గం పాల్గొన్నారు.

## సమన్వయంతో బతుకమ్మ ఉత్సవ ఏర్పాట్లు

హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ సూచన



**ప్రజాపక్షం/హనుమకొండ :**బతుకమ్మ ఉత్సవ ఏర్పాట్లను అధికారులు సమన్వయంతో పూర్తిచేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ ఉన్నారు.సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలు లో వివిధ శాఖల అధికారులు, వేద పండితులతో బతుకమ్మ ఉత్సవ ఏర్పాట్లపై సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ శాఖల ఆధ్వర్యంలో చేయాల్సిన బతుకమ్మ ఉత్సవ ఏర్పాట్ల పై దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ రామల సునీత, పద్మాక్షి, వెయ్యి స్తంభాల దేవాలయాల ప్రధానార్చకులు శంకర శాస్త్రి, గంగు ఉపేంద్ర శర్మ, పోలీస్ శాఖ నుండి హనుమకొండ ఏసిపి నరసింహారావు, వైద్య ఆరోగ్యశాఖ నుండి డీఎంహెచ్ఓ డాక్టర్ అప్పయ్య, విద్యుత్ శాఖ నుండి ఎస్ఈ మధుసూదన్, ఆర్ అండ్ బి శాఖ నుండి ఈఈ సురేష్ బాబు తమ తమ శాఖల తరపున చేసే ఏర్పాట్లను వివరించారు. ఈ సందర్భంగా హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ ఈనెల 21వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా బతుకమ్మ ఉత్సవాలు ప్రారంభం అవుతున్నాయని, అదే రోజున జిల్లాలోని చారిత్రక వెయ్యి స్తంభాల దేవాలయం వద్ద ఘనంగా బతుకమ్మ ప్రారంభోత్సవ కార్యక్రమం ఉంటుందన్నారు. బతుకమ్మ ఉత్సవాల ఏర్పాట్లలో ఎక్కడ కూడా ఇబ్బందులు తలెత్తకుండా పటిష్ట ఏర్పాట్లు చేయాలన్నారు. విద్యుత్తు లైట్లు ఏర్పాటు చేయాలని ఆ శాఖ అధికారులను ఆదేశించారు. మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య నిర్వహణ మెరుగ్గా ఉండేవిధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఎక్కువ సంఖ్యలో మహిళా పోలీసులను బందోబస్తుకు కేటాయించాలన్నారు. అదేవిధంగా తాగునీరు అందుబాటులో ఉండే విధంగా మున్సిపల్ అధికారులు ఏర్పాట్లు చేయాలన్నారు. గ్రామాలలో కూడా బతుకమ్మ ఉత్సవ ఏర్పాట్లను పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ మాట్లాడుతూ మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో బతుకమ్మ ఉత్సవాలు జరగనున్న ఆలయాల వద్ద ప్రశాంతంగా సాగే విధంగా అన్ని ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు. సౌండ్ సిస్టం, టెంపరరీ టాయిలెట్స్, బ్యారికేడింగ్, తాగునీరు, పారిశుద్ధ్య నిర్వహణ, తదితర ఏర్పాట్లను చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, డిఆర్ఓ వై.వి. గణేష్, డిఆర్డిఓ మేన శ్రీను, హనుమకొండ, పరకాల ఆర్డీవోలు వివిధ శాఖల అధికారులు, వేద పండితులు పాల్గొన్నారు.

## మంత్రి కొండా సురేఖా ఇల్లు ముట్టడి



**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** ప్రీ ప్రైమరీ పీఎం శ్రీవిద్యను అంగన్వాడి కేంద్రాల్లో నిర్వహించాలని ఎఫ్ఆర్ఎస్ ను రద్దు చేయాలని కాంగ్రెస్ మేనిఫెస్టోలో పెట్టినట్లు 18 వేల రూపాయల వేతనం అంగన్వాడీలకు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సిఐటియు రాష్ట్ర కమిటీ మంత్రుల ఇంటిముందు ధర్నాలకు పిలుపునిచ్చింది. అందులో భాగంగా వందలాదిమంది అంగన్వాడీలు రామ్ నగర్ లోని సుందరయ్య భవన్ నుండి పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. అనంతరం మంత్రి ఇంటి ముందు బైఠాయించిన అంగన్వాడీలు అరెస్టు చేసిన వారిని విడుదల చేయాలనిపెద్ద ఎత్తున ఆందోళన చేయడంతో సుబేదారి సీఐ రంజిత్ కుమార్ అరెస్టు చేసిన వారిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ధర్నాను ఉద్దేశించి సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి రాగుల రమేష్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఐసిడిఎస్ తో పాటు విద్యా వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేయడం కోసం నూతన జాతీయ విద్యా విధానం చట్టాన్ని తెచ్చిందని ఇంతటి ప్రమాదకరమైన విధానాలకు వ్యతిరేకంగా నిలబడాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వం పైన ఉంది కానీ రాష్ట్ర ప్రభుత్వం దీనికి భిన్నంగా ఐసిడిఎస్ను మొత్తం నిర్వీర్యం చేస్తుందని మండిపడ్డారు. సిపిఎం జిల్లా కార్యదర్శి జి ప్రభాకర్ రెడ్డి అంగన్వాడి ఉద్యోగుల పోరాటానికి మద్దతు తెలిపి మాట్లాడుతూ అంగన్వాడీలకు తక్షణమే రిటైర్డ్ అయిన అంగన్వాడీ టీచర్స్ హెల్పర్స్ కు బెనిఫిట్స్ అందించాలని ఆయన డిమాండ్ చేశారు. అంగన్వాడీలో ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కాంగ్రెస్ మేనిఫెస్టోలో పెట్టిన విధంగా 18 వేల వేతనం సౌకర్యం అమలు చేయాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు టీ ఉప్పలయ్య, సుంచు విజేందర్ ఉపాధ్యక్షులు బొట్ల చక్రపాణి,అంగన్వాడి యూనియన్ నాయకులతో పాటు వందలాదిమంది అంగన్వాడీలు పాల్గొన్నారు.

## అభివృద్ధి కార్యక్రమాల్లో ఇంజనీర్ల పాత్ర ప్రత్యేకం

కలెక్టర్ డాక్టర్ సత్య శారద



**ప్రజాపక్షం / వరంగల్ :** ప్రభుత్వ సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాల్లో ఇంజనీర్ల పాత్ర ప్రత్యేకమని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు.ప్రభుత్వ ఇంజనీరింగ్ శాఖల ఆధ్వర్యంలో సోమవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో భారత రత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకొని నిర్వహించిన ఇంజనీరింగ్ డే కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రాజెక్టుల నిర్మాణం, సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాల్లో ఇంజనీర్ల కృషి ఎనలేనిదన్నారు.మోక్షగుండం విశ్వేశ్వరయ్య జీవితాన్ని, ఆశయాలను, చేసిన సేవలను, ఆయన చూపిన మార్గాన్ని అనుసరించాలని సూచించారు. విశ్వేశ్వరయ్య సేవలను ఇంజనీరింగ్ అధికారులు ఆదర్శంగా తీసుకొని జిల్లా అభివృద్ధికి పాటుపడాలని కలెక్టర్ సూచించారు.అనంతరం మోక్షగుండం జయంతి సందర్భంగా విశ్వేశ్వరయ్య ఇంజనీరింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్తు హాల్లో ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరాన్ని కలెక్టర్ డాక్టర్ సత్య శారద ప్రారంభించి రక్తదాతలకు ధ్రువపత్రాలు అందజేశారు.ఈ కార్యక్రమంలో ఇండియన్ రెడ్క్రాస్ సొసైటీ రాష్ట్ర పాలక మండలి సభ్యులు ఈవి శ్రీనివాసరావు, టిజిఓ స్ రాష్ట్ర ఉపాధ్యక్షులు జగన్మోహన్ రావు, జిల్లా పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ అధికారి ఇజ్జగిరి, ఇంజనీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం జిల్లాకు ఉత్తమ సేవలందించిన రిటైర్డ్ ఇంజనీర్లను సన్మానించారు.

## ఫీజు బకాయిలపై ప్రభుత్వం నిర్లక్ష్యం వీడాలి



**ప్రజాపక్షం/హనుమకొండ :** ఫీజు బకాయలు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఏఐఎస్ఎఫ్ హనుమకొండ జిల్లా సమితి ఆధ్వర్యంలో 2000 మంది విద్యార్థులతో భారీ ర్యాలీ, అనంతరం విద్యార్థులతో అదాలత్ జంక్షన్లో రాస్తారోకో నిర్వహించడం జరిగింది. భారీ ట్రాఫిక్ జాం, అనంతరం అరెస్టు చేసి సుబేదారి పోలీస్ స్టేషన్ కి తరలించారు.ఈ కార్యక్రమానికి మద్దతుగా మాజీ కూడా చైర్మన్, తెలంగాణ ప్రైవేట్ డిగ్రీ అండ్ పీజీ కాలేజ్ మేనేజ్మెంట్ అసోసియేషన్,స్టేట్ ఫౌండర్ ప్రెసిడెంట్, మాస్టర్ జి విద్యా సంస్థల అధినేత సంఘం రెడ్డి సుందర్ రాజు యాదవ్ మద్దతుగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి భాష బోయిన సంతోష్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్షిప్ బకాయిలను విడుదల చేయకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం వల్ల ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు కళాశాలలు బంద్ చేయడం వల్ల విద్యార్థుల చదువులకు తరచూ ఆటంకాలు కలుగుతున్న ప్రభుత్వం లో చలనం లేకపోవడం సిగ్గు చేటని,కాంగ్రెస్ ప్రభుత్వం ఫీజు రీయింబర్స్మెంట్ పథకాన్ని ఎత్తివేసే కుట్ర చేస్తూ ఫీజు బకాయిలు విడుదల చేయడం లేదని,సీఎం రేవంత్ రెడ్డి వద్ద విద్యా శాఖ ఉన్న ఫీజు బకాయిలు విడుదల చేయకపోవడం సీఎం నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు.మాజీ కూడా చైర్మన్, టీపీడీపీఎంఏ ఫౌండర్ ప్రెసిడెంట్, మాస్టర్ జి విద్యాసంస్థల అధినేతసంఘం రెడ్డి సుందర్ రాజు యాదవ్ మాట్లాడుతూ..కాంగ్రెస్ ప్రభుత్వం కనీసం వారు అధికారంలోకి వచ్చిన నాటి నుండి పెండింగ్ లో ఉన్న మరియు టోకెన్లు మంజూరు అయిన ఫీజు బకాయిలను విడుదల చేయడం ద్వారా ప్రభుత్వం పై భారం తగ్గుతుందని, వెంటనే ప్రభుత్వం కళాశాలల యాజమాన్యాలతో చర్చించి పెండింగ్ ఫీజు రీయింబర్స్మెంట్ స్కాలర్షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలన్నారు.హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు ఊట్కూరు ప్రణీత్ గౌడ్, జిల్లా ఉపాధ్యక్షులు కుక్కల కుమార్, వేల్పుల చరణ్, జిల్లా సహాయ కార్యదర్శి బొజ్జు జ్యోతి, జిల్లా సమితి సభ్యులు సిపతి వినయ్, టిపిడిపీఎంఏ నాయకులు 200 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

## వాటర్ ట్యాంక్ పైకెక్కి యువకుడు హల్ చల్



**ప్రజాపక్షం/కాళేశ్వరం:**జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కాళేశ్వరంలో సోమవారం ఉదయం మిషన్ భగీరథ వాటర్ ట్యాంక్ పైకి ఎక్కి ఓ స్థానిక యువకుడు హల్ చల్ సృష్టించాడు. వివరాలలోకి వెళితే కాళేశ్వరం గ్రామానికి చెందిన ముమ్మడి రాకేష్ అనే యువకుడు గత మూడేళ్లుగా స్థానిక బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో గోదావరి తీరం వద్ద నిర్వహిస్తున్న శ్రాద్ధ కర్మ పూజలకు సంబంధించిన తీర్థ పురోహితుడుగా విధులు నిర్వహిస్తున్నాడు. కాగా ఇటీవల గోదావరి వద్ద శ్రాద్ధ కర్మ తీర్థ విధులకు బ్రాహ్మణ సంఘం సభ్యులు తనను నిరాకరించారని మనస్థాపం చెందిన రాకేష్ పెట్రోల్ బాటిల్లను వెంట తీసుకుని వాటర్ ట్యాంక్ పైకి ఎక్కాడు.తన వెంట తీసుకెళ్ళిన పెట్రోల్ ఒంటిపై పోసుకొని ఆత్మహత్యకు చేసుకుంటానని హెచ్చరిస్తూ నిరసన గళం వినిపించాడు. సమాచారం అందుకున్న స్థానిక ఎస్ఐ తమాషా రెడ్డితో పాటు తన కుటుంబ సభ్యులు సంఘటన స్థలానికి చేరుకుని నచ్చచెప్పేందుకు ప్రయత్నించినా తన సమస్య పరిష్కారమయ్యే వరకు తాను ససేమిరా వాటర్ ట్యాంక్ పై నుండి దిగే ప్రసక్తి లేదని భీష్మించుకున్నాడు. సుమారు నాలుగు గంటల వరకు కొనసాగిన నిరసన హైడ్రామాతో స్థానికులంతా అక్కడికి చేరుకున్నారు. ఎట్టకేలకు బ్రాహ్మణ సంఘం సభ్యులు అక్కడికి చేరుకొని యధావిధిగా శ్రాద్ధ కర్మలు పూజలకు అనుమతిస్తున్నట్లు ప్రకటించడంతో రాకేష్ వాటర్ ట్యాంక్ పై నుండి కిందకు దిగి వచ్చాడు. దీంతో కథ సుఖాంతం కావడంతో అందరు ఊపిరి పీల్చుకున్నారు.



# స్థానికం
REGIONAL NEWS
ఖమ్మం భద్రాద్రి కొత్తగూడెం

## కాంగ్రెస్‌లో చేరికలు



**ప్రజాపక్షం/ మధిర :** డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క సతీమణి, మాటూరు గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరారు.ఎస్సికాలనీకి చెందిన ఎకితాల కృష్ణారావు, పుట్టా పుల్లారావు ఆధ్వర్యంలో పుట్టా కిరణ్, పుట్టా వెంకట్రామ, కంచిపోగు నాగేశ్వరరావు, కంచిపోగు మంగమ్మ, గొల్లమండల ముత్తయ్య, గొల్లమండల వెలిశమ్మ, రాయబరపు మోహన్, చిట్టెమ్మ, వేల్పుల మరియమ్మ, పుట్టా ఈరలమ్మ, పుట్టా మరియమ్మ, పందుల దానమ్మ, పుట్టా ఏసమ్మ పార్టీలో చేరగా వారిని పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క మధిర నియోజకవర్గ అభివృద్ధి ఆకర్షితులై పార్టీలో చేరినట్లు తెలిపారు. మండల కాంగ్రెస్ అధ్యక్షులు సూరంశెట్టి కిషోర్, సీనియర్ నాయకులు కర్నాటి రామారావు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేత



**ప్రజాపక్షం/ దుమ్ముగూడెం:** మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పలువురు వ్యక్తులు అనారోగ్యంతో వైద్యం పొందిన 14 మంది లబ్ది దారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను బుధవారం భద్రాచలం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో డా. తెల్లం వెంకట్రావ్ అందచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రతి పేదవానికి వైద్యం అందించాలనే లక్ష్యంతో ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక నిధులు కేటాయిస్తున్నారని ఆయన అన్నారు. అనంతరం అనారోగ్యంతో వివిధ ప్రైవేట్ ఆసుపత్రులలో వైద్యం పొందిన 14 మంది కుటుంబాలకు రూ.14 లక్షల 73 వేల రూపాయల చెక్కులను అందజేశారు. మండల అధ్యక్షులు లంకా శ్రీనివాస రావు,మట్టా వెంకటేశ్వరావు , కోడి చంటి, మోతుకూరి శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

## పెన్షన్స్ ను వెంటనే పెంచాలి

### తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా



**ప్రజాపక్షం/నేలకొండపల్లి:** కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలో భాగంగా పెన్షన్ ను వెంటనే పెంచాలని ఎమ్మార్పీఎస్ మండల ఇంచార్జ్ తోళ్ల సురేష్ డిమాండ్ చేశారు. పింఛన్లు వెంటనే పెంచాలని కోరుతూ ఎమ్మార్పీఎస్ మరియు అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. వినతి పత్రం తహశీల్దార్ కు అందించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయకపోతే ప్రత్యక్ష ఆందోళన చేస్తామని హెచ్చరించారు. సంఘం నాయకులు మాదాసు వెంకన్న, పొట్టపింజర బాలస్వామి, తోళ్ల వెంకన్న, వల్లమూడి హనుమంతరావు, గుండెపొంగు శ్రీకాంత్ పాల్గొన్నారు.

## నిరుపేదల కుటుంబాలకు మంత్రి భరోసా



**ప్రజాపక్షం/నేలకొండపల్లి:** నిరుపేదల కుటుంబాలకు అండగా మంత్రి శ్రీనివాస్ రెడ్డి భరోసా కల్పిస్తున్నారని నేలకొండపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ వెన్నపూసల సీతారాములు పేర్కొన్నారు. మండలం లోని వివిధ గ్రామాలలో ఇటీవల మృతి చెందిన పలు కుటుంబాలకు సోమవారం పీఆర్ఎస్ ఆత్మీయ భరోసా కింద ఆర్థిక సహాయం ను అందించారు. మృతుల కుటుంబాలకు రూ.10 వేల చొప్పున ఆర్థిక సహాయం ను అందించారు. నిరుపేదల సం క్షేమం కోసం మంత్రి శ్రీనివాసరెడ్డి అనేక కార్యక్రమాలు ఛేపడుతున్నట్లు తెలిపారు. పార్టీ నాయకులు కొడాలి గోవిందరావు, పెంటమళ్ల పుల్లమ్మ, వెంకన్న, శ్రీదేవి, వెంకటరెడ్డి, కొచ్చేర్ల శ్రీనివాసరావు, రాయపూడి నవీన్. కడియాల సరేష్ పాల్గొన్నారు.

## పెసరకు నష్టపరిహారం ఇవ్వాలి

### రైతు సంఘం మధిర డివిజన్ అధ్యక్షుడు దొండపాటి



**ప్రజాపక్షం/బోనకల్:** మండలంలో అధిక వర్షాలకు దెబ్బతిన్న పెసర పంటకు నష్టపరిహారం చెల్లించాలని తెలంగాణ రైతు సంఘం మధిర డివిజన్ అధ్యక్షులు దొండపాటి నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమస్యను పరిష్కరించాలని కోరుతూ వినతి పత్రాన్ని అందజేశారు. 400 ఎకరాల పెసర సాగు అధిక వర్షాలకు నష్టం వాటిల్లిందని, సాగు భూముల్లో రోజుల తరబడి నీరు నిలిచి పంట కుళ్లిపోయిందని అన్నారు. నష్టం అంచనాను తక్షణమే వ్యవసాయ అధికారులు పరిశీలించి ప్రభుత్వం నుంచి నష్టపరిహారం అందేలా కృషి చేయాలని సూచించారు. రైతు ఆరు కాలం శ్రమించి అధిక వర్షాలకు నిలదొక్కుకొని పండిన పెసరను అయినా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రూ.8500 చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దళారులు కేవలం 3 వేలు నుంచి రూ.3500 మాత్రమే చెల్లించి రైతులను దొచుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సిపిఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు, సిపిఎం మండల కార్యదర్శి కిలారి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి ప్రజావాణి

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఖమ్మం నగర పాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య తెలిపారు. సోమవారం ఖమ్మం కార్పోరేషన్ కార్యాలయంతో పాటు బల్లేపల్లి నార్త్ జోన్ కార్యాలయం, సౌత్ జోన్ పాత మున్సిపల్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. సౌత్, నార్త్ జోన్ కార్యాలయాల్లో ప్రజావాణి ద్వారా ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించి సంబంధిత అధికారులు సమస్యల పరిష్కారానికి సమన్వయంతో పని చేయాలని సూచించారు. ప్రజావాణిలో 34 దరఖాస్తులు వచ్చినట్లు కమిషనర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ అనిల్ కుమార్, అధికారులు పాల్గొన్నారు.

# అంబేద్కరిజం, కమ్యూనిజం ఒక్కటే

### దళితుల హక్కులకు పోరాడింది కమ్యూనిస్టు పార్టీ
### కులాల ఉచ్చులో పడొద్దు హక్కులకై పోరాడాలి
### అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన కూనంనేని



**ప్రజాపక్షం/పాల్వంచ :** చదువు, చదివించు, సమీకరించు, పోరాడు అనేది అంబేద్కర్ సిద్ధాంతమని, అంబేద్కర్ రచనలు, కమ్యూనిస్టు సిద్ధాంతం ఒక్కటేనని, దళితుల హక్కుల కోసం మొదటి నుండి పోరాడింది, పోరాడుతున్నది భారత కమ్యూనిస్టు పార్టీయే అని ఎంఎల్ఏ కూనంనేని సాంబశివరావు అన్నారు. పాల్వంచ మున్సిపాలిటీ పరిధి సీతారామపట్నంలో అంబేద్కర్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహాన్ని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె. సాబీర్‌పాషా,టిపిసిసి సభ్యులు నాగి తారాములుతో కలిసి సోమవారం ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో కూనంనేని మాట్లాడుతూ ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా దేశంలో కులాలు ఉన్నాయని అన్నారు. గతంలో ఓ వర్గం బలంగా ఉండటంతో ప్రజలను కులాలుగా విభజించారని, వారి అభివృద్ధి గుంగలో తొక్కారని ఆరోపించారు.భారత దేశంలో కమ్యూనిస్టుపార్టీ ఆవిర్భవించి వంద సంవత్సరాలు అయిందని అప్పటి నుండి ప్రజల హక్కుల కో సం, వాటిని సాధించటానికి పోరాడింది, పోరాడుతున్నది కమ్యూనిస్టు పార్టీ మాత్రమే అన్నారు. దళితవాడలో ఉన్నది కమ్యూనిస్టులు, వారితో సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేసి అందరూ ఒక్కటేనని అన్నది కమ్యూనిస్టు పార్టీ మాత్రమేనన్నారు. స్వాతంత్య్రం సిద్ధించిన అనంతరం గాంధీజీ, నెహ్రూ, సుభాష్ చంద్రబోస్ విగ్రహాలు ఉండేవని కమ్యూనిస్టులు మాత్రం భగత్‌సింగ్ విగ్రహాలు పెట్టేవారు. అనంతరం వర్గ చైతన్యం, అస్తిత్వం, సామాజిక చైతన్యం కలిగిన వారు రాజ్యాంగంలో పొందుపరిచిన సూత్రాలను, ప్రాథమిక హక్కుల గురించి చదివిన వారు ప్రజలను చైతన్యం చేశారు. అంబేద్కర్ విలువలను గుర్తించారని చెప్పారు. దీనితో దేశ వ్యాప్తంగా లక్షల సంఖ్యలో అంబేద్కర్ విగ్రహాలను ఏర్పాటు చేశారని అన్నారు.దళితులే కాదు ఈ రోజు అంబేద్కర్ పేరు చెప్పని వారు లేరనటంలో సందేహం లేదన్నారు.రాజ్యాంగంపై ప్రమాణం చేసే ప్రతీ ఒక్కరు అంబేద్కర్ గుర్తు చేసుకోవాల్సిందే. చదువు, చదివించు, సమీకరించు, హక్కుల కోసం పోరాడు అనే సిద్ధాంతాన్ని ఆచరించాలని కమ్యూనిస్టు పార్టీ సిద్ధాంతమన్నారు. రాజ్యాంగం రచన ప్రక్రియ మొదలు పెట్టింది 1948 అయితే అమలులోకి వచ్చింది 26 జనవరి 1950 అని అన్నారు. ప్రపంచంలో కమ్యూనిస్టులు పుట్టింది 105 ఏండ్ల క్రితమని, దేశంలో ఆవిర్భవించినది 100 సంవత్సరాలు అయిందన్నారు. రాజ్యాంగానికి ముందే దళితుల హక్కుల కోసం ఆనాటి నుండే కమ్యూనిస్టు పార్టీనే పోరాటం చేసిందన్నారు. మనం మన హక్కుల కోసమే పోరాడాలి కానీ కులం కోసం వద్దని చెప్పారు.లేనిచో కులాల మధ్య విభజన రేఖతో సమాజం మరింత ప్రమాదంలో పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. మనమంతా హక్కుల కోసం పోరాడాలి, ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. అనంతరం నిర్వాహకులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల విశ్వనాథం, సిపిఐ మండల కార్యదర్శి వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, టిజిఎస్ జిల్లా అధ్యక్షులు దేవదానం, దొప్పలపూడి సురేష్‌బాబు, శనగ వెంకటేశ్వర్‌రావు, నాయకులు కల్యా భాస్కర్, ప్రకాష్, నల్లమల్ల సత్యం, బిల్లా సృజిత్, రైడా, దుర్గా ప్రసాద్, ధర్మరాజు, శ్యామ్, రామారావు, గుండాని శ్రీను, పంతగ వెంకటేశ్వర్లు, నారాయణ, దాసరి రమేష్, తీట్ల వెంకటేశ్వర్లు,అశోక్, రాజు, కళ్యాణ్, చాణక్య, గౌతం, బిల్లా సృజిత్ పాల్గొన్నారు.


# ప్రతీ పల్లె ప్రగతి వైపు పరుగులు

### గ్రామగ్రామానికి పక్కా రహదారుల నిర్మాణం
### రవాణా సౌకర్యం మెరుగుపడితేనే అభివృద్ధి
### ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు
### రూ.4.29 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన,



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** ప్రజలకు కావాల్సిన విద్యా,వైద్యం, రహదారులు,విద్యుత్ వంటి మౌలిక సదుపాయాలు కల్పించి ప్రగతివైపు ప్రతీ పల్లెను పరుగులు పెట్టిస్తామని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎంఎల్ఏ కూనంనేని సాంబశివరావు అన్నారు. లక్ష్మీ దేవిపల్లి మండలం హేమచంద్రాపురం, కోరుకొండ, లోతువాగు, ప్రశాం తినగర్, శేషగిరి నగర్, తెలగ రామవరం పంచాయితీల పరిధిలోని పలు గ్రామాల్లో రూ.4.29కోట్ల ఎస్‌సిపి, ఎన్ఆర్ఈజిఎస్ పథకాల్లో మంజూరైన నిధులతో చేపట్టిన రోడ్లు, డ్రైన్లు, ప్రభుత్వ భవనాలు, కల్వర్టుల నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేయడంతో పాటు పూర్తయిన పనులను సోమవారం ప్రారంభించారు. ప్రధాన రహదారుల నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి సారించించామని, ద శల వారీగా పనులు పూర్తి చేస్తామని చెప్పారు. మెరుగుపడిన నాడే గ్రామాలు అనుకున్న మే రకు అభివృద్ధి సాధిస్తాయని చెప్పారు. ప్రతీ గ్రామం పంచాయితీ కేంద్రాల్లో హెల్త్ సెంటర్లు, అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాలలు, గ్రామపంచాయితీ కార్యాలయాలు, కమ్యూనిటీ హాళ్లు, ప్రభుత్వ సేవా కేంద్రాలకు సొంత భవనాలు ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా, జిల్లా కార్యవర్గ స భ్యులు చంద్రగిరి శ్రీనివాసరావు, కంచర్ల జమలయ్య, సి పిఐ మండల కార్యదర్శి లక్ష్మీ పతి, నునావత్ గో విండ్, కాంగ్రెస్ నాయకులు నాగ సీతారాములు, చౌదరి, వీరబా బు, హన్మంతరావు, పీఏసిఎస్ ఉపాధ్యక్షులు కూచిపూడి జ గన్, కాం గ్రెస్ నాయకులు పూనెం శ్రీనివాస్, అధికారులు అం కుబా బు, శిరీష, శ్రీనివాసరావు, రామకృష్ణ, రఘురామయ్య, వెంకటస్వామి, అమ్మసాంబయ్య, శివలాల్ పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయికి ఎంపికైన త్రివేణి విద్యార్థి



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :**నేషనల్ సైన్స్ సెమినార్ 2025 రాష్ట్ర స్థాయి పోటీలకు త్రివేణి పాఠశాల విద్యార్థి కె. వనీషారెడ్డి ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్ తెలిపారు. నేషనల్ సైన్స్ సెమినార్ 2025 జిల్లా స్థాయి పోటీల్లో కె. వనీషారెడ్డి మొదటి స్థానం సాధించి రాష్ట్ర స్థా యికి ఎంపికైందన్నారు. వనీషారెడ్డిని ము ఖ్య అతిథిగా హాజరైన ఖమ్మం అర్బన్ ఎం ఈవో శైలజ లక్ష్మి, నేషనల్ చిల్డ్రన్ సైన్స్ కాంగ్రెస్ డిస్ట్రిక్ కో ఆర్డినేటర్ ఇనుముల వెంకటేశ్వర్లు, జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి కె. రామారావు, జీవశాస్త్ర జిల్లా రిసోర్స్ పర్సన్ మాధవరా వు, ఉపాధ్యాయులు అభినందించారు.

# అక్రమ కేసులపై జర్నలిస్టుల నిరసన

### -టిజెఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళన
### -మద్దతు ప్రకటించి ఆందోళనలో పాల్గొన్న ఐజెయు



**ప్రజాపక్షం/ ఖమ్మం :** జర్నలిస్టులపై అక్రమ కేసుల నమోదును నిరసిస్తూ ఖమ్మంలో జర్నలిస్టులు ప్రదర్శన నిర్వహించి అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. సోమవారం ఖమ్మం జెడ్పి కార్యాలయం నుండి అంబేద్కర్ విగ్రహం వరకు ప్రదర్శన నిర్వహించారు. భారీ సంఖ్యలో హాజరైన జర్నలిస్టులు అక్రమ కేసులను తక్షణం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. టిజెఎఫ్ జిల్లా అధ్యక్షులు ఆదినారాయణ మాట్లాడుతూ ఉద్దేశ్యపూర్వకంగానే కేసులు నమోదు చేశారన్నారు. జర్నలిస్టుల విధులకు ఆటంకం కలిగించడం సరైన చర్య కాదని ఇప్పటికైనా అధికారులు పునః పరిశీలన చేయాలని ఆయన కోరారు. కేసులు ఉపసంహరించు కోకపోతే తమ ఆందోళనను ఉధృతం చేస్తామని ఆయన తెలిపారు. టియుడబ్ల్యూజె (ఐజెయు) జిల్లా అధ్యక్షులు ఏనుగు వెంకటేశ్వరరావు, టిజెఎఫ్ జిల్లా కార్యదర్శి చిర్రా రవి, ఐజెయు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మాటేటి వేణుగోపాల్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు నర్వనేని వెంకట్రావు, ఐజెయు ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం. భూపాల్, మహేందర్, జర్నలిస్టు హౌజింగ్ సొసైటీ అధ్యక్షులు కనకం సైదులు, జిల్లా కోశాధికారి శివానంద, నగర అధ్యక్షులు చెరుకుపల్లి శ్రీనివాస్, ప్రెస్‌క్లబ్ కార్యదర్శి శీలం శ్రీనివాస్, మీడియా ప్రతినిధులు శ్రీధర్, నారాయణ, సత్యనారాయణ, వీడియో జర్నలిస్ట్ అసోసియేషన్ నాయకులు అప్పారావు, సంపత్, సుధాకర్, టిజెఎఫ్ నాయకులు బొల్లం శ్రీనివాస్, వనం నాగయ్య, ప్రశాంత రెడ్డి, శెట్టి రజనీకాంత్, అడపాల నాగేందర్, హరీష్, వెంకటరమణ, రమేష్ బాబు, రాంబాబు, ఉదయ్, చక్రవర్తి, కోటేశ్వరరావు, జగదీష్, విజేత, నరేందర్, గోపి తదితరులు పాల్గొన్నారు.

# చెరగని ఉద్యమ వారసత్వం

### సాయుధ పోరాటానికి దన్నుగా నిలిచిన పల్లెలు




**ప్రజాపక్షం/ ఖమ్మం :** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం సువర్ణక్షార లిఖితం ఇటువంటి మహత్తర తెలంగాణ పోరాటంలో ఖమ్మం జిల్లాకు ఒక ప్రత్యేకత ఉన్నది ఆనాడు ఉద్యమంలో ముందు వరుసలో నిలవటమే కాకుండా నేటికి ఉద్యమ వారసత్వాన్ని కొనసాగిస్తున్నది. ఖమ్మంజిల్లాలోని అనేక పల్లెలు ఉద్యమానికి బాసటగా నిలిచాయి. గ్రామాలకు గ్రామాలే తిరుగుబాటుకు శ్రీకారం చుట్టాయి. ఆనాటి నిరంకుశత్వాన్ని, పెత్తందారి తనాన్ని, వెట్టిచాకిరిని నిరసిస్తూ ఉవ్వెత్తున లేచిన మహోద్యమంలో అప్పటి ఖమ్మం మెట్టు అగ్రభాగాన నిలిచింది. ఏజెన్సీ, మైదానం అనే తేడా లేకుండా నిజాం, రజాకారుల, ముష్కరుల ఆగడాలను ఎదుర్కొన్నది. అప్పట్లో చండ్ర రాజేశ్వరరావు, పుచ్చలపల్లి సుందరయ్య లాంటి వారు ఖమ్మం జిల్లా కేంద్రంగా ఉద్యమాలను నడిపించారు. కామ్రేడ్ నల్లమల గిరిప్రసాద్, దేవూరి శేషగిరిరావు, సర్వదేవభట్ల రామనాథం ఉద్యమ అగ్రభాగాన సాయుధులై పోరాడారు. చిర్రావూరి లక్ష్మినారాయణ, కెఎల్ నర్సింహారావు, పర్సా సత్యనారాయణ లాంటి వారు కూడా ఉద్యమంలో ముందు నడిచారు. విద్యార్థిగా ఉండి కమ్యూనిస్టు పార్టీ శిక్షణా తరగతులకు హాజరైన నల్లమల గిరిప్రసాద్ ఆతర్వాత సాయుధ దళ నేతగా ఎదిగారు. తుపాకీ గుండ్లకు సైతం ఎదురొడ్డి నిలిచిన నల్లమల గిరిప్రసాద్ అనంతర కాలంలో కమ్యూనిస్టు పార్టీ అగ్రనాయకునిగా ఎదుగడమే కాకుండా ఎంఎల్‌ఏగా, రాజ్యసభ సభ్యునిగా పనిచేశారు. సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ వ్యవస్థాపకుల్లో ఒకరైన దేవూరి శేషగిరిరావు ఉద్యమ సమయంలోనే ప్రాణాలను కోల్పోయారు. దేవూరి శేషగిరిరావు పేరులోని గిరిని తన ముందు ఉంచుకుని నల్లమల ప్రసాద్ నల్లమల గిరిప్రసాద్‌గా చిరపరిచితులయ్యారు. సర్వదేవభట్ల రామనాథం జమీందారి కుటుంబంలో జన్మించి ప్రజల కోసం సర్వం త్యాగం చేసిన మహోన్నతుడు. వాసిరెడ్డి వెంకటపతి, రావెళ్ల జానకిరామయ్య, కర్నాటి కృష్ణయ్య, వట్టికొండ రాంకోటయ్య, చుండూరు నర్సింహారావు, మల్లెల వెంకటేశ్వర్లు, తమ్మారపు గోవింద్, మచ్చా వీరయ్య, రావెళ్ల సత్యం, బోడేపూడి రాంకోటేశ్వరరావు, గడల సీతారామయ్య, కొమరయ్య, రాములు, రాజేశ్వరరావు తదితరులు ఉద్యమ అగ్రభాగాన నిలిచి దళ కమాండర్లుగా పని చేశారు. మహ్మద్ రజబ్‌అలీ సామాన్య రైతు కుటుంబంలో జన్మించిన తన ప్రభుత్వ ఉద్యోగాన్ని సైతం వదిలి సాయుధ పోరాటంలో చురుకైన పాత్ర నిర్వహించారు. కమ్యూనిస్టు పార్టీ సభ్యులుగా అనేక పోరాటాలకు ఆయన నాయకత్వం వహించారు. సిపిఐ పక్షాన ఐదుసార్లు శాసనసభకు ఎన్నికయ్యారు. ముఖ్యంగా బండి పట్టాల ఉద్యమం జక్కేపల్లి రైతు సదస్సు విజయవంతానికి రజబ్‌అలీ చేసిన కృషి చిరస్మరణీయం. కర్నాటి కృష్ణయ్య సాయుధ పోరాట అనంతరం భారత కమ్యూనిస్టు పార్టీ నాయకునిగా, రైతు సంఘం నాయకునిగా, ఖమ్మం శాసన సభ్యునిగా పని చేశారు.

# నైజాం నవాబును గద్దె దించిన చరిత్ర కమ్యూనిస్టులది

### సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జితేందర్ రెడ్డి



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** భూమి కోసం, భుక్తి కోసం, పీడిత జన విముక్తి కోసం దున్నేవాడికే భూమి కావాలని సాగిన మహత్తర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం ప్రపంచానికి ఆదర్శమని సిపిఐ ఖమ్మం జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్ రెడ్డి అన్నారు. రైతాంగ తెలంగాణ సాయుధ పోరాట వార్షికోత్సవ సభ సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు దండు ఆదినారాయణ అధ్యక్షతన శనివారం సత్తుపల్లి మండలం యాతాల కుంట గ్రామంలో దివంగత కొర్సా జోగయ్య, పెంటమ్మల స్థూపం వద్ద జరిగింది. ఈ కార్యక్రమానికి ఖమ్మం జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై జెండా ఆవిష్కరించి, వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.అనంతరం జరిగిన సభలో జమ్ముల మాట్లాడుతూ రావి నారాయణ రెడ్డి ,బద్దం ఎల్లారెడ్డి, ముద్దమ యుద్ధం లాంటి ఎందరో మహనీయులు ఆనాటి నైజాంను గద్దె దించటానికి సాగించిన మహత్తర తెలంగాణ సాయుధ పోరాటం, తెలంగాణలో సామాన్య ప్రజలను సైతం సాయుదులుగా చేసి, బాంచన్ దొర నీ కాళ్ళు మొక్కుతా అన్న ప్రజల చేత, బందూకులు చేత పట్టించిందన్నారు. చాకలి ఐలమ్మ, దొడ్డి కొమరయ్య ,బందగి లాంటి సామాన్య ప్రజలను సైతం అసమాన్యులుగా మార్చి సాగించిన విరోచిత పోరాటం ఎన్నటికీ మరువజాలదని, అట్టి పోరాట చరిత్రను నేటి తరానికి తెలియజేసేందుకు సభలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు సింగు నరసింహారావు మాట్లాడారు.

## ఘనంగా మోక్షగుండం జయంతి వేడుకలు



**ప్రజాపక్షం/కొత్తగూడెం టౌన్:** సోమవారము సింగరేణి కాలరీస్ కార్పొరేట్ ఏరియా సివిల్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో హెడ్డాఫీస్ ఎదురుగా గల మోక్ష గుండం విశ్వేశ్వరయ్య చౌక్ లో మన భారత దేశం గర్వించే సివిల్ ఇంజినీర్ భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య 165 వ జయంతి 58 వ ఇంజనీర్స్ డే వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలలో సంస్థ డైరెక్టర్ పిపి కే.వెంకటేశ్వర్లు వివిధ విభాగాల జనరల్ మేనేజర్లు అధికారులు, యూనియన్ నాయకులు పాల్గొని మోక్షగుండం విశ్వేశ్వరయ్య కాంశ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వేడుకలలో పాల్గొన్న ఇంజనీర్ లను, ఇతర అధికారులను ఉద్దేశించి డైరెక్టర్ పిపికే.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, మోక్షగుండం విశ్వేశ్వరయ్య చాలా నిరాడంబరమైనటువంటి స్థాయి నుంచి ప్రపంచం గర్వించదగ్గ ఇంజనీర్లలో ఒకరుగా ఎదగడం భారతదేశానికి ఎంతో గర్వకారణం అన్నారు.

## పాఠశాలను సందర్శించిన జిల్లా కలెక్టర్

**ప్రజాపక్షం/అశ్వాపురం:**అశ్వాపురం మండలంలోని బంజర నెల్లిపాక ప్రాథమిక పాఠశాలను భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ సందర్శించారు. ఈసందర్భంగా జిల్లాలోని విత్తనాల సేకరణ బరువు తదితర అంశాలలో మండలంలోని బంజర నెల్లిపాక ప్రాథమిక పాఠశాల మొదటి స్థానంలో నిలిచిందని వాటి విషయంలో విత్తనాల సేకరణ బరువు తదితర విషయాలని ప్రధానోపాధ్యాయురాలు విమలను, మండల విద్యాశాఖ అధికారి వీరస్వామి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు విమలను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారిని ప్రశంసించారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో రవీందర్, తహసీల్దార్ మనిధర్, రెవిన్యూ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# ఆడపిల్లల గురించి పవన్ కళ్యాణ్ చెప్పిన మాటలతో 'బ్యూటీ'

అంకిత్ కొయ్య,నిలఖి హీరో హీరోయిన్లుగా విజయ్ పాల్ రెడ్డి అడిదల, ఉమేష్ కుమార్ భన్సల్ సంయుక్తంగా నిర్మించిన చిత్రం 'బ్యూటీ'. జీ స్టూడియోస్, మారుతీ టీం ప్రొడక్ట్స్, వానర సెల్యూలాయిడ్ సంయుక్తంగా 'బ్యూటీ' మూవీని నిర్మించారు. ఈ సినిమాకు 'గీతా సుబ్రమణ్యం', 'హలో వరల్డ్', 'భలే ఉన్నాడే' ఫేమ్ జె.ఎస్.ఎస్. వర్ధన్ మాటలు, దర్శకత్వ బాధ్యతల్ని నిర్వహించారు. ఈ సినిమాకు కథ, స్క్రీన్ప్లేని ఆర్.వి. సుబ్రహ్మణ్యం అందించారు. ఈ చిత్రం సెప్టెంబర్ 19న విడుదల కాబోతోంది.విడుదల తేదీ దగ్గర పడుతున్న క్రమంలో ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్టార్ డైరెక్టర్ మారుతి, ఎస్ కే ఎన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మారుతి మాట్లాడుతూ ఇద్దరు ఆడపిల్లల తండ్రిగా ఆ ఫాదర్ ఫీలింగ్స్ను పేపర్ మీద పెట్టారని నాకు అనిపించింది. ఆ కథను నిమ్మకాయల ప్రసాద్ విన్నారు. సెప్టెంబర్ నెల బాగా కలిసి వస్తోంది. ప్రస్తుతం 'లిటిల్ హార్ట్స్' బాగా ఆడుతోంది.. 'మిరాయ్' హిట్ అయింది.. ఇప్పుడు 'బ్యూటీ' వస్తోంది.. 'ఓజీ' ఎలా ఉండోబోతోందో నాకు తెలుసు. మధ్యలో 'బ్యూటీ'ని చూడండి. ఆడపిల్లల గురించి పవన్ కళ్యాణ్ చెప్పిన మాటలతో, యథార్థ సంఘటనలతో 'బ్యూటీ' కథను రాశారు. సెప్టెంబర్ 19న థియేటర్లోకి రాబోతోంది అని అన్నారు.

ఎస్కేఎన్ మాట్లాడుతూ మామూలు టికెట్ రేట్లతో సినిమాలు వస్తే జనాలు థియేటర్లకు వస్తున్నారని సినీ పెద్దలు గుర్తించాలి. 'బ్యూటీ' కథ నాకు చాలా ఇష్టం. . సెప్టెంబర్ 19న 'బ్యూటీ' చిత్రం రాబోతోంది. 18న పెయిడ్ ప్రీమియర్లు వేస్తున్నారు. అమీర్ పేట్ ఏఏఏ లో నేను ఫ్రీ షో వేయిస్తాను. ఓ అమ్మాయి.. తన ఫ్యామిలీతో కలిసి వచ్చిన ఆ షోని చూడొచ్చు' అని అన్నారు. ఈ కార్యక్రమంలో హీరో అంకిత్ కొయ్య, డైరెక్టర్ జె.ఎస్.ఎస్. వర్ధన్ , నిర్మాత విజయ్ పాల్ రెడ్డి అడిదల, నటుడు వీకే నరేష్, నటి వాసుకి , హీరోయిన్ నిలఖి, నిమ్మకాయల ప్రసాద్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ బి.ఎస్ రావు, మ్యూజిక్ డైరెక్టర్ విజయ్ బుల్గానిన్ పాల్గొన్నారు.



# 'ఉస్తాద్ భగత్ సింగ్' షూటింగ్ పూర్తి



పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ కథానాయకుడిగా హరీష్ శంకర్ దర్శకత్వంలో రూపొందుతోన్న చిత్రం 'ఉస్తాద్ భగత్ సింగ్'. 'గబ్బర్ సింగ్' వంటి సంచలన విజయం తరువాత పవన్ కళ్యాణ్ హరీష్ శంకర్ కలయికలో వస్తున్న ఈ మాస్ యాక్షన్ ఎంటర్టైనర్ పై అంచనాలు తారాస్థాయిలో ఉన్నాయి. ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ భారీ స్థాయిలో నిర్మిస్తున్నారు. తాజాగా చిత్ర బృందం భారీ షెడ్యూల్ను విజయవంతంగా ముగించింది. దీంతో పవన్ కళ్యాణ్ తన భాగం చిత్రీకరణను పూర్తి చేశారు.ఈ కీలకమైన షెడ్యూల్ను పూర్తి చేయడానికి నటీనటులు, సిబ్బందితో కలిసి దర్శకుడు హరీష్ శంకర్ అహర్నిశలు శ్రమించారు. టాకీ పార్ట్లో ఎక్కువ భాగం పూర్తి కావడం, షూటింగ్ సజావుగా సాగడం పట్ల నిర్మాతలు తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. 'ఉస్తాద్ భగత్ సింగ్' సినిమాపై నెలకొన్న ఆకాశాన్ని తాకే అంచనాలను అందుకునేందుకు చిత్ర బృందం అన్ని విధాలుగా కృషి చేస్తోంది. రాక్స్టార్ దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు. రామ్‌లక్ష్మణ్ ద్వయం యాక్షన్ సన్నివేశాలకు కొరియోగ్రఫీ చేస్తున్నారు. అయనంక బోస్ ఛాయాగ్రాహకుడిగా వ్యవహరిస్తుండగా, నీతా లుల్లా కాస్ట్యూమ్స్ బాధ్యతలను నిర్వర్తిస్తున్నారు. కళా దర్శకుడిగా ఆనంద్ సాయి వ్యవహరిస్తున్నారు. పవన్ కళ్యాణ్ అభిమానులతో పాటు.. మాస్ ప్రేక్షకులు, యాక్షన్ ప్రియులు మెచ్చేలా ఈ చిత్రాన్ని మలుస్తున్నారు.పవన్ కళ్యాణ్, శ్రీలీల, రాశి ఖన్నా కథానాయికలుగా నటిస్తున్నారు. పార్థిబన్, కె.ఎస్. రవికుమార్, ఎల్ బి శ్రీరామ్, రాంకీ, ప్రభాస్ శ్రీను, సత్యం రాజేష్, జయ ప్రకాష్, వర్గీస్, మీర్ సర్వర్, ప్రవీణ్, టెంపర్ వంశీ, నవాబ్ షా, శ్రీరామ్, మాగంటి శ్రీనాథ్, కిల్లి క్రాంతి తదితరులు ఇతర ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు.

ఈ చిత్రానికి **కథనం:** కె. దశరథ్, రమేష్ రెడ్డి,
**రచనా సహకారం:** ప్రవీణ్ వర్మ, సి. చంద్రమోహన్,
**ఛాయాగ్రహణం:** అయనంక బోస్,
**కూర్పు:** కార్తీక శ్రీనివాస్. ఆర్,
**కళ:** ఆనంద్ సాయి,
**ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్స్:** దినేష్ నరసింహన్, హరీష్ పై,
**ఫైట్స్:** రామ్‌లక్ష్మణ్, నబకాంత మాస్టర్, దర్శకత్వం హరీష్ శంకర్ .



# 'యంగ్ అండ్ డైనమిక్' మూవీ ట్రైలర్ లాంచ్




టాలెంటెడ్ హీరో శ్రీ రామ్ నటిస్తున్న సినిమా 'యంగ్ అండ్ డైనమిక్'. ఈ సినిమాలో మిథున ప్రియ హీరోయిన్ గా నటిస్తోంది. పి.రత్నమ్మ సమర్పణలో శ్రీరామ్ ప్రొడక్షన్ బ్యానర్ పై శ్రీరామరాజు, లక్ష్మణరావు ఈ సినిమాను నిర్మిస్తున్నారు. కిషోర్ శ్రీ కృష్ణ దర్శకత్వం వహిస్తున్నారు. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుపుకుంటున్న 'యంగ్ అండ్ డైనమిక్' సినిమా త్వరలో గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. తాజాగా ఈ చిత్ర ట్రైలర్ లాంచ్ ఈవెంట్ హైదరాబాద్ లో ఘనంగా జరిగింది. ప్రముఖ దర్శకులు వీరశంకర్, వీఎన్ ఆదిత్య, సముద్ర ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరై ట్రైలర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దర్శకుడు కిషోర్ శ్రీ కృష్ణ మాట్లాడుతూ నేను దాసరి శిష్యుడిని. నా మొదటి సినిమా మైండ్ గేమ్. ఆ సినిమా హీరో శ్రీరామ్ తోనే చేశాను. ఇప్పుడు 'యంగ్ అండ్ డైనమిక్' రూపొందిస్తున్నాను. విలేజ్ బ్యాక్ డ్రాప్ లో సాగే చిత్రమిది. ఒక రౌడీ ఊరిని ఎలా నియంత్రిస్తాడు. ఆ రౌడీ మంచివాడుగా మారితే ఊరికి కలిగే లాభమేంటి అనేది ఈ సినిమాలో ఆసక్తికరంగా తెరకెక్కించాం. ఈ సినిమా ఇంత బాగా రూపొందడానికి బ్రదర్ హీరో శ్రీరామ్ కారణం. త్వరలోనే చిత్రాన్ని విడుదలకు తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నాం. మా మూవీని మీరంతా ఆదరిస్తారని కోరుకుంటున్నా. అన్నారు. డైరెక్టర్ వీఎన్ ఆదిత్య మాట్లాడుతూ చిన్న సినిమాకు మంచి జరగాలి, వాళ్ల కోసం రెండు మంచి మాటలు చెప్పాలనే ఇక్కడికి వచ్చాను. 'యంగ్ అండ్ డైనమిక్' ట్రైలర్ బాగుంది. ఇందులో మాస్ డైలాగ్స్ ఆకట్టుకున్నాయి. హీరో శ్రీరామ్ ఫైట్స్ బాగా చేశారు. ఇలాంటి మాస్ చిత్రాలు ప్రేక్షకాదరణ పొందిన చరిత్ర టాలీవుడ్ కు ఎంతో ఉంది. ఈ సినిమాకు కూడా విజయం సాధించాలి. హీరో శ్రీరామ్ గారు పది చిత్రాల్లో నటించారు. 'యంగ్ అండ్ డైనమిక్' సినిమాతో హీరోగా ఆయన మరింత పేరు తెచ్చుకుంటారని ఆశిస్తున్నా. అన్నారు. డైరెక్టర్ వీరశంకర్ మాట్లాడుతూ పెద్దలు, పూజ్యులు దాసరి, రామానాయుడు చిన్న చిత్రాలను ఎంతో ఎంకరేజ్ చేసేవారు. ఎవరు చిన్న సినిమా చేస్తున్నా వారికి సపోర్ట్ చేసేవారు. ఆ గొప్ప సంప్రదాయాన్ని పాటించాలనే ఈ కార్యక్రమానికి అతిథిగా వచ్చి చిన్న చిత్రాన్ని సపోర్ట్ చేస్తున్నాను. చిన్న సినిమా బాగుంటనే ఇండస్ట్రీలో అందరికీ ఉపాధి దొరుకుతుంది. ఇండస్ట్రీ బాగుంటుంది. 'యంగ్ అండ్ డైనమిక్' చిత్ర ట్రైలర్, సాంగ్ బాగుంది. హీరోగా శ్రీరామ్ మెప్పించాడు. నిర్మాతలు మరిన్ని సినిమాలు తీసి ఇండస్ట్రీలో స్థిరపడాలి. 'యంగ్ అండ్ డైనమిక్' సినిమా మంచి విజయం సాధించాలని కోరుకుంటున్నా. అన్నారు.

# సినిమా నిర్మాణం ఇక సులభతరం

## షూటింగ్ కు సింగిల్ విండో అనుమతి

## ఎఫ్.డి.సి చైర్మన్ దిల్ రాజు



**హైదరాబాద్:** తెలంగాణా రాష్ట్రంలో సినిమాల చిత్రీకరణ, సినిమాల చిత్రీకరణలకు కావాల్సిన పలు అనుమతులు, సినిమా థియేటర్ ల నిర్వహణకు పొందాల్సిన అనుమతులు, సినీ రంగాభివృద్ధికి కావాల్సిన అనుమతులన్నీ సింగిల్ విండో ద్వారా పొందేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ఒక వెబ్ సైట్ రూపొందిస్తోందిని ఎఫ్డిసి చైర్మన్ దిల్ రాజు తెలిపారు. ఈ సులభతర అనుమతులపై రూపొందిస్తున్న ప్రత్యేక వెబ్ సైట్ 'ఫిలిమ్స్ ఇన్ తెలంగాణ'పై సోమవారం సంబంధిత శాఖలు, ఫిలిం ఇండస్ట్రీ ప్రతినిధులతో ప్రత్యేక వర్క్‌షాప్ జరిగింది. బేగంపేట్‌లోని టూరిజం ప్లాజాలో జరిగిన ఈ వర్క్‌షాప్‌కు తెలంగాణా ఫిలిం డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దిల్ రాజు, తెలంగాణ ఎఫ్డిసి మేనేగింగ్ డైరెక్టర్ సిహెచ్ ప్రియాంక, టూరిజం కార్పొరేషన్ ఎండి వల్లూరు క్రాంతిలతోపాటు వివిధ శాఖల ఉన్నతాధికారులు, రాష్ట్ర చలన చిత్ర పరిశ్రమ ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎఫ్డిసి చైర్మన్ దిల్‌రాజు మాట్లాడుతూ, రాష్ట్రంలో సినీ పరిశ్రమ అభివృద్ధికి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్ని రకాల చేయూతనిస్తున్నారని, ఈ సదావకాశాన్ని సినీ పరిశ్రమ పూర్తి స్థాయిలో ఉపయోగించుకోవాలన్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయి సినీ నిర్మాతలు కేవలం స్క్రిప్ట్‌తో వస్తే వారి సినిమా నిర్మాణానికి కావాల్సిన షూటింగ్ లొకేషన్లు, వారికి వివిధ శాఖలనుండి కావాల్సిన అనుమతులు, సినీ నిర్మాణానికి సంబంధించించిన సాంకేతిక విభాగాలు, టెక్నీషియన్లు, హైదరాబాద్‌తోపాటు రాష్ట్రంలోని వివిధ నగరాల్లో అందుబాటులో ఉన్న హోటళ్లతో పాటు సంపూర్ణ సమాచారంతో ఈ వెబ్ సైట్ రూపొందిస్తున్నామన్నారు. ఒక విధంగా చెప్పాలంటే, ఈవిధమైన సౌలభ్యం మొట్టమొదటిసారిగా తెలంగాణలో మాత్రమే రూపొందిస్తున్నామని దిల్ రాజు అన్నారు. దీనితోపాటు, సినిమా థియేటర్ల నిర్వహణకు కావాల్సిన బీఫామ్ జారీ విధానాన్ని కూడా ఆన్లైన్ ద్వారా పొందే సులభతరం విధానాన్ని ప్రవేశపెడుతున్నామని పేర్కొన్నారు. సినిమా థియేటర్ల నిర్వహణకు ఇప్పటివరకు నగరాల్లో అయితే సంబంధిత పోలీసు కమీషనర్లు, జిల్లా కేంద్రాలు, పట్టణాల్లో అయితే ఆయా జిల్లాల అడిషనల్ కలెక్టర్లు జారీ చేసేవారని, ఇకనుండి ఈ అనుమతులన్నింటినీ ఆన్లైన్ విధానం ద్వారా జారీచేయడానికి రాష్ట్ర ప్రభుత్వ హోమ్ శాఖ తో చర్చించి విధివిధానాలు రూపొందించడం జరుగుతుందని వెల్లడించారు. ఈ వెబ్‌సైట్ రూపకల్పనకు సంబంధించి తగు సలహాలు, సూచనలు ఇవ్వాల్సిందిగా చిత్ర పరిశ్ర ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులను ఆయన కోరారు. ఈ వెబ్ సైట్ ను పూర్తి స్థాయిలో రూపొందించిన అనంతరం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , రాష్ట్ర సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకటరెడ్డి ప్రారంభిస్తారని తెలిపారు. .

# ఆర్‌టిసిలో కార్మిక సంఘాలను పునరుద్ధరించాలి

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేఖరాసిన టిజిఎస్ ఆర్‌టిసి ఇయు ప్రధాన కార్యదర్శి ఈదురు వెంకన్న

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** టిజిఎస్ ఆర్‌టిసిలో కార్మిక సంఘాల పునరుద్ధరణపై ప్రభుత్వం తక్షణ నిర్ణయం తీసుకోవాలని టిజిఎస్ ఆర్‌టిసి ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఈదురు వెంకన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈమేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఈదురు వెంకన్న లేఖరాశారు. 2014లో బిఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత తొమ్మిది ఉద్యోగ సంఘాల గుర్తింపును రద్దు చేసిందన్నారు. 2019 డిసెంబరులో వెల్ఫేర్ కమిటీల పేరుతో ఆర్‌టిసిలో యూనియన్ ఎన్నికలు జరపబోమని మౌఖిక ఆదేశాలు ఇచ్చిందని గుర్తు చేశారు. దీనివల్ల ఆర్‌టిసి కార్మికులు ఎన్నో సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. 2023 ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ తమ మేనిఫెస్టోలో ఆర్‌టిసి ట్రేడ్ యూనియన్లను పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. 2024 అక్టోబర్‌లో ముఖ్యమంత్రితో జరిగిన ప్రత్యక్ష భేటీలోనూ అదే మాట ఇచ్చారని వెంకన్న తెలిపారు. అయితే ఇప్పటివరకు ఆ వాగ్దానం నెరవేరలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల రద్దయిన తొమ్మిది ఉద్యోగ సంఘాలకు మళ్లీ గుర్తింపు కల్పించినా, ఆర్‌టిసి కార్మిక సంఘాల ప్రస్తావన లేకపోవడం దురదృష్టకరమన్నారు. ఇటీవల తొమ్మిది ఉద్యోగ సంఘాలకు గుర్తింపు తిరిగి ఇచ్చినా, ఆర్‌టిసి కార్మిక సంఘాలను మాత్రం ప్రస్తావించకపోవడం తమ మనోభావాలను దెబ్బతీసిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్‌టిసి కార్మికుల సమస్యలను పరిష్కరించడానికి, ట్రేడ్ యూనియన్లపై ఉన్న ఆంక్షలను ఎత్తివేసి, తక్షణమే పునరుద్ధరించాలంటూ ముఖ్యమంత్రిని కోరారు. ఈ లేఖ ప్రతులను ఆర్థిక మంత్రి, రవాణా శాఖ మంత్రి, కార్మిక శాఖ మంత్రి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, సంబంధిత ముఖ్యకార్యదర్శులు, కార్మిక శాఖ కమిషనర్, టిజిఎస్ ఆర్‌టిసి వైస్ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్‌కు పంపించామన్నారు.

# విద్యార్థిని మృతి

(మొదటి పేజీ తరువాయి)

ఆహారం తీసుకోలేక బలహీనంగా మారింది. సదరు ఆర్ఎంపి బాలికకు ఇంజెక్షన్ చేయడంతో వెంటనే బాలిక వాంతులు చేసుకోవడం ప్రారంభించిందని, ఆమె పరిస్థితి ఇబ్బందికరంగా మారి శ్వాస పీల్చుకోవడానికి ఇబ్బంది పడింది. అక్కడే ఉన్న స్థానికులు, బంధువులు బాలికకు సిపిఆర్ తదితర ప్రక్రియలు నిర్వహించారు. అయినప్పటికీ బాలిక ప్రాణాపాయస్థితికి చేరుకోవడంతో 108లో కోదాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా బేతవోలు సమీపంలోనే ప్రాణాలు విడిచింది. ఆసుపత్రికి చేరుకున్నాకా బాలికను పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతి చెందిందని ధృవీకరించారు. దీంతో బాలిక తల్లిదండ్రులు, బంధువుల రోదనలు మిన్నంటాయి. ఈ విషయమై చిలుకూరు ఎస్ఐని సంప్రదించగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

# భారీ వర్షాలు

(మొదటి పేజీ తరువాయి)

గాలులు వీచే అవకాశం ఉం దన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు రాబోయే మూడు రోజు ల పాటు ఈదురు గాలులు, వర్షాలతో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సోమవారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, నిర్మల్, నిజామాబాద్, పెద్దపల్లి, భూపాలపల్లి, ము లుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాద్, వ రంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే సూచనలున్నాయని చెప్పారు. మంగళవారం ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాల్లో అక్కడక్కడ కురిసే అవకాశం ఉందన్నారు. ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. బుధవారం సిద్దిపేట, రంగారాఎడ్డి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ, గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ భారీ వానలు కురిసే అవకాశం ఉందన్నారు. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్‌ను జారీ చేశామన్నారు.

# ఎస్ఐఆర్ పూర్తిగా రద్దు

(మొదటి పేజీ తరువాయి)

కోర్టు స్పష్టం చేసింది. అయితే బిహార్ ప్రత్యేక సమగ్ర సవరణ కసరత్తుకు వ్యతిరేకంగా పిటిషనర్లు అక్టోబరు 7న దేశవ్యాప్తంగా ప్రత్యేక సమగ్ర సవరణపై కూడా వాదించడానికి ధర్మాసనం అనుమతించింది. సెప్టెంబరు 30న తుది ఓటర్ల జాబితాను ప్రచురించడం వల్ల కేసు తీర్పులో ఎలాంటి తేడా ఉండదని సుప్రీంకోర్టు స్పష్టంచేసింది. 'ఓటర్ల జాబితా తుది ప్రచురణ వల్ల మనకు ఎలాంటి తేడా వస్తుంది?. కొంత చట్టవిరుద్ధం జరిగిందని మేం భావిస్తే దానిని పక్కన పెట్టవచ్చు' అని ప్రత్యేక సమగ్ర సవరణ కసరత్తును సవాల్ చేసిన పిటిషనర్లకు ధర్మాసనం తెలిపింది. ఈలోగా బిహార్ ప్రత్యేక సమగ్ర సవరణలో ఆధార్ కార్డును 12వ నిర్దేశిత పత్రంగా చేర్చాలని ఎన్నికల సంఘాన్ని ఆదేశించిన సెప్టెంబరు 8న అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన ఉత్వర్వులను ఉపసంహరించుకోవాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టు నోటీస్ జారీచేసింది. ప్రారంభంలో ఎన్నికల సంఘం తరపున హాజరైన సీనియర్ న్యాయవాది రాకేశ్ ద్వివేదీ ప్రత్యేక సమగ్ర సవరణపై తుది అంచనా వేసే వరకూ కోర్టు విచారణ జరపాలని ధర్మాసనాన్ని అభ్యర్థించారు. అసోసియేషన్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ (ఎడిఎ) తరపున హాజరైన సీనియర్ న్యాయవాది గోపాల్ శంకర్‌నారాయణన్ మాట్లాడుతూ ఎస్ఐఆర్ ప్రక్రియను నిర్వహించడానికి భారత ఎన్నికల సంఘం ఇతర రాష్ట్రాలలోనూ సన్నాహాలు చేస్తోందని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. రాష్ట్రీయ జనతా దళ్ తరపున హాజరైన న్యాయవాది ప్రశాంత్ భూషణ్ తన వాదనను వినిపిస్తూ ఎన్నికల సంఘం నియమాలు వారి సొంత మ్యానువల్‌కు విరుద్ధంగా వ్యవహరిస్తోందని తెలిపారు. దీనిపై స్పందించిన ధర్మాసనం ఎన్నికల సంఘం రాజ్యాంగ బద్ధమైన సంస్థ కాబట్టి అది చట్టాన్ని, నియమాలను పాటిస్తుంది' అని వివరించింది. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కసరత్తు ఫలితాలలో బిహార్‌లో మొత్తం నమోదు అయిన ఓటర్ల సంఖ్యను 7.9 కోట్ల నుండి 7.24 కోట్లకు తగ్గించాయి.

# వ్యాఖ్యలు సరికాదు

(మొదటి పేజీ తరువాయి)

దేశంలో ఉన్న వివిధ రాష్ట్రాల గవర్నర్ లందరూ ఆర్ఎస్ఎస్ మూలాలకు చెందిన వారిని పేర్కొన్నారు. వారంతా కేంద్రానికి తోత్తులుగా మారి రాష్ట్రాల్లో సమాంతర పాలన చేస్తూన్నారని పేర్కొన్నారు. బిజెపి ఆర్ఎస్ఎస్ నేతలకు తెలంగాణ సాయుదపోరాటం పై మాట్లాడే అర్హత లేదని వ్యాఖనించారు. ఇటు స్వతంత్ర పోరాటంలోనూ వారికి ఇసుమంత పాత్ర లేదని గుర్తు చేశారు. బిజెపిల నుండి ఒక్కరైనా జైలుకు వెళ్లారా ఒక లాటి దెబ్బ తిన్నారా ఒక తూటాని ఎదుర్కొన్నారు అంటూ ఘాటుగా ప్రశ్నించారు. దేశం కోసం ప్రాణాలు అర్పించిన వారిలో తమవారు లేకపోవడం తో తమకు సంబంధం లేని వారి త్యాగాలను వాడుకుంటున్నరని, శవాలను కూడా అద్దెకు తీసుకుని తమ రాజకీయ పబ్బం గడుపుకుంటున్నారని నారాయణ చురక లు అంటించారు.

**వక్ఫ్‌పై సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తున్నాం :**

వక్ఫ్ (సవరణ) చట్టంలోని అనేక కీలక నిబంధనలను నిలిపివేస్తూ (హోల్డ్ చేస్తూ) సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామని జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ అన్నారు. న్యూఢిల్లీలోని ఎపి భవన్ వద్ద సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కేంద్రం లోని బిజెపి ప్రభుత్వం మంద బలంతో చేసిన చట్టంపై సుప్రీం కోర్టు స్పందనపై హర్షం వ్యక్తం చేశారు. సిపిఐ ముందు నుంచి ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం వైఖరినీ ఖండిస్తూనే ఉందని, బిల్లు చట్ట రూపం పొందక ముందే జాయింట్ పార్లమెంటరీ కమిటీకి పంపాలని కోరామని ఆయన గుర్తు చేశారు.అంబేద్కర్ అందించిన భారత రాజ్యాంగం ప్రకారం ఒక శాతం ఉన్న ప్రజలకు కూడా మతపరమైన హక్కులు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ విషయంలో సుప్రీం కోర్టు తీర్పు కేంద్రం ప్రభుత్వ ఏక పక్ష వైఖరికి చంపపెట్టు లాంటిదని పేర్కొన్నారు.

**ప్రధానమంత్రి మణిపూర్ పర్యటన మోసపూరితం :**

ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చేపట్టిన అసోమ్, మణిపూర్ పర్యటన పూర్తిగా మోస పూరిత్తమైందని నారాయణ పేర్కొన్నారు. మణిపూర్‌లో అక్కడి సమాజం రెండు వర్గాలుగా విడిపోయి గత మూడేళ్లుగా తీవ్రమైన ఘర్షణ పడుతున్నా ప్రధాని ఏమి పట్టనట్లుగా వ్యవహరించారని అగ్రహం వ్యక్తం చేశారు. మోదీ ఇప్పుడు అక్కడకి వెళ్లి అప్పటికే నిర్మాణమై, ఉపయోగం లో ఉన్న పాత భవనాలను మళ్ళీ ప్రారంభించడం తప్ప సాధించింది ఏమి లేదన్నారు.

# రాజీనామాకు చేయాల్సిందే

(మొదటి పేజీ తరువాయి)

నియంత పాలన సాగిస్తున్నారని ప్రదర్శకులు నిరన తెలియజేశారు. ఈ మేరకు వారు ప్లకార్డులు, పెద్ద పెద్ద బ్యానర్లు ప్రదర్శించారు.

కాగా సోమవారం టర్కీ సుప్రీంకోర్టు ఓజుర్గ్ ఓజుల్‌పై దాఖలైన కేసు విచారణను వాయిదా వేసింది. ప్రధాన ప్రతిపక్ష నాయకుణ్ణి చట్టబద్ధంగా వెలివేసేందుకు ప్రభుత్వం చేసిన కుట్ర సఫలమైతే దేశంలో నియంతృత్వమే రాజ్యమేలుతుందని ప్రదర్శకులు విమర్శించారు. అవినీతికి, ఉగ్రవాద చర్యలకు పాల్పడ్డారనే పేరుతో వందలాదిమంది ప్రతిపక్ష రిపబ్లికన్ పీపుల్స్‌పార్టీ కార్యకర్తలను ప్రభుత్వం ఇప్పటికే జైళ్ళల్లో నిర్బంధించింది. ఇలా జైలులో నిర్బంధానికి గురైనవారిలో ఇస్తాంబుల్ నగర మేయర్, దేశాధ్యక్షుడు ఎర్డొగాన్ ప్రధాన ప్రత్యర్థి ఎక్రమ్ ఇమామోగ్లూ కూడా ఉన్నారు. ఎర్డొగాన్ దాదాపు ఇరవై సంవత్సరాలుగా దేశ ప్రధానమంత్రిగా, అధ్యక్షుడుగా బాధ్యతలు కొనసాగిస్తున్నారు. 2028 వరకూ ఆయన అధ్యక్షుడుగా కొనసాగుతారు. దేశ న్యాయస్థానం ఎర్డొగాన్ ప్రభుత్వం గుప్పెట్లో నలిగిపోతోందని, దేశంలో ప్రజాస్వామ్యం నశించిందని ప్రతిపక్షాలు తీవ్ర విమర్శలు చేస్తుండగా, ప్రభుత్వం ఈ విమర్శలను ఖండించింది. దేశంలో న్యాయవ్యవస్థ స్వంతంత్రంగా పనిచేస్తోందని పేర్కొంది. గడచిన వారం రోజులుగా ప్రజలు ఎర్డొగాన్‌కు వ్యతిరేకంగా వీధుల్లోకి వచ్చారు. ఎర్డొగాన్ రాజీనామా చేయాలని ఆదివారంనాడు తాజాగా వేలాదిమంది అంకారా వీధుల్లో నినాదాలు చేశారు. ఎర్డొగాన్ పతనం తప్పదని, ప్రతిపక్షాలు విజయం సాధిస్తాయని ఇస్తాంబుల్ కేంద్రంగా పనిచేస్తున్న బుద్ధిజీవుల సంస్థ ఇస్తాన్‌పోల్ ఇనిస్టిట్యూట్ కో–డైరెక్టర్ సెరెన్ సెల్విన్ కోర్క్‌మజ్ అన్నారు.




Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president Palla Venkat Reddy, Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Plot No 302, Venkata Sai Towers, Nehrunagar, KHAMMAM 507 002 Telangana State. RNI TELTEL /2018/76759, Editor : Makkena Subbarao, E-mail : editorprajapaksham@gmail.com